24. 3. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

మంగళవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 288 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## తెలంగాణ కేబినేట్ భేటీ

- పలు బిల్లులపై చర్చించిన మంత్రివర్గం
- గిగ్ వర్కర్లకు బిల్లు తెచ్చే ప్రతిపాదన
- మెట్రో స్వాధీన ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్ణయం
- అడ్వకేట్స్ రక్షనకు చట్టం రూపొందించే ఆలోచన
- సిఎం రేవంత్ అధ్యక్షతన కేబినేట్ భేటీలో పలు నిర్ణయాలు

**హైదరాబాద్,మార్చి23( వెలుతురు):**

ఈ అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపెట్టాలసిన మొత్తం 3 లో..

## హైదరాబాద్ అభివృద్ధికి

# అందరూ సహకరించాలి

- మూసీ ప్రక్షాళనతోనే కాలుష్య నివారణ సాధ్యం
- నగరంలోని పరిశ్రమలు ఓఆర్ఆర్ అవతలకు తరలింపు
- రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరణ
- ఎలివేటెడ్ కారిడార్లతో అద్భుత నగరంగా హైదరాబాద్
- గుడ్ గవర్నెన్స్ కాదు... మాది స్మార్ట్ గవర్నెన్స్
- శాసమండలిలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

విద్యుత్ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

ఆరోగ్యశ్రీని రూ.5 నుంచి రూ.10 లక్షలకు పెంచాం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,మార్చి23 వెలుతురు:**

ఎలివేటెడ్ కారిడార్లతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామని చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రూపురేఖలు మార్చేందుకే క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ తీసుకొస్తున్నామని వ్యాఖ్యానించారు. కాలుష్యకారక పరిశ్రమలను ఓ ఆర్ ఆర్ బయటకు తరలిస్తామని తెలిపారు. నగరంలో ఉన్న పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తే.. ఆ భూములను మల్టీజోన్స్‌గా వినియోగించుకోవచ్చని వివరించారు. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ఎందుకు సహకరించ లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సూచన మేరకే మెట్రోను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రూ.15 వేల కోట్లతో మెట్రోను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఏ రాష్ట్రంలోనైనా ఎయిర్‌పోర్టులకు మెట్రో కనెక్టివిటీ ఉంటుందని.. కానీ తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. జూన్, జులైలోపు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పంజాగుట్ట, హైటెక్‌సిటీ, జూబ్లీహిల్స్‌లో ఎలివేటెడ్ కారిడార్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరిస్తామని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బేగంపేట ఎయిర్‌పోర్టు మధ్య నుంచి అండర్‌పాస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. సిగ్నల్స్ దగ్గర వాహనాలు ఆగకుండా వెళ్లాలనేదే తమ ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలే కొన్ని ప్రమాదాలకు కారణమని అన్నారు. చిరు వ్యాపారులకు ఇబ్బంది ఉన్నా ఆక్రమణలు తొలగిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీ మాదిరిగా కాలుష్య నగరం కాకూడదనే హిల్ట్ పాలసీ తీసుకువచ్చామని వివరించారు. ప్రతిపక్షాల నేతలు హిల్ట్‌పాలసీపై ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేయొద్దని హితవు పలికారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. నగరం నుంచి బయటకు 2 లో..

## ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

- యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు ,
- లోక్‌సభలో ప్రధాని మోడీ వెల్లడి



**న్యూఢిల్లీ,మార్చి23 వెలుతురు:**

పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలుగా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోదీ.. భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొ చ్చిందని మోదీ అన్నారు. ప్రజలపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు. పశ్చిమాసియాలో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్ సభలో చెప్పారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా వెనక్కి వచ్చారని మోదీ 3 లో..

## డ్రగ్స్ కేసులో కీలక పరిణామం

- నిందితులకు మూడురోజుల పోలీస్ కస్టడీ

**హైదరాబాద్,మార్చి23 వెలుతురు:**



మొయినాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టైన నిందితులను పోలీస్ కస్టడీకి ఇవ్వడానికి కోర్టు అనుమతి ఇచ్చింది. మొయినాబాద్ డ్రగ్స్ 2 లో..

## విద్యుత్‌శాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణం

- రెండు కుటుంబాలకు కోటి చొప్పున చెక్కులు అందచేత 2 లో..



# సకాలంలో ఉద్యోగులకు జీతాల చెల్లింపు

- పెండింగ్ బిల్లులు కూడా త్వరలోనే చెల్లిస్తాం
- బిఆర్ఎస్ వదిలిన మూడు డిఎలు కూడా చెల్లిస్తాం
- బకాయిలు చెల్లించలేక పదవీ విరమణ పెంచారు
- ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్,మార్చి23 వెలుతురు:**

ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15వ తేదీ తర్వాతే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేవారు.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి



ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు చెల్లిస్తున్నాం అని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. బిఆర్ఎస్ నేతలు పెండింగ్ లో పెట్టి వెళ్లిన మూడు డి ఏ ల ను మా ప్రభుత్వం చెల్లించిందని అసెంబ్లీలో చెప్పారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల భారం తప్పించుకునేందుకు గత ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసును మూడు సంవత్సరాలకు పెంచిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పదవి విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. నాలుగవ తరగతి ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంచింది. ఉద్యోగుల పదవీ విరమణ 2 లో..

## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు అరెస్టు అక్రమం..

- అరెస్టులు కాంగ్రెస్ సర్కారు సాగిస్తున్న నిర్భంధ పాలనకు నిదర్శనం
- బి.జె.ఎల్.పి.నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి...

**హైదరాబాద్ వెలుతురు మార్చి 23:**



ఆరు గ్యారంటీల అమలు ఏమైందని ప్రశ్నించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును అరెస్టు చేయడం కాంగ్రెస్ సర్కారు సాగిస్తున్న నిర్భంధ పాలనకు నిదర్శనమని బి.జె.ఎల్.పి.నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రధాన హామీ ఆరుగ్యారంటీలను అమలు చేయాలంటూ బిజెపి ఇవాల తల పెట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం బిజెపి రాష్ట్ర 3 లో..

## మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నాం

- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత మీదే
- బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క

**హైదరాబాద్,మార్చి23 వెలుతురు:**



తెలంగాణ అసెంబ్లీలో బ్జడెట్ చర్చలు వాడివేడిగా సాగుతున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన విమర్శలపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా 2 లో..

## ఎన్నికల అజెండా విస్మరించిన కాంగ్రెస్

- రైతుబంధును 15 వేలు అని, 12వేలకు కుదింపు
- బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయరా?
- బడ్జెట్పై చర్చలో బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్,మార్చి23 వెలుతురు:**

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, తర్వాత దానిని రూ.12 వేలకు తగ్గించారని అన్నారు. మూడో పంటకు 2 లో..



## సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో మోడీ

- అభినందనలు తెలుపుతో ఎక్స్‌లో పవన్ పోస్ట్ 2 లో..

## బియ్యం ఎగుమతులపై అసెంబ్లీలో మాటల యుద్ధం

- అక్రమాలు జరిగాయన్న హరీష్ రావు,
- హౌజ్ కమిటీ వేయాలని డిమాండ్
- హరీష్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,మార్చి23 వెలుతురు:**



:బియ్యం రవాణాపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసత్యాలు చెప్పారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం పంపడంలో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సీబీఐ, ఈడీ కేసులున్న ప్రేమ్‌చంద్ గార్గ్‌ను సలహాదారుగా పెట్టుకున్నారని ఆక్షేపించారు. ఆయన ఇప్పుడు ఎక్కడ ఉన్నారో ప్రభుత్వం చెప్పాలని హరీశ్ ప్రశ్నించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ అంశంపై మాట్లాడారు. 2 లో..

## ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు..

# స్టీల్ సిటీకి ఫౌండేషన్




- ఈజ్ ఆఫ్ డూయింగ్ కాదు.. స్పీడ్ ఆఫ్ డూయింగ్
- ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు
- ఉత్తరాంధ్ర సరికొత్త చరిత్రరాయబోతోంది
- స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు






**అనకాపల్లి,మార్చి 23 వెలుతురు:**

ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో సరికొత్త చరిత్ర రాయబోతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో విశాఖ ఉక్కు కంటే అతిపెద్ద ప్లాంట్ రాబోతోందని, సోమవారం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా 2 లో..

## సకాలంలో ఉద్యోగులకు జీతాల చెల్లింపు

వయసు పెంచడంతో 17వేల మంది ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాల భారం ప్రజా ప్రభుత్వం పైపడిందని అన్నారు. ఇప్పటికే ఉద్యోగుల మెడికల్ బిల్లులను మొత్తం క్లియర్ చేశాం. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి గత ప్రభుత్వం 40, 150 కోట్లు బకాయిలు పెట్టారు. ఈ విషయంపై సభలో శ్వేత పత్రం విడుదల చేసాం. ఆ బకాయిల్లో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల మొత్తం 4,575 కోట్లు ఉన్నాయని వివరించారు. మా ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేసేందుకు ప్రతినెల 700 కోట్లు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం. రాబోయే రోజుల్లో బకాయిలు త్వరితగతిన క్లియర్ చేసేందుకు ప్రతినెలా చెల్లించి 700 కోట్లను 1000 కోట్లకు పెంచాలని విధానపరమైన నిర్ణయం తీసుకునే ఆలోచన ఈ ప్రభుత్వం చేస్తుందని భట్టి అన్నారు. తాము ప్రతి సమస్యనూ మానవీయ కోణంలోనే చూస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన మూడు డీఏ బకాయిలను గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని చెప్పారు. అవన్నీ త్వరలోనే చెల్లిస్తామని చెప్పారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. పదవీ విరమణ ప్రయోజనాలను గత ప్రభుత్వం చెల్లించలేదు. రిటైర్‌మెంట్ ప్రయోజనాలు చెల్లించలేకే పదవీ విరమణ వయసు పెంచారు. దీంతో మా ప్రభుత్వంపై అదనపు భారం పడింది. గత ప్రభుత్వం రూ.40,154 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. ఉద్యోగులకు కూడా రూ.4,571 కోట్లు బకాయిలు పెట్టింది. సాధ్యమైనంత త్వరగా ఉద్యోగులకు బకాయిలు చెల్లిస్తాం. మానవీయ కోణం ఉంది కాబట్టే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నాం. ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య కార్డులు ఇస్తున్నాం అని చెప్పారు.

## మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నాం

మారిందని, ఇప్పుడు ఆ అప్పులకు వడ్డీలు కట్టడానికే ప్రభుత్వ ఖజానా సరిపోతోందని ఆమె ధ్వజమెత్తారు. పాండవులు సంపాదించింది కౌరవుల తద్దినానికే సరిపోయినట్లు.. మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టడమే మాకు సరిపోతోందని అంటూ ఆమె ఎద్దేవా చేశారు. హరీష్ రావు తన నియోజకవర్గంలోనే రైతులకు అప్పులు ఉన్నాయని చెబుతున్నారని, మరి ఫైనాన్స్ మినిస్టర్‌గా ఉండి కూడా పదేళ్లలో ఎందుకు రుణమాఫీ చేయలేకపోయారని సీతక్క ప్రశ్నించారు. ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి గత ప్రభుత్వం రైతులను వంచించిందని, ఇప్పుడు ఆరు నెలల తమ పాలనపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమమే నిధులు, నియామకాల కోసం జరిగిందని గుర్తు చేసిన సీతక్క, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎంతమంది నిరుద్యోగులకు ఉద్యోగ గ్యారెంటీ ఇచ్చిందని నిలదీశారు. కేవలం నోటిఫికేషన్లు ఇస్తే సరిపోదని, తాము అధికారంలోకి రాగానే వేల సంఖ్యలో నియామక పత్రాలు అందజేసి పేద కుటుంబాల్లో వెలుగులు నింపామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు , నూతనంగా ప్రకటించిన 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాలను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని సీతక్క విమర్శించారు. మీరు పదేళ్లలో ఎన్ని ఇళ్లు ఇచ్చారో లెక్క చెప్పండి.. మేము ఈ రెండేళ్లలో ఎన్ని ఇస్తామో చూపిస్తాం అని ఆమె సవాలు విసిరారు. హరీష్ రావు పడుతున్న బాధ అంతా అధికారం పోయిందనే తప్ప, ప్రజల మీద ప్రేమతో కాదని సీతక్క వ్యాఖ్యానించారు. సీటు మారగానే చరిత్ర మారిపోదని, పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలకు చేయని పనుల గురించి ఇప్పుడు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ప్రజల కోసం తాము చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవద్దని ఆమె సూచించారు.

## సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో మోడీ

**అమరావతి,మార్చి23 వెలుతురు:**

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ప్రధాని నరేంద్ర మోడీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రభుత్వ అధిపతిగా నిరవధికంగా 8,931 రోజుల సేవ పూర్తి చేసిన సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన నరేంద్ర మోడీ రాజకీయ ప్రయాణం, భారత ప్రధానిగా కొనసాగుతూ దేశానికి విశేష సేవలు అందించిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పదవిలో గడిపిన కాలం మాత్రమే కాకుండా, అచంచల సంకల్పం, అలసటలేని కృషి, దేశ సేవకు అంకితమైన జీవితం ప్రధాని మోడీని ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని ఆయన అభిప్రాయపడ్డారు పవన్ కల్యాణ్.. 'గ్రాస్ రూట్ స్థాయి నుంచి గ్లోబల్ స్థాయికి దేశాన్ని నడిపిస్తూ 'నేషన్ ఫస్ట్' సిద్ధాంతంతో పాలనకు కొత్త నిర్వచనం ఇచ్చారు' అని పవన్ కల్యాణ్ అన్నారు. రెండు దశాబ్దాలకు పైగా క్రమశిక్షణ, త్యాగం, అపార కృషితో కొనసాగుతున్న నాయకత్వం దేశ అభివృద్ధికి దోహదపడిందని తెలిపారు. మౌలిక వసతులు, పేదల సాధికారత, డిజిటల్ మార్పులు వంటి రంగాల్లో ప్రధాని మోడీ చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. ప్రపంచ వేదికపై భారత్ ప్రతిష్టను పెంచడంలో కూడా ప్రధాని నరేంద్ర మోడీ పాత్ర కీలకమని పేర్కొన్నారు పవన్ కల్యాణ్? ఈ మైలురాయి నిజమైన నాయకత్వం స్థిరత్వం, నిబద్ధత, స్వార్థరహిత సేవపై ఆధారపడుతుందని గుర్తుచేస్తుందని అన్నారు. ఇక, ప్రధాని మోడీకి మరింత ఆరోగ్యం, శక్తి కలగాలని, దేశసేవలో ఇంకా ఎన్నో సంవత్సరాలు కొనసాగాలని ఆకాంక్షిస్తూ జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు..

## బియ్యం ఎగుమతులపై అసెంబ్లీలో మాటల యుద్ధం

'బియ్యం ఎగుమతి కోసం టెండర్లు పిలిచారా?నాఫెడ్‌కు అనుమతి ఇవ్వకుండా నామినేషన్ పద్ధతిలో ప్రైవేట్ సంస్థకు ఎందుకిచ్చారో చెప్పాలి. కాకినాడ పోర్టులో 7,500 టన్నుల బియ్యం ఉన్నది నిజమా.. కాదా?ఆ పోర్టులో గిడ్డంగి, నిర్వహణ ఛార్జీలు చెల్లిస్తున్నారా?లేదా?బియ్యం రవాణాలో కుంభకోణం జరిగింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగింది. ఈ అంశంపై హౌస్ కమిటీ వేసి నన్ను కూడా సభ్యుడిగా ఉంచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బియ్యం ఎగుమతులపై తెలంగాణ అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, హరీశ్ రావు మధ్య మాటల యుద్ధం సాగింది. ఫిలిప్పైన్ తో కు బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. ఫిలిప్పిన్స్ తో ఒప్పందం కోసం గార్గ్ ను అడ్వైజర్ గా పెట్టుకున్నారని.. గార్గ్ అనే వ్యక్తి ఈడీ ,సీబీఐ కేసులు ఎదుర్కొంటున్నాడని ఆరోపించారు. బియ్యం ఎగుమతుల కోసం ఎంఓయూ కుదుర్చుకున్నారా? అని ప్రశ్నించారు. కాకినాడ పోర్టులో 7 వేల 500 మెట్రిక్ టన్నుల బియ్యం .. ఏడాదిగా ముక్కిపోయాయని విమర్శించారు. బియ్యం ఎగుమతితో సివిల్ సప్లైస్ శాఖకు కోట్ల నష్టం జరిగిందని ఆరోపించారు. బియ్యం ఎగుమతిపై హౌస్ కమిటీ వేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. హరీశ్ వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. ఫిలిప్పిన్స్ తో బియ్యం ఎగుమతులకు ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. బియ్యం ఎగుమతులపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం అని మండిపడ్డారు. ఏమీ తెలియకుండా స్కాం అంటూ హరీశ్ రావు ఆరోపిస్తున్నారని చెప్పారు. షిప్పింగ్ చార్జీలు, గోదాం ఛార్జీలు చార్జీలన్నీ ఫిలిప్పైన్స్ చూసుకుంటుందన్నారు. రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజ కొంటున్నామని చెప్పారు. గత సర్కార్ కంటే ఎక్కువగా రైతులకు మేలు చేస్తున్నామని తెలిపారు. నేరుగా ఫిలిప్పైన్స్ మంత్రితోనే ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. అగ్రి మెంట్ చేసుకుని బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నామని చెప్పారు ఉత్తమ్. మీరు సిఫారసు చేసిన వ్యక్తులకు బియ్యం ఇవ్వకుంటే స్కాం జరిగినట్టేనా అని హరీశ్ ను ప్రశ్నించారు ఉత్తమ్.

## విద్యుత్‌శాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణం

**హైదరాబాద్,మార్చి23 వెలుతురు :**

విద్యుత్ శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులు అందజేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అందేశారు. మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి పది లక్షలకు పెంచాం. సీపెక్ సర్వే ప్రకారం తేలిన కుటుంబాలన్నింటికీ రూ. 5 లక్షల బీమా వర్తిస్తుంది కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం వీధిన పడొద్దని భావనతో కుటుంబ బీమా తీసుకొచ్చాం అని ఈ సందర్భంగా సిఎం అన్నారు.విద్యుత్, సింగరేణి కార్మికులకు రూ. కోటి పైన ప్రమాద బీమా సౌకర్యం కల్పించాం అన్నారు. విద్యుత్ శాఖలో పని చేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఓర్సు సురేశ్, ముక్తార్ బేగ్ కుటుంబ సభ్యులకు రూ.కోటి చొప్పున చెక్కులు రేవంత్ రెడ్డి అందచేశారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యం నింపేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టాం అన్నారు.

# హైదరాబాద్ అభివృద్ధికి అందరూ సహకరించాలి

వెళ్లేందుకే ఎలివేటెడ్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతోపాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎలివేటెడ్ కారిడార్లకు ఎక్కువ భూమి కూడా అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. గతంలో మాదిరిగా నచ్చితే నజరానా.. లేకపోతే జరిమానా విధించే విధానం ఉండదని చెప్పుకొచ్చారు. గుడ్ గవర్నెన్స్ కాదని.. మాది స్మార్ట్ గవర్నెన్స్ అని వ్యాఖ్యానించారు. అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని.. ప్రతిపక్షాలు, ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రతిపక్షాల నేతలు అభివృద్ధిని అడ్డుకోవాలని చూడొద్దని.. ఏవైనా సూచనలు ఉంటే ఇవ్వండి.. స్వీకరిస్తామని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన అత్యంత అవసరమని తెలిపారు. మూసీ కాలుష్యంతో నల్గొండ జిల్లా ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటలు కూడా తినే పరిస్థితి లేదని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను తమ ప్రభుత్వం తీసుకురాలేదని..కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన విధానాన్నే తాము కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గుజరాత్‌లో సబర్మతి ప్రక్షాళనకు కాంగ్రెస్ సహకరించిందని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనకు రాజకీయ రంగు ఎందుకు? అని ప్రశ్నించారు. ఎవరినీ నిరాశ్రయులను చేయం.. పునరావాసం కల్పిస్తామని భరోసా కల్పించారు. ప్రతిపక్షాల నేతలు అడ్డుకోవడం తప్పించి.. ఏ సలహా ఇచ్చినా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరికీ నష్టం కలిగించం.. బాధితులందరినీ ఆదుకుంటామని మాటిచ్చారు. మూసీ పరివాహకంలో ఉన్న అందరికీ మెరుగైన వసతులు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు ఇబ్బందులు తప్పట్లేదని తెలిపారు. హైదరాబాద్‌ను విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశంలో ఐదు మెట్రో నగరాలైన హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు అత్యంత కీలకమైనవని చెప్పుకొచ్చారు. పెట్టుబడులను నగరాల నిర్మాణం, నిర్వహణ నిర్దేశిస్తాయని అన్నారు. నగరాలపైనే రాష్ట్రాల ప్రగతి ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఢిల్లీలో కాలుష్యం వల్లే స్కూల్స్, ఆఫీసులకు సెలవులు ఇస్తున్నారని ప్రస్తావించారు. ముంబైలో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. చెన్నై, బెంగళూరులోనూ ట్రాఫిక్ కష్టాలు తప్పట్లేదని అన్నారు. మానవ తప్పిదాల వల్లే అనేక కష్టాలు వస్తున్నాయని ప్రస్తావించారు. హైదరాబాద్ అంటే లేక్స్ అండ్ రాక్స్ సిటీ అని చెప్పుకొచ్చారు. ఓల్డ్ సిటీగా పిలుస్తున్న ప్రాంతం ఒకప్పుడు ఒరిజినల్ సిటీ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదాయ మార్గాలు మెరుగుపడటంతో ప్రతి కుటుంబంలో కార్లు పెరిగాయి. ట్రాఫిక్ రద్దీ వల్లే మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరించుకున్నాం. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ బాగా పెరిగింది. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తాం. రోడ్లను అండర్‌పాస్‌లు, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్లుగా విభజించాం. ఎక్కడా ట్రాఫిక్ ఆగకూడదనేదే మా లక్ష్యం. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ముందుకు రాలేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల నేపథ్యంలో రూ.15వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకున్నాం. ఈ ప్రాజెక్టును మరో 76 కి.మీ విస్తరిస్తాం. విస్తరణకు కేంద్రం కూడా సానుకూలంగా స్పందించింది. నగర శివార్ల నుంచి వచ్చే ఉద్యోగుల సంఖ్య బాగా పెరిగింది. శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తాం. దీనికోసం కేంద్ర సంస్థలతో మాట్లాడి భూమి తీసుకుంటున్నాం.

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో రోడ్ల విస్తరణకు ఇబ్బందులు ఉన్నాయి. సిగ్నల్ వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నాం. చిరువ్యాపారులకు ఇతర చోట్ల స్థలాలు కేటాయిస్తాం. కొన్నిచోట్ల మల్టీ లెవల్ కారు పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ముందు జాగ్రత్త తీసుకోకుంటే ఢిల్లీ వలే కాలుష్యం పెరిగిపోతుంది. ఓఆర్ఆర్ లోపల పలుచోట్ల రేడియల్ రోడ్లు వేస్తున్నాం. దూరం తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తున్నాం. సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకూ ఇవి వస్తాయి. దీంతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుంది. డ్రైనేజీ వ్యవస్థను మారిస్తే మూసీ సుందరీకరణ త్వరగా పూర్తవుతుంది. 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. క్యూర్‌లో సర్వీస్ సెక్టార్, ప్యూర్‌లో ఇండస్ట్రియల్ సెక్టార్, రేర్‌లో అగ్రికల్చరల్ సెక్టార్ రానుంది. గుజరాత్ అభివృద్ధిలో భాజపాకు కాంగ్రెస్ పూర్తి సహకారం అందించింది. అన్ని పార్టీల నేతలూ ఒక్కటై నగర అభివృద్ధికి కలిసి రావాలని కోరారు.

## విద్యుత్ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను అభినందించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని పేర్కొన్నారు. సీపెక్ సర్వే ప్రకారం రూ. 5 లక్షల బీమా ఆయా కుటుంబాలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం వీధిన పడొద్దనే భావనతో కుటుంబ బీమా తీసుకొచ్చామని అన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యం నింపేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. విద్యుత్, సింగరేణి కార్మికులకు రూ. కోటి పైన ప్రమాద బీమా సౌకర్యం కల్పించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు భారీ ఆర్థిక సాయాన్ని తెలంగాణ అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అందజేశారు. ఉద్యోగుల భద్రతకు, వారి కుటుంబాల భరోసాకు ప్రభుత్వం కట్టుబడి ఉందనే సంకేతాన్ని ఈ కార్యక్రమం ద్వారా చాటి చెప్పామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్, సింగరేణి కార్మికుల కోసం ప్రవేశపెట్టిన ప్రత్యేక ప్రమాద బీమా పథకం కింద భారీ మొత్తాన్ని అందజేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ మరణించిన ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. ఓర్సు సురేశ్ యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఉద్యోగి. ముక్తార్ బేగ్ మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉద్యోగి. వీరి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. కోటి చొప్పున బీమా చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేశారు.

# ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్


ప్లాంట్‌కు భూమి పూజ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'ప్రపంచానికి ఏపీ సత్తా చాటిచెప్పే ప్రాజెక్ట్ ఈ స్టీల్‌ప్లాంట్. ప్రధాని మోదీ సహకారంతోనే ప్లాంట్ ఏర్పాటు సాధ్యమైంది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో మంత్రి లోకేశ్ కృషి ఎంతో ఉంది. అన్నివిధాలా సహకరిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయి. ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్. అని అన్నారు. ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో కొత్తచరిత్ర లిఖిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకంటే.. అతిపెద్ద పరిశ్రమ రాజయ్యపేటలో ఏర్పాటు కాబోతోందన్నారు. ఆర్సెలార్ మిత్తల్ పెట్టుబడిని గొప్ప మలుపుగా అభివర్ణించారు. భారత్‌లోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నక్కపల్లిలో ఏర్పాటు కాబోతోంది. ప్రపంచంలోనే నెంబర్‌వన్ ఉక్కు పరిశ్రమ గా ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ కాబోతోంది. కేంద్రం సహకారం ఉండటం వల్లే ఈ ప్లాంట్ సాధ్యమవుతోందని అన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన చేస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీలను 20 నెలల్లో పూర్తి చేశాం. ఏ పని తలపెట్టినా బేషరతుగా మద్దతిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ఈ ప్రాజెక్టు తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేసిన లోకేశ్‌కు అభినందనలు. 5,465 ఎకరాల్లో ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తాం. ఇవాళ స్టీల్‌ప్లాంట్‌కే కాదు.. స్టీల్ సిటీకి పునాది వేశాం. 2028 డిసెంబర్ నుంచి స్టీల్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ ప్లాంట్ ద్వారా ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు వెళ్తున్నాం. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రికార్డు స్థాయిలో భూ సేకరణ చేశాం అని అన్నారు. దేశంలోనే పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానం. ఏపీలో ఉన్నన్ని వనరులు ఎక్కడా లేవు. అద్భుత విజయాలకు పెట్టుబడిదారులు ఏపీని కేంద్రంగా చేసుకోవాలి. ఇప్పటికే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మూడేళ్లలో 22 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. విశాఖను ప్రపంచస్థాయి నగరంగా చేస్తాం. విశాఖ, అమరావతి, తిరుపతిని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తాం. రేర్ ఎర్త్ మినరల్స్ హబ్‌గా విశాఖ తయారవుతుందని చంద్రబాబు అన్నారు. ఏపీలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందిస్తు న్నాం. కేంద్రం సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతోంది. ప్లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులకు రుణపడి ఉంటాం. అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. క్వాంటమ్ వ్యాలీకి కేరాఫ్‌గా అమరావతి మారబోతోంది. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజలకు అధిక ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆర్సెలార్ పెట్టుబడులు తమలో విశ్వాసం మరింత పెంచాయని అన్నారు. చంద్రబాబు వంటి దార్శనిక నేత ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, చంద్రబాబు వల్లే ఏపీకి పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా కూడా చెప్పారని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. భూమిపూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీలో పెట్టుబడులు పెడుతున్న స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ద్వారా లక్షమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అధికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. 'ఆర్సెలార్ స్టీల్‌ఎ÷-లాంట్ పెట్టుబడులు మాలో విశ్వాసాన్ని పెంచాయి. పెట్టుబడులు రావాలంటే దార్శనికత ఉన్న నేత కావాలని ఎన్నికల్లో చెప్పాను. లక్ష్మీ మిత్తల్‌ను ఒప్పించి పెట్టుబడులు తీసుకురావాలంటే చంద్రబాబు వల్లే సాధ్యం. రాజకీయ ధురంధరుడు చంద్రబాబు వల్లే పెట్టుబడులు వస్తున్నాయి. అదే విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా చెప్పారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ఎ÷-లాంట్ ఏర్పాటు కాబోతోందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని 2019లోనే ఆదిత్య మిట్టల్‌ను కోరామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. 2024లో అధికారంలోకి రాగానే స్టీల్‌ఎ÷-లాంట్ కోసం ప్రయత్నాలు చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు గమ్యస్థానమన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ప్రపంచ పటంలో అనకాపల్లి ఉంటుందని వెల్లడించారు. ఎ÷-లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. పెట్టుబడిదారుల్లో సీఎం చంద్రబాబు విశ్వాసం నింపారని, ప్లాంట్‌కు కేంద్రమంత్రి కుమారస్వామి వేగంగా అనుమతులు ఇచ్చారని లోకేశ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనే ఏపీ ప్రజలకు మేలు జరుగుతుందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. లోకేశ్ తండ్రికి తగ్గ తనయుడంటూ ప్రశంసించారు. నారా లోకేశ్ మంచి భవిష్యత్తు ఉన్న నాయకుడన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఉక్కు రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలిపారు. విశాఖ ఉక్కును ఆర్థికంగా ఆదుకున్నామని వెల్లడించారు. చంద్రబాబు శ్రద్ధ, చొరవతో ఏపీ శరవేగంగా దూసుకుపోతోందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ వల్ల ఏపీ ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు ఆర్థికంగా మద్దతిచ్చాం. విశాఖ ఉక్కు పరిశ్రమలో ఉత్పత్తి పెంచేలా చర్యలు చేపట్టాం అని అన్నారు.

# ఎన్నికల అజెండా విస్మరించిన కాంగ్రెస్

రైతుబంధు ఇవ్వాలని అడిగిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒక సీజన్‌కే ఇస్తున్నారని అన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు శాసనసభలో మాట్లాడారు. ఒక సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టి రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు. ' మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లు ఎకరాకు రూ.15వేలు చొప్పున రైతు భరోసా ఇవ్వాలి. బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారు. రెండు బడ్జెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బడ్జెట్‌లో మాయమైంది. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, రెండు బడ్జెట్‌లలో పెట్టారు. ఒక్కసారి కూడా ఇవ్వలేదు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బడ్జెట్‌లో చెప్పారు. ఈసారి ఆ ప్రస్తావనే లేదని హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరిగారు. బడ్జెట్‌పై చర్చలో భాగంగా అసెంబ్లీలో మాట్లాడిన ఆయన.. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో లోపాలను ఆయన ఎండగొట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చామని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మూడు సీజన్‌లలో రైతు భరోసాను ఎగ్గొంటిందని అన్నారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేలు రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు ఎన్నికల అజెండాలో కూడా పెట్టారని హరీష్‌రావు గుర్తుచేశారు. తొలి బడ్జెట్‌లో ప్రకటించి, ఆ తర్వాత దాన్ని రూ.12 వేలకు తగ్గించారని మండిపడ్డారు. మా ప్రభుత్వాన్ని మూడో పంటకు కూడా రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఒక ఒక పంటకే ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏటా ఒక సీజన్‌కే రైతు భరోసా ఇస్తూ.. రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.'మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లుగా ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారని విమర్శించారు. రెండు బడ్జెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బడ్జెట్‌లో మాయమైందని అన్నారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని కూడా రెండు బడ్జెట్‌లలో పెట్టారని, కానీ ఒక్కసారి కూడా ఇవ్వలేదని చెప్పారు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బడ్జెట్‌లో చెప్పారని, ఈసారి బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదని హరీశ్‌రావు దుయ్యబట్టారు.

ఈ ప్రభుత్వం ఎక్సైజ్ ఆదాయాన్ని వచ్చే ఏడాదికల్లా రూ.12 వేల కోట్లు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం 34 వేల కోట్లుగా ఉన్న ఎక్సైజ్ ఆదాయాన్ని రూ.46 వేల కోట్లకు ఎట్లా పెంచుతారని, ఊరూరుకు బార్లు ఓపెన్ చేస్తారా..? అని నిలదీశారు. దాంతో ఎక్సైజ్ మంత్రి జూపల్లి కలుగజేసుకుని కాంగ్రెస్ హయాంలో రూ.12 వేల కోట్లుగా ఎక్సైజ్ ఆదాయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.36 వేల కోట్లు పెంచిందని అన్నారు. జూపల్లి కలుగజేసుకోవడంపై హరీష్‌రావు అసహనం వ్యక్తంచేశారు. తన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కగారు సమాధానం చెప్పాలని అన్నారు. తాను బడ్జెట్‌పై ప్రశ్నలు అడుగుతున్నానని, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన సబ్జెక్టుపై కాదని చెప్పారు. ఈ సందర్భంగా తలసాని జోక్యం చేసుకుని ప్రభుత్వ తీరును విమర్శించారు.

## డ్రగ్స్ కేసులో కీలక పరిణామం



కేసులో నిందితులుగా ఉన్న పైలెట్ రోహిత్‌రెడ్డి, రితేష్‌రెడ్డి, నమిత్ శర్మలను మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని ఉప్పర్‌పల్లి కోర్టు ఆదేశించింది. విచారణలో భాగంగా మరిన్ని వివరాలు రాబట్టేందుకు పోలీసుల అభ్యర్థనపై కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. కోర్టు అనుమతితో నిందితులను రేపటి నుంచి కస్టడీకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టనున్నారు. ఈ కేసులో డ్రగ్స్ సరఫరా, నెట్‌వర్క్‌కు సంబంధించిన కీలక విషయాలను వెలికితీయాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, కస్టడీ విచారణలో మరిన్ని కీలక వివరాలు బయటపడే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.

# తెలంగాణ కేబినేట్ భేటీ

10 కీలక అంశాలపై కకేబినేట్‌లో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. సభలో ప్రవేశపెట్టాల్సిన మూడు ముఖ్య బిల్లులపై కేబినెట్ సభ్యులు సమగ్రంగా చర్చించారని సమాచరం. ముఖ్యంగా గిగ్ వర్కర్ల సంక్షేమ బిల్లుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సోమవారం సాయంత్రం జరిగింది. రాష్ట్రంలో సుమారు 3 నుంచి 4 లక్షల మంది గిగ్ వర్కర్లకు ప్రయోజనం చేకూరేలా ఈ బిల్లును రూపొందించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ బిల్లులో గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందించే విధంగా ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా కోర్ అర్బన్ యాక్ట్ డ్రాఫ్ట్ బిల్లుపై కూడా కేబినెట్‌లో చర్చ కొనసాగినట్లు సమాచారం. మొత్తంగా ఈ కేబినెట్ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.విద్వేషపూరిత ప్రసంగాలు.. నేరాల నిరోధక బిల్లు, తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల బిల్లు, తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లులకు ఆమోదం తెలిపింది. ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రో స్వాధీన ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం తరపున లావాదేవీల నిర్వహణ బాధ్యతను హెచ్ఎంఆర్ఎల్‌కు అప్పగించింది. కులగణనపై జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కమిటీ ఇచ్చిన నివేదికకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. నిపుణుల కమిటీ నివేదికను పరిశీలించే బాధ్యత క్యాబినెట్ సబ్‌కమిటీకి అప్పగించింది. రోహిత్ వేముల చట్టం విధివిధానాల కోసం సబ్ కమిటీ ఏర్పాటు చేస్తూ తీర్మానించింది. ఈ కమిటీ ఛైర్మన్‌గా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కమిటీ సభ్యులుగా మంత్రులు దామోదర రాజనరసింహా, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్, పొన్నం ప్రభాకర్ వ్యవహరించనున్నారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు అరెస్టు ఆక్రమం..

అధ్యక్షుడు రాంచందర్ రావుతో పాటు పలువురు పార్టీ నేతలను అరెస్టు చేయడం అప్రజాస్వామికం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 27 నెలలు దాటినా ఇచ్చిన హామీలను ప్రధానంగా ఆరు గ్యారంటీలను అమలు చేయకపోవడాన్ని ప్రశ్నిస్తూ ఛలో అసెంబ్లీ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు గారిని అరెస్టు చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషనుకు తరలించడం కాంగ్రెస్ సర్కారు సాగిస్తున్న నిర్బంధకాండకు అద్దం పడుతోంది. ఛలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా శాసనసభ ముందు బిజెపి తలపెట్టిన శాంతియుత నిరసన కార్యక్రమాన్ని అనుమతించకపోవడం కాంగ్రెస్ సర్కార్ నియంతృత్వ పోకడలకు నిదర్శనం. అసెంబ్లీ ఎన్నికలపుడు అలవికాని హామీలిచ్చిన కాంగ్రెస్ ... అధికారంలోకి వచ్చి 27 నెలలు దాటినా వాటిని అమలు చేయకపోవడమే కాకుండా, ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారంటూ ప్రశ్నించిన బిజెపి నేతలను నిర్దాక్షిణ్యంగా అరెస్టు చేయడం, కాంగ్రెస్ సర్కార్ అసమర్థ పాలనకు నిదర్శనం. ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిపక్ష పార్టీల నేతలెవరూ ప్రశ్నించ రాదనేలా ప్రభుత్వం సాగిస్తున్న నియంతపోకడలను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కార్ ఎప్పుడు అమలు చేస్తుందంటూ బిజెపి లేవనెత్తిన ప్రశ్నలకు చాతనైతే రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం సమాధానాలు చెప్పాలే తప్ప, నేతల అరెస్టులతో బిజెపి నేతల గొంతులు నొక్కలేదు. గత బీఆర్ఎస్ సర్కార్ కూడా ఇలాగే ప్రశ్నించే గొంతులను అడ్డుకునేందుకు అరాచకపాలన సాగించి అధికారాన్ని కోల్పోయింది. రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం ఇలాగే అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే కేసిఆర్ సర్కారుకు పట్టిన గతే వీరికి పడుతుంది. ఎన్నికల హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న బిజెపి నేతలకు సమాధానం చెప్పడం చేతకాని చవట, దద్దమ్మ కాంగ్రెస్ సర్కార్.. ప్రతిపక్ష బిజెపి నేతలను అరెస్టులతో కట్టడి చేయాలనుకోవడం దారుణం, దుర్మార్గం. అరెస్టులకు భయపడి ప్రభుత్వ వైఫల్యాలను లేవనెత్తమనే ఆలోచనలో ఉన్న కాంగ్రెస్ పెద్దలకు భంగపాటు తప్పదు. బిజెపి నేతలు మరింత గట్టిగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటారు. కాంగ్రెస్ సర్కార్ సాగిస్తున్న ప్రజావ్యతిరేక పాలనపై బిజెపి రాజీలేని పోరాటం చేస్తుందే తప్ప మడమ తిప్పదు.




# బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు అరెస్ట్ దుర్మార్గం

హైదరాబాద్ వెలుతురు మార్చి 23:

- 6 గ్యారంటీల అమలుపై ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపితే అరెస్ట్ చేస్తారా?
- ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ను ఏం చేయాలి?
- తక్షణమే రామచంద్రరావుసహా బీజేపీ కార్యకర్తలను బేషరతుగా విడుదల చేయాలి
- లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 27 నెలలైనా 6 గ్యారంటీలను అమలు చేయకపోవడం సిగ్గు చేటు
- ఓట్ల కోసం, అధికారం కోసం ఎంతకైనా దిగజారే నైజం కాంగ్రెస్ దేనని తేలిపోయింది
- అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని మరింత దివాళా తీస్తున్నరే తప్ప 6 గ్యారంటీలను అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు
- 6 గ్యారంటీల అమలయ్యేదాకా కాంగ్రెస్ నేతలను అడుగడుగునా నిలదీస్తాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



# అన్నదాత కన్నీరు - దేశ భవిష్యత్తుకు ముప్పు



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

*భారతదేశం అంటే కేవలం నగరాలు, పరిశ్రమలు మాత్రమే కాదు, పచ్చని పొలాలు, చెమట చిందించే రైతన్నలు కలిసిన ఒక జీవన చిత్రం. సహస్రాబ్దాలుగా మన దేశం వ్యవసాయ ప్రధాన దేశంగా విరాజిల్లుతోంది. జై జవాన్, జై కిసాన్ అనే నినాదం గాలిలో మారుమోగుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. నేడు వ్యవసాయం ఒక లాభసాటి వృత్తిగా కాక, ఒక భారంగా మారుతోంది. ఈ వెన్నెముక గనుక విరిగితే, దేశ ఆర్థిక వ్యవస్థే కాదు, మన మనుగడే ప్రశ్నార్థకమవుతుంది.మన దేశ జనాభాలో దాదాపు 58 శాతం మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. జాతీయ స్థూల ఉత్పత్తి (GDP) లో దీని వాటా గణాంకాల ప్రకారం 18 శాతంగా కనిపిస్తున్నప్పటికీ, దీని ప్రాముఖ్యత అపారం. 140 కోట్ల మంది భారతీయుల ఆకలి తీర్చే అక్షయపాత్ర ఇది.*

గ్రామీణ భారతం మొత్తం వ్యవసాయం చుట్టూనే నిర్మితమై ఉంది. ఒక రైతు పొలంలో విత్తనం వేస్తే, అది కేవలం అతనికి మాత్రమే ఆహారాన్ని ఇవ్వదు, రవాణా చేసే లారీ డ్రైవర్లకు, గోనె సంచులు కుట్టే కార్మికులకు, ఎరువులు అమ్మే వ్యాపారులకు, చివరకు సూపర్ మార్కెట్లలో పనిచేసే యువతకు ఉపాధిని కల్పిస్తుంది. ఈ గొలుసుకట్టు వ్యవస్థలో వ్యవసాయం అనేది మొదటి లింక్. అది బలహీనపడితే, మిగిలిన అన్ని రంగాలు పేకమేడల్లా కూలిపోతాయి.



నేడు రైతు ఎదుర్కొంటున్న సమస్యలు ఒకటో రెండో కావు. అవి ఒక విషవలయంలా అతడిని చుట్టుముట్టాయి. గ్లోబల్ వార్మింగ్ వల్ల ఋతుపవనాలు దారి తప్పాయి. పడాల్సిన సమయంలో వర్షం పడదు, కోతకు వచ్చే సమయంలో తుఫానులు ముంచెత్తుతాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు పది అడుగులకే పడే నీళ్లు, నేడు వెయ్యి అడుగులు తవ్వినా పడటం లేదు. ఉచిత విద్యుత్ ఉన్నా, భూమిలో నీరు లేక బోర్లన్నీ ఎండుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు ఆకాశాన్ని అంటుతుంటే, పండిన పంటకు మాత్రం గిట్టుబాటు ధర దక్కడం లేదు. దళారుల వ్యవస్థ రైతు రక్తాన్ని పీల్చుకు తింటోంది. అధిక దిగుబడి కోసం వాడిన రసాయన ఎరువులు భూమిని విషతుల్యం చేశాయి. ఒకప్పుడు స్వచ్ఛమైన మట్టి వాసన వచ్చే పొలాలు, ఇప్పుడు రసాయనాల ఘాటును వెదజల్లుతున్నాయి. భారతదేశంలో రైతు ఆత్మహత్యల గణాంకాలు చదివితే గుండె చెరువవుతుంది. అప్పుల బాధ తాళలేక, కన్న బిడ్డల పెళ్లిళ్లు చేయలేక, సాగు కోసం తెచ్చిన అప్పు తీర్చలేక వేలాది మంది రైతులు తనువు చాలిస్తున్నారు. వ్యవసాయం చేస్తే గౌరవం దక్కదు, కడుపు నిండదు అనే భావన యువతలో బలంగా నాటుకుపోయింది. చదువుకున్న రైతుల బిడ్డలు నగరాల్లో చిన్న చిన్న ఉద్యోగాల కోసం వలస వెళ్తున్నారు తప్ప, మట్టిలో దిగడానికి ఇష్టపడటం లేదు. తరం మారుతున్న కొద్దీ వ్యవసాయ నైపుణ్యం అంతరించిపోతోంది. ఇదే గనుక కొనసాగితే, రాబోయే 20 ఏళ్లలో పొలం పనులు చేసేవారే ఉండరు.ఒక దేశం శక్తివంతమైనది అని ఎప్పుడు అంటారంటే, తన ప్రజలకు కావాల్సిన ఆహారాన్ని తానే పండించుకున్నప్పుడు. 1960ల నాటి "హరిత విప్లవం" మనకు ఆ స్వయం సమృద్ధిని ఇచ్చింది. కానీ నేడు వ్యవసాయం బలహీనపడితే, మనం మళ్లీ ఇతర దేశాల ముందు చేయి చాచాల్సి వస్తుంది.ఆహార ధాన్యాల దిగుమతి పెరిగితే దేశ విదేశీ మారక ద్రవ్యం హరించుకుపోతుంది. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరిగితే ఇక్కడ సామాన్యుడి కడుపు మాడుతుంది. ఆహారం కోసం పరాయి దేశంపై ఆధారపడటం అంటే మన స్వేచ్ఛను వారి చేతిలో పెట్టడమే. ఆకలితో ఉన్న దేశం ఎన్నటికీ విశ్వగురువు కాలేదు.వ్యవసాయం కుప్పకూలితే దాని ప్రభావం నేరుగా మార్కెట్ ధరలపై పడుతుంది. బియ్యం, పప్పులు, నూనెలు, కూరగాయల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుతాయి. దీనిని ఆహార ద్రవ్యోల్బణం అంటారు. ప్రజల ఆదాయంలో ఎక్కువ భాగం ఆహారానికే ఖర్చయితే, వారు ఇతర వస్తువులను (బట్టలు, ఎలక్ట్రానిక్స్, వాహనాలు) కొనలేరు. దీనివల్ల పరిశ్రమలు మూతపడతాయి, దేశ ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో పడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు శక్తి తగ్గడం అంటే భారత ఆర్థిక వ్యవస్థకు ఊపిరి ఆగిపోవడమే.గ్రామాల్లో ఉపాధి లేక రైతులు, కూలీలు నగరాలకు వలస వెళ్తున్నారు. దీనివల్ల నగరాలపై భారం పెరుగుతోంది. మురికివాడల విస్తరణ, కాలుష్యం, నిరుద్యోగం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. మరోవైపు గ్రామాలు నిర్మానుష్యమవుతున్నాయి. మన సంస్కృతికి మూలమైన పల్లె జీవనం, జానపద కళలు, ఆచారాలు కనుమరుగవుతున్నాయి. ఇది కేవలం ఆర్థిక నష్టం మాత్రమే కాదు, ఒక గొప్ప నాగరికతకు జరుగుతున్న విఘాతం.వ్యవసాయ భూములు క్రమంగా రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుతున్నాయి. కాంక్రీట్ అడవులు పెరుగుతున్నాయి. చెట్లు, పొలాలు లేకపోవడం వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జీవవైవిధ్యం దెబ్బతింటోంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటే అది మానవ జాతి మనుగడకే ప్రమాదం.పరిస్థితి విషమించినా, ఆశ మాత్రం ఇంకా సజీవంగానే ఉంది. సమగ్రమైన మార్పులు చేపడితే వ్యవసాయాన్ని మళ్లీ లాభసాటిగా మార్చవచ్చు.రైతుకు తాను పండించిన పంటపై కనీసం 50 శాతం లాభం వచ్చేలా మద్దతు ధరలు ఉండాలి. 'స్వామినాథన్ కమిషన్' సిఫార్సులను అమలు చేయాలి. రైతులకు, వినియోగదారులకు మధ్య ఉన్న దళారీ వ్యవస్థను తొలగించి, డిజిటల్ మార్కెటింగ్ (e-NAM) ను బలోపేతం చేయాలి. వ్యవసాయంలో డ్రోన్లు, సెన్సార్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వాడకాన్ని పెంచాలి. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడిని ఇచ్చే బిందు సేద్యం (Drip Irrigation) ప్రతి పొలానికి చేరాలి. మట్టి పరీక్షలు చేసి, నేలకు ఏ పోషకాలు అవసరమో అవే అందించాలి.రసాయనాలకు స్వస్తి పలికి, సేంద్రియ లేదా ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి. దీనివల్ల పెట్టుబడి తగ్గడమే కాకుండా, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుతుంది. భూమి కూడా తన సారాన్ని తిరిగి పొందుతుంది.వ్యవసాయాన్ని ఒక గౌరవప్రదమైన బిజినెస్ గా మార్చాలి. అగ్రి టెక్ స్టార్టప్‌లను ప్రోత్సహించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తే, రైతు పండించిన పంటకు అక్కడే విలువ జోడించబడుతుంది (Value Addition), తద్వారా ఎక్కువ ఆదాయం లభిస్తుంది. వ్యవసాయం అనేది కేవలం రైతు సమస్య కాదు, అది ప్రతి భారతీయుడి సమస్య. మనం ఏ వృత్తిలో ఉన్నా, ఎంత సంపాదిస్తున్నా, రోజుకు మూడు సార్లు తినే ఆహారం రైతు కష్టం నుండే వస్తోంది. రైతు కళ్లలో ఆనందం చూసినప్పుడే దేశం నిజమైన ప్రగతి సాధించినట్లు. ప్రభుత్వాలు కేవలం ఓట్ల కోసం ఇచ్చే ఉచిత పథకాలతో సరిపెట్టకుండా, దీర్ఘకాలిక ప్రయోజనాలు ఇచ్చే మౌలిక సదుపాయాలను కల్పించాలి. సమాజంగా మనం రైతును గౌరవించడం నేర్చుకోవాలి. "రైతే రాజు" అన్న మాట సామెతలకు మాత్రమే పరిమితం కాకుండా, నిత్య జీవితంలో నిజం కావాలి. వ్యవసాయాన్ని కాపాడుకుంటేనే మన భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది. లేదంటే, రాబోయే తరాలకు మనం ఇచ్చే ఆస్తి కేవలం కాంక్రీట్ భవనాలు మరియు ఆకలితో నిండిన కడుపులు మాత్రమే అవుతాయి.మేల్కొందాం! మన వెన్నెముకను కాపాడుకుందాం.

# ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ చెప్పారు. ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలో 60 శాతం ఒఖఉ ఉత్పత్తి చేస్తున్నామని, 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రిజర్వ్ ఉన్నాయని, హోర్ముజ్ నుంచి మరిన్ని నౌకలు భారత్‌కు వస్తున్నాయని మోదీ వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని కూడా మోదీ లోక్ సభలో చెప్పారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉందన్న ప్రధాని, భారత్‌పై మాంద్యం ప్రభావం పడకుండా చూస్తున్నామని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ అన్నారు. ఖరీఫ్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ఎ÷-లాంట్స్‌కు కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. పశ్చిమాసియా సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోంది. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వాణిజ్య నౌకల్లోనూ అనేకమంది భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి అవసరమైన సాయం అందిస్తున్నాం. భారత దౌత్య కార్యాలయాలు సాధ్యమైనంత తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాను అని అన్నారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత దేశాల్లో సీబీఎస్ఈ ఇప్పటికే 10, 12వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసింది. పశ్చిమాసియా పరిణామాల విషయంలో కేంద్రం ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. అలాగే దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాదారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. గతంలో 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. ఇప్పుడు ఆ సంఖ్య 41కి పెరిగింది. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి.

వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పెంచే దిశగా కృషి చేస్తున్నాం అని వివరించారు. ఇంధనంలో ఇథనాల్ కలపడాన్ని పెంచడం ద్వారా ఏటా ముడి చమురు దిగుమతులను 4.5 కోట్ల బ్యారెళ్ల మేర తగ్గించగలిగాం. ప్రభుత్వ, పారిశ్రామిక రంగాల సంయుక్త కృషితో.. ఈ సంక్షోభం వల్ల తలెత్తే సవాళ్లను దీటుగా ఎదుర్కోగలమనే నమ్మకం ఉంది. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులకు సాధ్యమైనంతమేర సాయం అందిస్తూనే ఉంటాం. చర్చలు, దౌత్యం ద్వారా పశ్చిమాసియా సంక్షోభానికి శాంతియుత పరిష్కారం సాధించేలా అన్ని పక్షాలను ప్రోత్సహిస్తున్నాం అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.


# పెన్షనర్లను వేధిస్తున్న ప్రభుత్వం

**- వారి బకాయల చెల్లింపులో నిర్లక్ష్యం**

**- అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ సభ్యుల వాకౌట్**

**హైదరాబాద్,మార్చి23( వెలుతురు):**

ప్రభుత్వ ఉద్యోగులు జీతభత్యాల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి నిరసనగా సభ నుంచి వెళ్లిపోయారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వడంలో అలసత్వం వహించడం, పీఆర్సీ డీఏ విషయంలో సీపీఎస్ విషయంలో, ఉద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి సభ నుండి వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గళమెత్తారు. వారి పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు కేపీ వివేకానందా , కల్వకుంట సంజయ్ సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ నెలకు



రూ. 700 కోట్ల బకాయిలను చెల్లిస్తామని చెప్పి , ఇంతవరకు చెల్లించలేదని ఆరోపించారు. ఎంతోమంది ఉద్యోగులు వారి మనోవేదనను చెప్పుకోలేక, ఆరోగ్య సమస్యలతో చనిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. రిటైర్డు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ఎప్పుడు అమలు చేస్తారురని, 5 డీఏలు ఎప్పుడు ఇస్తారని ఎమ్మెల్యే సంజయ్ ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టం చేయాలని కోరారు.

# నిమ్స్‌లో మందుల ధరలు కంట్రోల్ చేయండి


**- మండలిలో ఎమ్మెల్సీ రమణ విమర్శలు**

**హైదరాబాద్,మార్చి23( వెలుతురు):**

నిమ్స్ ఆస్పత్రిలో మెడిసిన్స్ ధర అధికంగా ఉంటున్నాయని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్. రమణ తెలిపారు. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రిలోనూ అదేవిధంగా అధిక ధరలు ఉంటున్నాయని పేర్కొన్నారు. బయటి మెడికల్ షాపు రేట్లతో సమానంగా మెడిసిన్స్ అమ్ముతున్నారని విమర్శించారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శాసనమండలిలో ఎల్.రమణ మాట్లాడుతూ.. మందులు కొనలేక పేద రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వమే మందులు సరఫరా చేసి పేద రోగులకు ఉపశమనం కలిగించాలని కోరారు. అధిక ధరలకు మెడిసిన్స్ అమ్మే నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఎల్.రమణ డిమాండ్ చేశారు. సరిపడ స్టాక్ లేక బయటి మెడికల్ షాపులపై ఆధారపడాల్సి వస్తుందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు

# సంపాదకీయం.. క్షయతో మూడు నిముషాలకో ఇద్దరు మృతి

ఒకప్పుడు క్షయవ్యాధి సోకితే మరణం తప్పేది కాదు. కానీ ఆధునిక ప్రపంచంలో వైద్యశాస్త్రం అభివృద్ధి చెందడం, సకాలంలో వ్యాధిని గుర్తించి, మందులు ఇవ్వడం వల్ల, చికిత్స చేయడం వల్ల క్షయను అరికట్టడం సాధ్యమయ్యింది. అయినా నేటికీ మూడు నిముషాలకో ఇద్దరు క్షయవ్యాధితో మరణిస్తున్నారన్న గణాంకాలు చూస్తే భయమేస్తోంది. ఇది కేవలం నిర్లక్ష్యంతో పాటు, సకాలంలో వైద్యం చేయించుకోక పోవడం వంటి కారణాలని వైద్యులు చెబుతున్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 24న పాటిస్తారు. టీబీ వ్యాధిపై అవగాహన పెంచడం, దాని నిర్మూలనకు కృషి చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. 1882లో డా. రాబర్ట్ కోచ్ టీబీ బాసిల్లస్ క్షయ వ్యాధి కారకంను కనుగొన్న రోజుగా దీనిని జరుపుకుంటారు. 1882, మార్చి 24న డా. రాబర్ట్ కోచ్ అనే శాస్త్రవేత్త క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను (మైకోబ్యాక్టీరియమ్ టూబరిక్లోసిస్) మొదటిసారిగా కనుగొన్నాడు. 1982లో అంతర్జాతీయ క్షయ, ఊపిరితిత్తుల వ్యాధుల వ్యతిరేక యూనియన్, రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను కనుగొని 100 సంవత్సరాలైన సందర్భంగా మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం జరుపుకోవాలని ప్రతిపాదించింది. భయంకరమైన అంటువ్యాధైన టీబీ దేశంలో ప్రతి సెకనుకు ఒక్కరికి సోకుతున్నదని, ప్రతిరోజు దేశవ్యాప్తంగా 1000మంది క్షయ వ్యాధితో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962ను క్షయవ్యాధి నివారణకు ప్రత్యేకమైన చర్యలను తీసుకోవడం ప్రారంభించింది. క్షయవ్యాధి అనేది మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల కలిగే అంటువ్యాధి. ఇది ప్రధానంగా ఊపిరితిత్తులపై దాడి చేస్తుంది. దగ్గు, తుమ్ముల ద్వారా గాలిలో వ్యాపిస్తుంది. 2 వారాల కంటే ఎక్కువ కాలం దగ్గు, జ్వరం, రాత్రి చెమటలు మరియు బరువు తగ్గడం వంటివి దీని




ప్రధాన లక్షణాలు. 6-9 నెలల పాటు డాక్టర్ పర్యవేక్షణలో మందులు వాడితే ఇది పూర్తిగా నయమవుతుంది. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. కానీ మెదడు, మూత్రపిండాలు మరియు వెన్నెముక వంటి శరీరంలోని ఇతర భాగాలపై కూడా ఇది ప్రభావం చూపిస్తుంది. క్రియాశీల పల్మనరీ ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తులే ఈ వ్యవధి వ్యాప్తికి మూలం. నిజానికి ప్రస్తుతం క్షయకు అత్యాధునిక చికిత్సలు, మందులు అందుబాటులో ఉన్నాయి. కానీ ప్రజలు క్షయ గురించి ఇంకా అవగాహన కలిగించకోవడం లేదని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని గుర్తించి సకాలంలో వైద్యం చేయించుకుంటే అటు వ్యక్తికే గాకుండా, సమాజా ఆరోగ్యానికి కూడా దోహదపడ్డవారు అవుతారు. 2016లో 10 లక్షల మంది చిన్నారులకు టీబీ సోకగా 2.5 లక్షల మంది పసివాళ్లు ప్రాణాలు కోల్పోయారంటే నమ్మశక్యం కాని విషయం. ప్రపంచం లోనే వందలో 4వ వంతు జనాభాలో క్షయ బ్యాక్టీరియా ఉందంటే ఈ వ్యాధి ప్రభావం ఏ మేర వ్యాపించి ఉందో అర్థం చేసుకోవచ్చు. టిబి వ్యాధిగ్రస్తులు మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌లోనే ఎక్కువని గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఆధునిక కాలంలోనూ భారత్ లో విస్తరిస్తున్న అనేక వ్యాధుల్లో ఈ క్షయ వ్యాధి ఒకటి. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులకు సంబంధించినదే అయిన చర్మం నుంచి మెదడు వరకు శరీరంలోని ఏ భాగానికైనా వచ్చే అవకాశం ఉంది. క్షయ వ్యాధి ముఖ్యంగా శ్వాసకోశాన్ని దెబ్బ తీస్తుంది. ఈ వ్యాధి బారినపడి ఇప్పటికీ ప్రతి సంవత్సరం అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వ్యాధి సోకిన వ్యక్తి నుంచి గాలిలోకి విడుదలయ్యే సూక్ష్మ చుక్కల ద్వారా ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి సులభంగా వ్యాపిస్తుంది. క్షయ వ్యాధి సోకిన వారిలో దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రక్తంతో కూడిన దగ్గు, రాత్రిపూట చెమటలు పడుతుండడం మరియు కఫంలో రక్తం వంటి లక్షణాలు 2 వారాలకు మించి ఉంటాయి. ఎల్లప్పుడూ అలసిపోయినట్లు అనిపించడమే కాక, నొప్పి మరియు ప్రభావిత ప్రాంతాల్లో వాపు వస్తుంది. వ్యాధిగ్రస్తుల్లో శ్వాస ఆడకపోవడం, ఛాతి నొప్పి వంటి సమస్యలు కూడా సంభవిస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించి తుగ వైద్యసూచనలు పాటించాలి. లేకుండే ప్రాణాంతకంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారలోపం మరియు సిలికోసిస్ ఉన్నవారి లోనూ ఈ వ్యాధి సోకుతుంది. ప్రజల నిర్లక్ష్యం కారణంగా ప్రపంచంలోని మొత్తం కొత్త టీబీ కేసుల్లో మూడింట రెండు వంతులు ఎనిమిది దేశాల్లో ఉన్నాయి, భారత్ అగ్రస్థానంలో ఉంది. క్షయ నివారణ మరియు నివారించదగినదని వైద్యులు అంటున్నారు. వ్యాధి ఉన్న వ్యక్తి యొక్క అంటువ్యాధి అతను లేదా ఆమె గాలిలోకి విడుదల చేసే ట్యూబర్‌కిల్ బాసిల్లి సంఖ్యకు నేరుగా సంబంధం కలిగి ఉంటుంది. అనేక ట్యూబర్‌కిల్ బాసిల్లిని బహిష్కరించే వ్యక్తులు తక్కువ లేదా బాసిల్లిని బహిష్కరించే రోగుల కంటే ఎక్కువ అంటువ్యాధి కలిగి ఉంటారు. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే, సక్రమంగా మందులు వాడితే వ్యాధిని అదుపు చేయవచ్చని అంటున్నారు. జీవనశైలి మార్పులు కూడా ఈ కాలంలో వ్యాధిని నిర్మూలిం చడంలో సహాయపడతాయి. క్షయ అనేది చికిత్స చేయగల మరియు నయం చేయగల వ్యాధి. సమయానికి మందులను తీసుకోవడం వల్ల రక్తంలో ఔషధం యొక్క ఖచ్చితమైన ఏకాగ్రత స్థాయిని కొనసాగించవచ్చు. వ్యాధికారక క్రిములను చంపడానికి ఇది చాలా అవసరం. చాలా మంది రోగులు చికిత్స కొనసాగుతుండగా మెరుగైన పరిస్థితి కనిపించడంతో, అటువంటి రోగులు కొన్నిసార్లు చికిత్స చేస్తున్న వైద్యుడిని సంప్రదించకుండా వారి స్వంత చికిత్సను ఆపడానికి ఆకర్షితులవుతారు. ఇది హానికరం మరియు మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ క్షయవ్యాధి అభివృద్ధికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. చికిత్స సమయంలో ధూమపానం మరియు మద్యపానం చేయవద్దు. మీరు మందులు తీసుకునేటప్పుడు ధూమపానం చేస్తే, అది మీ చికిత్సను ప్రభావితం చేయవచ్చని కూడా వైద్యులు హెచ్చరిస్తున్నారు. చికిత్సకు కొన్ని మందులు కాలేయానికి హాని చేస్తాయి. వీటిని తీసుకుంటూ మద్యం సేవించడం వల్ల కాలేయంపై అదనపు భారం పెరుగుతుందని అంటున్నారు. ఏదేమైనా చికిత్స చేయించుకోవడం, వ్యాధిని గుర్తించడం, వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడడం వంటి వాటి వల్ల వ్యాధిని అరికట్ట వచ్చని అంటున్నారు. కేంద్రం కూడా క్షయ నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది.

## ఐకానిక్ టవర్‌గా అసెంబ్లీ నిర్మాణం

- మంత్రి నారాయణ వెల్లడి



**అమరావతి,మార్చి23( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులపై రాష్ట్ర మున్సిపల్, పరిపాలన శాఖ మంత్రి పొంగూరు నారాయణ కీలక అప్‌డేట్స్ ఇచ్చారు. అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఐకానిక్ కట్టడాలుగా నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల విశిష్టతను, నిధుల సమీకరణను మంత్రి నారాయణ వివరించారు. అమరావతి అసెంబ్లీ భవనాన్ని 250 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ భవనంపైకి ప్రజలు వెళ్లి మొత్తం అమరావతి నగరాన్ని వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని ఉత్తమ అసెంబ్లీ భవనాల్లో ఒకటిగా ఇది నిలుస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ, హైకోర్టుతో పాటు మరో ఐదు ఐకానిక్ టవర్లను అత్యద్భుతంగా నిర్మిస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఐకానిక్ భవనాలు కాబట్టి సాధారణ భవనాల కంటే వీటికి ఖర్చు కొంత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోని ఐకానిక్ భవనాల రేట్లతో పోల్చి వీటిని చూస్తున్నామని, ఎస్ఆర్ (ఞాఖీ) రేట్ల ప్రకారం నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాజధాని పనుల కోసం భారీ ఎత్తున నిధులను ప్రభుత్వం సమకూర్చుకుంటోందని మంత్రి నారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 15 వేల కోట్లు, హడ్కో ద్వారా మరో రూ. 11 వేల కోట్లు సమకూర్చుకుంటున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

## కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

- డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పార్టీలకు ప్రచారం
- దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో ఉచిత ప్రసారం

**న్యూఢిల్లీ,మార్చి23( వెలుతురు):**
నాలుగు అసెంబ్లీ ఎన్నికల వేళ భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు ఉచిత ప్రసార సమయం కోసం డిజిటల్ వోచర్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో మాత్రమే ఈ ఉచిత ప్రసార అవకాశం ఉంటుంది. త్వరలో అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ ఉచిత ప్రసార అవకాశం కల్పించింది.ఐప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని 39ఏ సెక్షన్ కింద రాజకీయ పార్టీలకు ఈ అవకాశం కల్పిస్తున్నట్టు ఈసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు ఐటీ ఎ÷-లాట్‌ఫాం ద్వారా ఈ డిజిటల్ టైమ్ వోచర్లు జారీ చేస్తున్నట్టు పేర్కొంది. ఈ బ్రాడ్‌కాస్ట్ విండో అభ్యర్థుల జాబితా విడుదలైన తేదీ నుంచి ప్రారంభమై పోలింగ్‌కు రెండ్రోజుల ముందు వరకూ కొనసాగుతుందని తెలిపింది. రాష్ట్ర/యూటీ స్థాయిలో పారదర్శకంగా డ్రా నిర్వహించడం ద్వారా బ్రాడ్‌కాస్ట్ స్లాట్‌లు నిర్ధారిస్తారు. ప్రతి పార్టీకి దూరదర్శన్, అల్ ఇండియా రేడియాలో 45 నిమిషాల ఉచిత ప్రసార సమయం కేటాయిస్తారు. గత అసెంబ్లీ సమయంలో పార్టీల పనితీరు ఆధారంగా కూడా అదనపు ప్రసార సమయం కేటాయించే వీలుంటుంది. సాంకేతిక, రెగ్యులేటరీ ప్రమాణాలకు అనుగుణంగా రాజకీయ పార్టీలు ట్రాన్స్‌క్రిప్టులు, రికార్డింగ్‌లను ముందుగానే సమర్పించాల్సి ఉంటుంది. ఆయా రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను సమష్టిగా వ్యక్తం చేసేందుకు వీలుగా ప్రసార భారతి ప్యానల్ డిస్కషన్లు, డిబేట్లను కూడా నిర్వహిస్తుంది. చిత ప్రసార సమయం కేటాయింపు ద్వారా రాజకీయ పార్టీలు తమ విధానాలను, ప్రచారాన్ని ప్రజల్లోకి సులభంగా తీసుకువెళ్లవచ్చని ఈసీఐ భావిస్తోంది. ఇది ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంచి, సమాన అవకాశాలు కల్పించే డిజిటల్ చొరవగా పేర్కొంటోంది. ఇటీవల ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించింది. కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఒకే దశలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుండగా, తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరుగుతుంది. పశ్చిమబెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ ఉంటుంది. నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో మే 4న ఫలితాలు వెలువడతాయి.

## తెలంగాణ బడ్జెట్ 202627..అంకెల ఆర్భాటమా? అమలు లోపాల ఆవిష్కరణ?



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

*తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.3,24,234 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. గత సంవత్సరం 202526లో రూ.3,04,965 కోట్ల బడ్జెట్‌తో పోలిస్తే ఇది పెరిగినదే. అదే విధంగా 2024-25లో రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం ప్రతి సంవత్సరం అంకెల పరంగా భారీ పెరుగుదల చూపిస్తూ వస్తోంది. పైకి చూస్తే ఇది అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నట్టే కనిపిస్తుంది. కానీ లోతుగా పరిశీలిస్తే, ఈ పెరుగుదల కేవలం అంకెల్లోనే ఉందా? లేక ప్రజల జీవితాల్లోనూ ప్రతిఫలిస్తున్నదా? అనే ప్రశ్న తలెత్తుతుంది. బడ్జెట్ అంటే కేవలం కేటాయింపులు కాదు. అది అమలు. అది ప్రజల చేతికి చేరే ఫలితాలు. ప్రభుత్వం ఎంత కేటాయించింది అనే దానికంటే ఎంత ఖర్చు పెట్టింది, ఎవరికి ఉపయోగపడింది అన్నదే అసలు ప్రమాణం. ఈ కోణంలో చూస్తే, తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న ఆర్థిక వ్యవహారాలు అనేక సందేహాలను రేకెత్తిస్తున్నాయి.*

2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్‌లో సుమారు రూ.70 వేల కోట్లు ఖర్చు చేయలేకపోయిన విషయం స్వయంగా ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క 202526 బడ్జెట్ సమయంలో ప్రకటించారు. ఇది చిన్న విషయం కాదు. ఇది ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలో ఉన్న లోపాలను స్పష్టంగా చూపిస్తుంది. ఒకవైపు భారీ కేటాయింపులు ప్రకటిస్తూ, మరోవైపు వాటిని ఖర్చు చేయలేకపోవడం అంటే ప్రణాళికా లోపమా? లేక అమలు వైఫల్యమా? అనే ప్రశ్న సహజంగా వస్తుంది.

బడ్జెట్ అంకెలను పెంచడం ద్వారా ప్రజలకు అభివృద్ధి భ్రమ కలిగించడం సులభం. కానీ ఆ అంకెలను భూమి మీద అమలు చేయడం కష్టం. తెలంగాణలో ప్రస్తుతం కనిపిస్తున్న దృశ్యం ఇదే. "ముందు చెప్పేద్దాం డ ఖర్చు సంగతి తర్వాత చూద్దాం" అన్నట్టుగా పాలన కొనసాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇక తలసరి ఆదాయం విషయానికి వస్తే ప్రభుత్వం రూ.4,18,931గా పేర్కొంటూ గతంతో పోలిస్తే పెరిగిందని చెబుతోంది. సాధారణంగా తలసరి ఆదాయం పెరిగితే ప్రజల కొనుగోలు శక్తి కూడా పెరగాలి. మార్కెట్‌లో డిమాండ్ పెరగాలి. ధరలు కొంత మేర పెరగడం సహజం. కానీ తెలంగాణలో మరోవైపు ద్రవ్యోల్బణం తక్కువగా ఉండటం, కొన్ని నెలల్లో మైనస్‌లోకి కూడా వెళ్లడం అనేది వాస్తవ పరిస్థితిని బహిర్గతం చేస్తోంది. అంటే ప్రజల చేతుల్లో డబ్బు తిరగడం తగ్గిందా? వినియోగం తగ్గిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇక్కడ ఒక ముఖ్యమైన అంశం గుర్తు చేసుకోవాలి. కేసీఆర్ పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండేది. వ్యవసాయం అభివృద్ధి చెందింది. రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు రైతుల ఆదాయాన్ని స్థిరపరిచాయి. దళిత బంధు, బీసీ బంధు వంటి పథకాలు సమాజంలోని వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్వావలంబన కల్పించాయి. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి వంటి కార్యక్రమాలు గ్రామీణ, పట్టణ మౌలిక వసతులను మెరుగుపరిచాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో డబ్బు చలామణి పెరిగింది. కొనుగోలు శక్తి పెరిగింది. దీనివల్ల ద్రవ్యోల్బణం 56 శాతం మధ్య ఉండేది. ఇది ఒక ఆరోగ్యకర ఆర్థిక సంకేతంగా భావించవచ్చు.

కానీ ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. సంక్షేమ పథకాల అమలు మందగించింది. కొన్ని పథకాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా ప్రజల చేతుల్లో డబ్బు తగ్గింది. వినియోగం తగ్గింది. దీని ప్రభావం మార్కెట్‌పై పడింది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేటప్పుడు ఇచ్చిన హామీలు కూడా ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. ముఖ్యంగా అంబేద్కర్ అభయ హస్తం పేరుతో ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని ప్రకటించింది. కానీ మూడో బడ్జెట్ వరకూ కూడా ఆ పథకానికి నిధులు కేటాయించకపోవడం గమనార్హం. దీనితో పోలిస్తే కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు పథకం స్పష్టమైన లక్ష్యంతో, దశలవారీగా ముందుకు సాగింది. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు అందించి ఆర్థిక స్వావలంబనకు మార్గం వేసింది.

పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి వంటి కార్యక్రమాలు కూడా ప్రస్తుతం పక్కనబడ్డాయి. ఇవి కేవలం అభివృద్ధి కార్యక్రమాలు మాత్రమే కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను పెంచిన ఉద్యమాలుగా నిలిచాయి. గ్రామాల్లో పారిశుధ్యం, చెత్త నిర్వహణ, మొక్కల పెంపకం, డ్రైనేజీ వ్యవస్థలు,ఇవన్నీ గణనీయంగా మెరుగుపడ్డాయి.

సీజనల్ వ్యాధులు తగ్గాయి. కానీ ప్రస్తుతం ఆ దిశగా స్పష్టమైన చర్యలు కనిపించడం లేదు.


విద్యా రంగంలో పరిస్థితి మరింత ఆందోళనకరం. స్కాలర్‌షిప్ బడ్జెట్‌ను రూ.109 కోట్లు తగ్గించడం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.10 వేల కోట్లకు పైగా ఉండటం, గత బడ్జెట్‌లో కేటాయించిన మొత్తంలో కేవలం రూ.500 కోట్లు మాత్రమే విడుదల చేయడం,ఇవన్నీ తీవ్రమైన నిర్లక్ష్యాన్ని సూచిస్తున్నాయి. 25 లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం ఎదురుచూస్తుండగా, ప్రభుత్వం సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం భవిష్యత్ తరాలపై ప్రభావం చూపుతుంది. ఎస్సీ, ఎస్టీ సంక్షేమం విషయంలోనూ ఇదే పరిస్థితి. అట్రాసిటీ బాధితులకు కేటాయించిన నిధులు విడుదల కాకపోవడం, కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు నిలిచిపోవడం, కార్పొరేషన్‌ల ఏర్పాటు జరిగినా అమలు లేకపోవడం, ఇవన్నీ వాగ్దానాలకు, పనితీరుకు మధ్య అంతరాన్ని సూచిస్తున్నాయి.

బీసీ సబ్ ప్లాన్ విషయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు కూడా అమలు కాలేదు. ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి, ప్రస్తుతం రూ.12,511 కోట్లకే పరిమితం చేయడం, అందులోనూ పూర్తిగా విడుదల చేయకపోవడం బీసీ వర్గాల్లో అసంతృప్తిని పెంచుతోంది.

ఇక ఆర్థిక పరంగా చూస్తే రెవెన్యూ రిసిప్ట్స్ విషయంలో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ప్రభుత్వం మొదట రూ.2,29,720 కోట్ల లక్ష్యాన్ని పెట్టుకుని, తరువాత దాన్ని రూ.2,03,000 కోట్లకు తగ్గించుకుంది. కానీ జూా+ నివేదిక ప్రకారం అది కేవలం రూ.1,38,371 కోట్లకే పరిమితమైందని తెలుస్తోంది. ఇది ప్రభుత్వ అంచనాలు మరియు వాస్తవాల మధ్య ఉన్న అంతరాన్ని స్పష్టంగా చూపిస్తుంది.

అప్పుల విషయంలో కూడా రాజకీయ ఆరోపణలు కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ పాలనపై రూ.8 లక్షల కోట్ల అప్పు అని ఆరోపించినా, కేంద్రం పార్లమెంట్‌లో ఇచ్చిన లెక్కల ప్రకారం మొత్తం అప్పు రూ.3.5 లక్షల కోట్లు మాత్రమే. అందులో ఉమ్మడి రాష్ట్రపు వాటా కూడా ఉంది. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల్లోనే రూ.3.47 లక్షల కోట్లు అప్పు చేయడం గమనించాల్సిన విషయం.

అప్పు తీసుకోవడం తప్పు కాదు. కానీ ఆ అప్పుతో ఏమి సాధించారు అనేది ముఖ్యం. కేసీఆర్ పాలనలో అప్పుతో అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు అమలయ్యాయి.




కానీ ప్రస్తుతం అప్పు పెరుగుతున్నా, దాని ఫలితాలు ప్రజలకు కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

మొత్తం మీద చూస్తే, తెలంగాణ బడ్జెట్ 202627 అంకెల పరంగా పెద్దదిగా కనిపించినా, అమలు పరంగా అనేక లోపాలను బయటపెడుతోంది. కేటాయింపులు పెరగడం మాత్రమే అభివృద్ధి కాదు. వాటిని సమర్థంగా ఖర్చు చేయడం, లక్ష్యిత వర్గాలకు చేరవేయడం, ఆర్థిక పారదర్శకత పాటించడం,ఇవన్నీ సమానంగా ముఖ్యమైనవి.

ప్రస్తుతం కనిపిస్తున్న పరిస్థితుల్లో ప్రభుత్వం అంకెల ఆర్భాటాన్ని తగ్గించి, అమలుపై దృష్టి పెట్టాలి. సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి. విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. రెవెన్యూ అంచనాలను వాస్తవికంగా రూపొందించాలి. అప్పులను బాధ్యతాయుతంగా వినియోగించాలి.

అప్పుడు మాత్రమే బడ్జెట్ నిజంగా ప్రజల బడ్జెట్‌గా మారుతుంది. లేకపోతే అది కేవలం పుస్తకాలలో ఉన్న అంకెల సమాహారంగా మిగిలిపోతుంది.

https://epaper.velthuru.com

# హైదరాబాద్ - రంగారెడ్డి వెలుతురు



హిమాయత్ నగర్ డివిజన్లోని విటల్ వాడి లో నూతన సీసీ రోడ్డు పనులలో భాగంగా అక్కడ ఉన్న కొన్ని ఇండ్లకు పొల్యూషన్ వాటర్ రావడంతో హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ దృష్టితో ఇవ్వడం జరిగింది. దీనికి సంబంధించి సంబంధిత అధికారులైన మేనేజర్ మనోవర్ని పిలిపించి ఆ పొల్యూషన్ సమస్యను తీర్చి సోమవారం రోజున రాత్రి రోడ్డు పనులను పూర్తి అయ్యేటట్టు చూడడం జరిగింది.

హైదరాబాద్ వెలుతురు మార్చి 23:

## ఇటీవల ప్రకటించిన టీజీ సెట్ 2025 ఫలితాలు రిజర్వేషన్ల స్ఫూర్తికి విరుద్ధం

**- ఫలితాలు సవరించి తిరిగి ప్రకటించి బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలి.**

**- బిసి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**



హైదరాబాద్ వెలుతురు మార్చి 23:
ఇటీవల ప్రకటించిన టీజీ సెట్ 2025 ఫలితాలు రిజర్వేషన్ల స్ఫూర్తికి విరుద్ధమని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆగ్రహంవ్యక్తంచేశారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ ఓయూ అధికారులు ప్రకటించిన ఫలితాలలో బీసీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందనీ తక్షణమే ఫలితాలను సవరించి తిరిగి ప్రకటించి బీసీ లకు న్యాయం చేయాలని ఓయు అధికారులను లింగంగౌడ్ డిమాండ్ చేశారు.

## హామీల అమలు కోరితే అరెస్టులా

**- ప్రభుత్వంపై బీజేపీ ఆగ్రహం**





**శంకర్పల్లి, వెలుతురు మార్చి 23 :**
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలును కోరితే అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీజేపీ నేతలు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపునిచ్చిన అసెంబ్లీ ముట్టడిని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేపట్టడాన్ని శంకర్పల్లి మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు చెందిప్ప దయాకర్ రెడ్డి ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు "ఆరు గ్యారెంటీలు" పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీల అమలును పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ప్రజల తరపున ఆ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తే, ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమని అన్నారు. అసెంబ్లీ ముట్టడికి ముందు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాములు గౌడ్, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు బిర్లా సురేష్, బిసోల వెంకటేష్, ఆర్. వెంకట్రాం రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, దేవ ప్రవీణ్ తదితర నాయకులను అరెస్టు చేయడం హేయమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య హక్కులను హరించడం వంటివని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మోసం ఎక్కువ కాలం నిలవదని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరించే రోజు దగ్గరలోనే ఉందని ఆయన పేర్కొన్నారు. అరెస్టులతో భయపడేది లేదని, ప్రభుత్వ వైఫల్యాలను రెట్టింపు ఉత్సాహంతో ప్రజల్లోకి తీసుకెళ్తామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు.

## ఆరుట్ల గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ కంఠమహేశ్వర దేవాలయంలో అన్నదాన కార్యక్రమం

**- ప్రతి సోమవారం రోజు కంఠమహేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తాం**

**- శివస్వాముల గురుస్వామి లొంగరి యాదగిరి శివభక్తుడు సుంకరి రఘునాథ్ గౌడ్**



**మంచాల వెలుతురు మార్చి 23:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ కంఠమహేశ్వర దేవాలయంలో ప్రతిసోమవారంరో జు కంఠమహేశ్వర స్వామికి శివలింగానికి అభిషేకం ప్రత్యేక పూజలు చేసి గౌడ సంఘం పెద్దలు దాతల సహాయంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న శివస్వాముల గురుస్వామి లొంగరి యాదగిరి శివభక్తుడు సుంకరి రఘునాథ్ గౌడ్ ఈ సోమవారం అన్నదాన ప్రభువు శివభక్తుడు బోద్రమోని అంజయ్యముదిరాజ్ సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్య క్రమానికి భక్తులు పెద్దఎత్తున వచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు అన్నదాన కార్యక్రమంలోఆరుట్ల గౌడసంఘం అధ్యక్షుడు తంగడపల్లి నరేందర్ గౌడ్ గౌడ సంఘంపెద్దలు అంతటి రాజుగౌడ్ పాం డాల రాములుగౌడ్ వైయస్సార్ మాధగోనిజంగయ్యగౌడ్ అయ్యప్పస్వాముల గురుస్వామి లొంగ రి దాసు గడ్డంభాస్కర్ గౌడ్ కొత్తపల్లి రవి గౌడ్ పాశం చిత్తూగౌడ్ దాసరమోని గోపాల్ ముదిరాజ్ పిడుగు సత్యంముదిరాజ్ మెగావత్ నరేందర్ నాయక్ బూర రాజ్ కుమార్ మారగోని నాగేష్ గౌడ్ గ్రామస్తులు తదితరులు

## క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ రాణించాలి

**- కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ.**



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 23:
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ బౌరంపేట్ కార్తికేయ గ్రౌండ్స్ లో వడ్డెర సంఘం వారి క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడా పోటీల్లో రాణించాలని, గెలుపు కంటే క్రీడా స్ఫూర్తి, జట్టు కృషి, క్రమశిక్షణలే ఎక్కువ విలువైనవని తెలిపారు. తమ నైపుణ్యాలలో ప్రదర్శించడానికి శాశ్వత స్నేహబంధాలను పెంపొందించుకోవడానికి లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని జట్లుకు విజయం చేకూరాలని ఆకాంక్షిస్తూ టోర్నమెంటు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డపోతారం మున్సిపల్ బీఆర్ఎస్ యువ నాయకులు,గద్దె గణేష్, కుమార్ యాదవ్, అరికేల సురేష్ ముదిరాజ్ మరియు బౌరంపేట బీఆర్ఎస్ యువ నాయకులు కుమ్మరి మల్లేష్, వి.తిరుపతి, రాజు, బాల్రాజ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## లచ్చ నాయక్ చిత్రపటానికి మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళీ నాయక్, గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మయ్య గౌడ్ నివాళి

**- హుస్సేన్ నాయక్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పిన సీతక్క, ఉమా మురళీ నాయక్..**

**- లచ్చ నాయక్ మృతి పట్ల జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధుల సంతాపం..**







**గూడూరు మండలం వెలుతురు మార్చి 23:**
మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ పితృవియోగం పట్ల జిల్లా వ్యాప్తంగా తీవ్ర సంతాపం వ్యక్తమవుతోంది. ఆయన తండ్రి జాటోత్ లచ్చ నాయక్ ఇటీవల కన్నుమూయడంతో గూడూరు మండలం మచ్చర్ల గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో సోమవారం మచ్చర్లకు చేరుకున్న రాష్ట్ర మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళీ నాయక్ లచ్చ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. హుస్సేన్ నాయక్ కుటుంబ సభ్యులను మంత్రి సీతక్క ఉమా మురళీ నాయక్ పరామర్శించి వారిని ఓదార్చారు. తండ్రిని కోల్పోవడం అత్యంత బాధాకరమని, ఈ క్లిష్ట సమయంలో కుటుంబం అంతా ధైర్యంగా ఉండాలని వారు కోరారు. ఒక ఆత్మీయ నాయకుడి కుటుంబంలో జరిగిన ఈ నష్టం తమను కలిచివేసిందని పేర్కొంటూ తమ సానుభూతిని తెలిపారు. ఈ పరామర్శలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వ్యాప్తంగా ఉన్న కార్పొరేటర్లు, సర్పంచులు, వార్డు సభ్యులు మరియు వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి లచ్చ నాయక్ సేవలను స్మరించుకున్నారు. గ్రామానికి వచ్చిన ప్రతి ఒక్కరూ హుస్సేన్ నాయక్ పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకుంటూ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఆరుట్ల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారతమాత ముద్దుబిడ్డ షహీద్ భగత్ సింగ్ 95వ వర్ధంతి వేడుకలు

**- అలుపెరుగని పోరాట యోధుడు షాహిద్ భగత్ సింగ్**

**- ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్**



**మంచాల వెలుతురు మార్చి 23:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో భగత్ సింగ్ 95వవర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలోకాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోభగత్ సింగ్ చి త్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారుఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇబ్ర హీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరిఎల్లేష్ మాట్లాడుతూ భయంఅనే ఆలోచనలు మెద డులోకి రానీయకుఆ ఆలోచనలే నిన్ను పిరికి వాడిని చేస్తాయి అని భగత్ సింగ్ అన్నమాటలు గుర్తుచేశారు దేశ స్వాతంత్రంకోసం అలుపెరుగని పోరాటం చేసిన గొప్పవ్యక్తి ఒక లక్ష్యం కోసం పోరాడిన జీవితానికి అలాంటి ముగింపు గర్వకారణమేకానీ దయానియం కాదు తన మరణము ముందుతరాలకు త్యాగమనే సుగుణంలో సాగుతుందని అన్నారు మానవాళికి సేవ చేయడానికి పీడితులకువిముక్తి కలిగించడానికి యువతరం ముందుకు వచ్చినప్పుడే నవయుగనికి నాంది ప్ర స్తావన జరుగుతుందని వారినీ స్మరిస్తూ భగత్ సింగ్ గారిచిత్రపటానికి మాలవేసి నివాళుల ర్పిం చారు ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోహన్ నాయక్ మండల మాజీ కోఆప్షన్ సభ్యులు మ హమ్మద్ సలాం వార్డు సభ్యుడు మహమ్మద్ ఇమ్రాన్ కాంగ్రెస్ పార్టీ నాయకులుగుడ్డిమల్లచంద్రయ్యముదిరాజ్ అంతటి రాజుగౌడ్ మారసురేష్ జిలమోని శ్రీనివాస్ వస్పరి కుమార్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణముదిరాజ్ చెరుకునరసింహగౌడ్ కంబాలపల్లి బుగ్గరాములు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగల పరమేశ్ రావుల నాగరాజు దాసరమోని అశోక్ ముదిరాజ్ ఆర్లశ్రీ కాంత్ కొల్లోజువిశ్వనాథ్ చారి ఆడెపుమధు కొల్లోజు మహేష్ చారి గ్రామపెద్దలు యువకులు తది తరులుపాల్గొన్నారు

## ఖాన్కా-యే-దీదార్-యే-హష్మీ ఆధ్వర్యంలో ఘనంగా నూతన ఆధ్యాత్మిక గ్రంథాల ఆవిష్కరణ







**జహీరాబాద్ వెలుతురు మార్చి 23:**
ఖాన్కా-యే-దీదార్-యే-హష్మీ, మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కద్లూరు షాకీర్ నగర్ ఆధ్వర్యంలో సిల్సిలా-యే-ఆలియా ఖాద్రియా షత్తారియా సూఫీ పరంపరకు చెందిన నూతన ఆధ్యాత్మిక గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఆధ్యాత్మిక సాధకులకు మరియు భక్తులకు మార్గదర్శకంగా నిలిచే విధంగా రూపొందించిన "షజ్రా-యే-తయ్యిబా" మరియు "తరీఖా-యే-హల్కా సిల్సిలా-యే-ఆలియా ఖాద్రియా షత్తారియా" అనే గ్రంథాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హజ్రత్ సూఫీ షా మహమ్మద్ జాకీర్ హుస్సేన్ జీషాన్ పాషా అల్ మారూఫ్ నవాజ్ అలీ షా ఖాద్రి షత్తారి (సజ్జాదా నషీన్, సూఫీ నగర్, నిర్మల్) అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హజ్రత్ సూఫీ షా మహమ్మద్ అక్రమ్ అలీ అల్ మారూఫ్ రహమత్ హుస్సేన్ ఖాద్రి షత్తారి (సజ్జాదా నషీన్, హాఖ్ రాహే నగర్, రాయిపల్లి) మరియు హజ్రత్ సూఫీ షా మహమ్మద్ అబ్దుల్ హమీద్ అల్ మారూఫ్ హాషమ్ హుస్సేన్ ఖాద్రి షత్తారి (సజ్జాదా నషీన్ & ముతవల్లి, ఖాన్కా-యే-దీదార్-యే-హష్మీ, షాకిర్ నగర్) పాల్గొన్నారు. అధ్యక్ష ప్రసంగంలో హజ్రత్ జీషాన్ పాషా ఈ గ్రంథాల ప్రాముఖ్యతను వివరించారు. సూఫీ పరంపరలో ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం ఎంతో ముఖ్యమని, ఈ పుస్తకాలు ఆధ్యాత్మిక మార్గంలో నడిచే వారికి ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే ఈ గ్రంథాల సిద్ధీకరణ మరియు ప్రచురణలో సూఫీ షా మహమ్మద్ అబ్దుల్ సాజిద్ పాషా అల్ మారూఫ్ ఇర్ఫాన్ హుస్సేన్ ఖాద్రి షత్తారి మరియు సూఫీ షా మహమ్మద్ అబ్దుల్ అహ్మద్ పాషా అల్ మారూఫ్ ఇమ్రాన్ హుస్సేన్ ఖాద్రి షత్తారి చేసిన కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా హజ్రత్ మౌలానా మొహమ్మద్ యూసుఫ్ అలీ సూఫీ ఖాద్రి (జహీరాబాద్) ప్రత్యేక ప్రసంగం చేస్తూ ఖాద్రియా తరీఖా విశిష్టతను వివరించారు. "పీరో ముర్షిద్" అనే ఆధ్యాత్మిక గురువు మార్గదర్శకత్వం లేకుండా ఆధ్యాత్మిక పురోగతి సాధ్యం కాదని, ఆత్మశుద్ధి మరియు ఆధ్యాత్మిక గమ్యం సాధించడానికి గురువు పాత్ర అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సూఫీ సాధకులు, భక్తులు, ప్రముఖులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అసెంబ్లీ ముట్టడి ముందు బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్ ముందస్తు అరెస్ట్



**జహీరాబాద్ వెలుతురు మార్చి 23:**
సోమవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండల బీజేపీ అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్‌ను హద్నూర్ పోలీసులు అర్ధరాత్రి ఆయన నివాసానికి వెళ్లి ముందస్తుగా అరెస్ట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీజేపీ రాష్ట్ర నాయకత్వం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకునే ఉద్దేశంతోనే పోలీస్ అధికారులు ముందస్తు అరెస్టులకు దిగారని మల్లేష్ గంగ్వార్ విమర్శించారు. అర్ధరాత్రి సమయంలో బీజేపీ నాయకులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.దఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని అరెస్టులు చేసినా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అరెస్టులు, బెదిరింపుల ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నప్పటికీ తమ పోరాటాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఎప్పటికీ పోరాడుతూనే ఉంటుందని తెలిపారు.

## నిజామాబాద్ పట్టణంలో ఐపిఎల్ హంగామా

**- భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లపై మ్యాచ్‌ల వీక్షణం**

**నిజామాబాద్ ,మార్చి23( వెలుతురు):**
కేవలం మ్యాచ్ చూడటమే కాకుండా, ఒక మినీ స్టేడియం వాతావరణాన్ని ఇక్కడ కల్పిస్తారు. భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లపై మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. వేల మంది అభిమానుల మధ్య కేకలు వేస్తూ మ్యాచ్ చూడటం స్టేడియం అనుభూతిని ఇస్తుంది. మ్యూజిక్, డీజే హంగామాతో పాటు ఫుడ్ కోర్టులు అందుబాటులో ఉంటాయి. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, వర్చువల్ బ్యాటింగ్, బౌలింగ్ నెట్స్‌ను ఏర్పాటు చేస్తారు. ఫేస్ పెయింటింగ్, ఫొటో బూత్స్ వంటి సౌకర్యాలతో అభిమానులు తమకు ఇష్టమైన జట్టుకు మద్దతు తెలపవచ్చు. ఐపీఎల్ 2026 మార్చి 28న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య పోరుతో ప్రారంభం కానుంది. తొలి విడతలో 20 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మాత్రమే విడుదల చేసిన బీసీసీఐ, మూడు వారాల పాటు వివిధ నగరాల్లో ఫ్యాన్ పార్కులను నిర్వహించనుంది. మొదటి వారంలో అంటే.. మార్చి 28, 29న రోహ్‌తక్, భోపాల్ వంటి నగరాల్లో ఉంటుంది. రెండో వారంలో ఏప్రిల్ 4, 5 తేదీల్లో నిజామాబాద్‌తో పాటు మథుర, జోధ్‌పూర్, మైసూరు, భువనేశ్వర్‌లలో ఈ సందడి నెలకొంటుంది. మూడో వారంలో.. ఏప్రిల్ 11, 12 తేదీల్లో మేరఠ్, కోయంబత్తూర్ వంటి నగరాల్లో ఏర్పాటు చేస్తారు.

## అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లిన బీజేపీ నాయకుల అరెస్ట్‌పై ఆగ్రహం





**జహీరాబాద్ వెలుతురు మార్చి 23:**
రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసం అని బీజేపీ ప్రశ్నించింది. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచంద్రరావు పిలుపు మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్‌ను సోమవారం ఉదయం 4 గంటలకే పోలీసులు హౌస్ అరెస్ట్ చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు. అదేవిధంగా అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న పలువురు ముఖ్య నాయకులను, కార్యకర్తలను కూడా పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యమా, లేక పోలీసు రాజ్యమా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పథకాన్ని అర్హులైన ప్రతి రైతుకు అందించాలని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్‌తో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యుడు జగన్, జిల్లా కార్మిక సంఘం సభ్యుడు జగన్నాథ్, నాయకులు పాండు, స్వామి, ఓంకార్, జరప, ఓంకార్ తదితరులు ఉన్నట్లు తెలిపారు. వీరిని చిరాగ్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం.

## జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో రిటైర్డ్ ఆర్మీ అధికారికి ఘన సన్మానం

**జహీరాబాద్ వెలుతురు మార్చి 23:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో దేశ సేవలో విశేష సేవలు అందించి రిటైర్డ్ అయిన ఆర్మీ అధికారి ఆనంద్‌ను స్థానిక ఎస్ఐ ఏం కాశీ నాథ్ ఘనంగా సన్మానించారు. దేశ భద్రత కోసం సేవలందించిన సైనికుడిని పోలీస్ సిబ్బంది సత్కరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా ఎస్ఐ కాశీనాథ్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన సైనికులు మరియు ఆర్మీ అధికారుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. రిటైర్డ్ ఆర్మీ అధికారి ఆనంద్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా అభినందించారు. ఆయన చేసిన సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. దేశ భద్రత కోసం కష్టపడి పనిచేసిన వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఇశ్వర్ పాటిల్, ఏఎస్ఐ వేణుగోపాల్, నాయకులు మల్లేష్ స్వామి, శంకర్ స్వామి, పోలీస్ సిబ్బంది, శ్రీనివాస్ కుమార్, బలరాజు తదితరులు పాల్గొని రిటైర్డ్ ఆర్మీ అధికారిని అభినందించారు.

## పదో తరగతి విద్యార్థులకు భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**- బీమ్ ఆర్మీ అధ్యక్షులు వడ్డేపల్లి నాగరాజు**



**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 23:** నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలోని గ్రానూ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థి విద్యార్థినీలకు భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు గౌరవ డాక్టర్ చెరకొండ వెంకటేష్ సూచన మేరకు చేపట్టారు. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ ఉమ్మడి నల్గొండ జిల్లా కోఆర్డినేటర్ వడ్డేపల్లి నాగరాజు మాట్లాడుతూ, వేసవి కాలంలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులు దూరప్రాంతాలకు ప్రయాణం చేయాల్సి వస్తుందని, వారికి ఉపశమనంగా మజ్జిగ పంపిణీ చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులకు డా. చెరకొండ వెంకటేష్ మరియు భీమ్ ఆర్మీ అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్కట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ శ్రీమతి సామ శిరీష ప్రవీణ్ రెడ్డి , 2వ వార్డు సభ్యులు పల్రేపాటి సైదులు , 4వ వార్డు సభ్యులు ఆమనగంటి ఐలయ్య , 5వ వార్డు సభ్యురాలు శ్రీమతి మంద ఉమాగిరి ప్రసాద్ , 6వ వార్డు సభ్యులు బకరం జనార్దన్ , 9వ వార్డు సభ్యులు నడింపల్లి నరేశ్ , 12వ వార్డు సభ్యురాలు బోయపల్లి ధనలక్ష్మీ శ్రీనివాస్ , బొజ్జ నాగరాజు, కొత్తూరు నవీన్, పందుల రాకేష్, బాకీ చిన్న, ముప్పిడి కుమార్, బోడ చింటూ, మహేష్ యాదవ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



**నార్కెట్‌పల్లి వెలుతురు మార్చి 23:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ, ఆ హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్ రావు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. నార్కెట్‌పల్లిలో కూడా పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నడింపల్లి శ్రవణ్ కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మునుకుంట్ల గణేష్, మండల ప్రధాన కార్యదర్శి నోముల రాజు, వార్డు సభ్యులు వడ్డేగోని రామలింగం, పాలకూర రమేష్, పానుగుల్ల శివ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## శివ సాయి వెజిటేబుల్స్ షాప్ ప్రారంభం

**నార్కెట్‌పల్లి వెలుతురు మార్చి 23:** పట్టణంలోని అమ్మనబోల్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన శివ సాయి వెజిటేబుల్స్ షాప్ ను నార్కెట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ షాప్ యజమానికి శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షాప్ యజమాని, వార్డు సభ్యులు, పట్టణ నాయకులు మరియు స్థానికులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



## నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం




**గుండాల మార్చి 23 (వెలుతురు):** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో రైతు వేదికలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు ఐదురోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం శిక్షణ తరగతుల ఎంపీడీవో చండీరాణి ప్రారంభించి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు పంచాయతీరాజ్ చట్టంలో ఉన్న ప్రకారం పరిపాలన కొనసాగించాలని అన్నారు. గ్రామసభ తీర్మానం ప్రకారమే పనులు చేయాలని ప్రతి రెండు నెలలకు ఒకసారి జరిగే గ్రామ సభలో ప్రజలందరూ పాల్గొని గ్రామంలో అవసరమైన తీర్మానాలు చేయవచ్చునని అన్నారు. గ్రామపంచాయతీకి అనుబంధ సంస్థలైన 21 శాఖలు గ్రామపంచాయతీ ద్వారానే పరిపాలన సాగించాలని అన్నారు. ముఖ్యంగా గ్రామ పరిపాలనలో భాగమైన త్రాగునీరు వీధిలైట్లు మురికి కాలువలు రోడ్లు నిర్వహణపై సభ్యులు పరిపాలన కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సలీం ప్రభాకర్ రెడ్డి వచ్చు జనార్ధన్ లోడి రమేష్ గార్ల శ్రీశైలం ఆర్ సరిత తదితరులు పాల్గొన్నారు

## ఆరోగ్య లక్ష్మి కమిటీ ఏర్పాటు



**గుండాల మార్చి. 23(వెలుతురు):** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోనీ సుద్దాల గ్రామంలోనీ ఆరోగ్య లక్ష్మి పథకం సమర్థవంతమైన అమలుకు సర్పంచ్ ఆధ్వర్యంలో ఆరోగ్య లక్ష్మి కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ఈ కమిటీ కీలకంగా పనిచేయనుంది. ఈ కమిటీలో మొత్తం 11 మంది సభ్యులతో కమిటీని రూపొందించారు. చైర్ పర్సన్ గా గ్రామ సర్పంచ్ మహాదయ్. కన్వీనర్ గా అంగన్వాడి టీచర్ మౌనిక,నిర్వర్తించనున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా అందుతున్న సేవలు సమర్థవంతంగా అమలవుతూ లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సూచించారు గ్రామ ప్రజలు కూడా కమిటీకి సహకరించాలని కోరారు. మిగతా తొమ్మిది మంది సభ్యులుగా గ్రామానికి చెందిన ప్రతినిధులను ఎంపిక చేశారు. ప్రతి నెల 5వ తేదీ లోపు కమిటీ సమావేశం నిర్వహించి, పథకం అమలుపై సమీక్ష చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఉపసర్పంచ్ నగేష్ , ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎస్ కె యాకుబ్ పాషా, పంచాయతీ సెక్రెటరీ బి మధు, ఏఎన్ఎం రజియా, తదితరులు పాల్గొన్నారు.



## సామ్రాజ్యవాదం -మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడటమే భగత్ సింగ్ కు మనమిచ్చే ఘన నివాళి

**- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి**

**- ఎస్ఎఫ్ఐ-డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 23:** సామ్రాజ్యవాదం–మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడడమే భగత్ సింగ్ కు మనమిచ్చే ఘనమైన నివాళి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సుభాష్ సెంటర్లో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 95 వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి స్థానిక నాయకులతో కలిసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమెరికన్ సామ్రాజ్యవాదం తీవ్రస్థాయిలో పేట్రేగిపోతుందని ట్రంపు విచక్షణారహితంగా ఓ నియంతల వ్యవహరిస్తున్నాడని బలహీనమైన దేశాలని ఆసరాగా చేసుకొని యుద్ధం ప్రకటిస్తూ ప్రపంచాన్ని అశాంతి వైపు తీసుకెళ్తున్నాడని అన్నారు. గత కాలం నుండి సామ్రాజ్యవాదం వివిధ రూపాల్లో పెట్రేగిపోతుందని. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భగత్ సింగ్ లాంటి త్యాగధనులు ప్రాణాలర్పించి దేశాన్ని సాధించి పెట్టారని. భగత్ సింగ్ లాంటి వీరుల త్యాగాలు వృధా చేసే విధంగా కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికన్ సామ్రాజ్యవాదానికి తాకట్టుపెట్టి చోద్యం చూస్తోంది అన్నారు. రహస్యవాణిజ ఒప్పందాలను కుదుర్చుకొని దేశ ఆర్థిక వ్యవస్థని చిన్నాభిన్నం చేసి ధరల పెంపు చేసి సామాన్యులపై భారాన్ని మోపుతోందని అన్నారు. మరోవైపు మత ఉన్మాదంతో దేశ లౌకిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ మనుషుల మధ్య వైశమ్యాలను పెంచి పోషిస్తుందని అన్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వ ఆలంబించే మత ఛాందసవాద విధానాలకు వ్యతిరేకంగా దేశంలో ఉన్న యువత పోరాడడమే భగత్ సింగ్ కు మనమిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు పుట్టల ఉదయ్ కుమార్,శానగొండ రాము అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య, సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం,జిల్లా కమిటీ సభ్యుడు బల్గురి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యుడు కూరెళ్ళ నరసింహ చారి, మండల కమిటీ సభ్యులు గన్నెబోయిన విజయభాస్కర్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మెట్టు శ్రవణ్ కుమార్,బావండ్లపల్లి బాలరాజు, తోలుపునూరి శ్రీనివాస్, బొడిగ రజిత,పల్లె సత్యం, మునికుంట్ల లెనిన్ అంబటి మల్లారెడ్డి, శానగొండ వెంకటేశ్వర్లు,కొమ్ము అంజయ్య, బర్ల బాబురావు, అప్పల సురేందర్,తాటిపాముల నవీన్, పాలం అంజయ్య,ఆకిటి శీను, ఆకిటి మల్లేష్, ఎర్రోళ్ల నరసింహ, భావనపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకులు అక్రమ అరెస్ట్




**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 23:** తెలంగాణ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తూ ప్రజల బతుకులను ఆగం చేస్తూ భావితరాలకు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి అరాచక కమిషన్ల పాలన నిలదీస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్ర రావు నేతృత్వంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం తలపెట్టిన సందర్భంగా ఈరోజు పోలీసులు రామన్నపేట బిజెపి మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి నకిరేకల్ ఇంచార్జ్ నకిరేకంటి మొగులయ్య నీ అక్రమంగా ఇంటిదగ్గర అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది. ఇలాంటి అక్రమ అరెస్టులకి భయపడేది లేదని కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికలలో ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీలు మహిళలకు 2500 రైతులకు రైతుబంధు ఎకరాకు 15000 వేస్తామని వేయకపోవడం వృద్ధులకు పింఛన్ 4000 ఆడబిడ్డల పెళ్లి చేస్తే తులం బంగారం ఇస్తామన్నాడు. స్కూటీలు పంపిణీ చేస్తామని ఇలాంటి అనేక మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి హామీలను నెరవేర్చక పోగా ప్రజలని మభ్యపెడుతూ కడుపుతున్న కాంగ్రెస్ పార్టీ విధానాలని జనాలలోకి బిజెపి తీసుకెళ్లడాన్ని జీర్ణించుకోలేక ప్రజలలో బిజెపికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇలాంటి అరెస్టులు కాంగ్రెస్ ప్రభుత్వం చేయించడం కాంగ్రెస్ దుర్మార్గ పాలనని అంతానికి నాంది. అని రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఇలాంటి అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలని ఆపలేరని ప్రజల కోసం పనిచేయడంలో బిజెపి ఎప్పుడు ముందుంటుంది. ప్రజల పక్షాన ఎల్లప్పుడూ ఉంటామని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరుగుతుంది. రామన్నపేట మండలంలో అరెస్టు చేసిన వారిలో జిల్లా కౌన్సిల్ మెంబర్ పల్లపు దుర్గయ్య రాజన్న రమేష్, కొడారి వెంకన్న, సూరి మల్లేష్ తదితరులని అరెస్టు చేయడం జరిగింది.

## కరీంనగర్ ఆదర్శ నగర్ లో ఘనంగా ఈద్ మిలాప్







**కరీంనగర్, వెలుతురు మార్చి 23:** ఈద్ పర్వదినాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పట్టణం ఆదర్శనగర్ లో బిజెపి మైనార్టీ మోర్చా నాయకులు మొహమ్మద్ బషీరుద్దీన్ , మొహమ్మద్ అజారుద్దీన్ ల ఆధ్వర్యంలో ఘనంగా ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో ఐక్యతను మరింత బలపరుస్తూ, సామరస్యానికి ఈద్ మిలాప్ ఈ ప్రోగ్రాం ద్వారా సందేశాన్ని అందించింది. హిందూ ,ముస్లిం సమాజాలకు చెందిన అనేక మంది ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, సోదరభావం సామరస్యాన్ని ప్రతిబింబించారు. ఈ కార్యక్రమానికి నగరంలోని ప్రముఖులు , కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, ప్రముఖ సామాజిక సేవకులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. హిందూ ,ముస్లిం సమాజాలకు చెందిన అనేక మంది ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, సోదరభావం మరియు సామరస్యాన్ని ప్రతిబింబించారు. ఈ సమావేశంలో శాంతి, ఐక్యత మరియు పరస్పర గౌరవం వంటి విలువలను ప్రతిపాదించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు హాజరైన అతిథులందరికీ హృదయపూర్వక స్వాగతం పలికారు. నగర ప్రముఖులు, కార్పొరేటర్లను శాలువాలతో సన్మానించారు. ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు మహమ్మద్ బషిరోద్దీన్ , మహమ్మద్ అజారుద్దీన్ లు కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు

**- స్వామినాథన్ కమిషన్ సిఫారసులో అమలు చేయాలి**

**- మార్చి 31న రామన్నపేటలో జరిగే మహిళా రైతుల రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి**

**- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి**




**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 23:** రామన్నపేటలో మార్చి 31న జరుగు తెలంగాణ రైతు సంఘం మహిళా రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన రైతు సంఘం రాష్ట్ర సదస్సు సన్నాహక సమావేశంకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ రామన్నపేట మండల కేంద్రంలో మహిళా రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్రవ్యాప్తంగా మహిళా రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని అన్నారు. ఈ సదస్సులో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అవలంబించే మహిళా రైతు వ్యతిరేక విధానాలపై చర్చించి మహిళా రైతుల భవిష్యత్తు పోరాటానికి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని అన్నారు. మోడీ ప్రభుత్వం భారత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల్ని అమలు చేయకుండా ఆదాని, అంబానీ కార్యాచరణని అమలు చేస్తుందని ఎద్దేవా చేశారు. అందులో భాగంగానే విత్తన బిల్లు మార్కెట్ ముసాయిదా బిల్లు విద్యుత్ సవరణ బిల్లులు తీసుకొచ్చారని గతంలో రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు నెరవేర్చక పోగా ఉన్న అవకాశాలను కూడా నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. మహిళలకు భూమిపై ఎలాంటి హక్కులు లేవు జాయింట్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు పాలకులు వాగ్దానాలు చేస్తున్నారు తప్ప ఆచరణలో అమలు కావడం లేదని రాష్ట్ర ప్రభుత్వం భూభారతి సందర్భంగా ఆయన ఈ అంశంపై ఉండేవిధంగా చూసుకుంటే ఉపయోగకరంగా ఉండేది. మరోవైపు పెట్టుబడి సాయం అందకపోవడం వలన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులలో కూడా మహిళలు గణనీయంగా ఉన్నారని పేరు పెట్టుబడి కోసం జాయింట్ లైబుల్ గ్రూపులను ఏర్పాటు చేసి వీటి ద్వారా రుణాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని మరోవైపు వ్యవసాయ అనుబంధ రంగాలలో కూడా మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని పాలు, గుడ్లు,కూరగాయలు చేపలు,కోళ్ల పెంపకం లో వీరి పాత్ర కీలకంగా మారిందని మహిళలను ప్రోత్సహించే ప్రత్యేకమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. యాంత్రికరణ పెరిగినప్పటికీ పనిభారాన్ని తగ్గించే యంత్రాల రూపకల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని రైతుల ఆత్మహత్యల్లో మహిళా రైతుల ఆత్మహత్యలు కూడా గణనీయంగా నమోదవుతున్నాయని కుటుంబ యజమాని చనిపోయిన సందర్భంలో భారాన్నంత మహిళలు మోస్తున్నారని వీరి సమస్యల పరిష్కారానికి జరుగు సదస్సు జయప్రదం చేయాలని అన్నారు. యూరియా యాప్ ను రద్దుచేసి యధాతథంగా రైతులకు సరిపడా యూరియాను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా, సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల అధ్యక్షుడు గన్నేబోయిన విజయభాస్కర్, బల్గూరి అంజయ్య, బొడిగె రజిత,గాదె నరేందర్, బర్ల బాబురావు,గొరిగె సోములు, బావండ్లపల్లి బాలరాజు,కొమ్ము అంజయ్య, పెండెం బ్రహ్మయ్య,మునికుంట్ల లెనిన్, ఎర్రోళ్ళ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ చైర్మన్ ను సన్మానించిన విశ్వభారతి విద్యార్థుల బృందం



**మోత్కూర్, మార్చి 23,(వెలుతురు న్యూస్ ):** మోత్కూర్ శాఖా గ్రంథాలయ చైర్మన్ గా రెండవ సారి నియమితులైన విశ్వభారతి స్కూల్ విద్యార్థి కోమటి మత్స్యగిరిని ఈరోజు శాఖా గ్రంథాలయంలో విశ్వభారతి స్కూల్ విద్యార్థుల బృందం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రంథాలయ అభివృద్ధికి విశ్వభారతి స్కూల్ ప్రధాన పాత్ర పోషిస్తుందని పాఠశాల గురువులు పురుగుల రాములు, బయ్యని రాజు, సజ్జనం మనోహర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల బృందం ప్రతినిధులు పురుగుల శ్రీను, బోల్లేపల్లి శ్రావణ్, అవిశెట్టి రాజు, ఎడ్ల శ్రీకాంత్, నిలిగొండ సైదులు, జినుకల రమేష్,చొల్లేటి నరేష్,మన్నే కరుణాకర్, పురుగుల భాస్కర్, నిలిగొండ మహేష్,జినుకల యాకన్నా,దుబ్బాక అశోక్, ఎం. డీ అక్బర్, ఎడ్ల పాండు,జటంగి నాగరాజు, నిలిగొండ మహేష్,దొంతోజు నవీన్, నారబోయిన ఉపేందర్, లైబ్రరీ ఇంచార్జ్ చిలకమర్రి బాబూ చారి, మందుల మల్లేష్, హరి బాబు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రామలింగేశ్వర స్వామి సన్నిధిలో అన్నప్రసాద వితరణ



**మోత్కూర్, మార్చి 23,(వెలుతురు న్యూస్ ):** మోత్కూరు మున్సిపాలిటీలో ప్రతీ సోమవారం శ్రీ రామలింగశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్నప్రసాద కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు మోత్కూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న గుప్తా సతీమణి కళ్యాణి గారి పుట్టినరోజు ను పురస్కరించుకొని మహా అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శ్రీ రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం లో డీసీసీ ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి, నాయకులు బొల్లెపల్లి శ్రావణ్, శ్రీధర్ ఆలయ కమిటీ సభ్యులు బుర్ర కృష్ణ, బుర్ర యాదయ్య అంజయ్య సంతోష్, అన్నెపు నర్సింహా, అన్నెపు వెంకన్న సజ్జనం పాండు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య మిత్రులు చిన్ననాటి మిత్రుడికి కుటుంబానికి ఆర్థిక సాయం



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 23:** గ్రామం కొమ్మయిగూడెం పగిళ్ల రమేష్ వాళ్ళ అమ్మ అనారోగ్యంతో మరణించినది. తెలుసుకున్న పదవ తరగతి 2011&2012 విజ్ఞాన వర్ధిని హైస్కూల్ స్నేహితునికి 13500/–ఆర్థిక సహాయం అందజేసిన పూర్వ విద్యార్థులు దగ్గుల నవీన్ వీరమల్ల శివ గుణగంటి కృష్ణ బెల్లి నవీన్ కళ్లెం ఉపేందర్ కందుల శ్రీశైలం మిరియాల శ్రీమన్నారాయణ, నక్క రుక్కయ్య, గుడ్డేటి గణేష్, పోషబోయిన సతీష్, గర్దాసు సతీష్, పావురాల మచ్చ గిరి, బుంగ ప్రవీణ్, కడారి శ్యాంసుందర్, ఆవుల నిఖిల్, దండిగ శంకర్, చిందం శంకర్, జల్ల సాయిప్రసాద్, బొడిగె నవీన్, సంకు ప్రశాంత్, కాటేపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ

**- మాజీ జడ్ పి టి సి తీర్మల్ గౌడ్**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 23**

రైతుల పక్షపాతిగా కాంగ్రెస్ పార్టీ నిలిచిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పిటిసి సభ్యుడు తీగల తిరుమల గౌడ్. పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి. పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు. డైరెక్టర్ గోపాల్ రెడ్డి లు మాట్లాడుతూ. ఎన్నికల హామీల ప్రకారం గా రైతుబంధును రైతు ఖాతాలో వేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్క రైతుకు దశలవారీగా ఐదు ఖాతాలో జమ చేస్తామని వివరించారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో హామీలను అమలు చేయలేకపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతు భరోసా పథకం కింద విడుదల చేయడం జరిగిందని గుర్తు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ మంజూరు చేయిస్తున్నాడని చెప్పారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేద ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రతి పేద కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని వివరించారు.

## ముత్యంపేట నుండి దోమకొండ ఆర్ & బి పనులు తొందరగా పూర్తి చేయాలి

**- తహసీల్దార్ కు బి ఆర్ ఎస్ నాయకుల వినతి**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 23**

కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో సోమవారం నాడు మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముత్యంపేట్ రోడ్డు నిర్మాణంలో జాప్యం గురించి తహసీల్దార్ గారికి మెమోరాండం ఇవ్వడం జరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గారు 25 కోట్ల రూపాయలతో ఆర్ & బి శాఖ ద్వారా నర్సన్నపల్లి, క్యాసంపల్లి, రాఘవపూర్, ముత్యంపేట్ మీదుగా దోమకొండ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం మంజూరు చేయించారు. అట్టి పనిని ప్రారంభించి 3 సంవత్సరాలు గడిచిపోయింది. ఇందులో భాగంగా ముత్యంపేట్ నుండి దోమకొండ వరకు కంకర రోడ్డు వేసినారు. కంకరపై నీరు పట్టక కంకర లేచిపోయి రాక, పోకలకు ఇబ్బంది కలుగుతు ప్రమాదకరంగా మారిందన్నారు. ప్రయాణికులు కంకర ఉండటంతో వారి వాహనాలు అదుపు తప్పి క్రింద పడిపోతున్నారనీ కావున ఇట్టి పనిని ఆర్ &బి శాఖ చొరవ తీసుకొని తక్షణమే పనులు పునఃప్రారంభించి బి టి రోడ్డు పూర్తి చేయవలసిందిగా కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు,ప్రజా ప్రతినిధులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ వ్యవహారం

**- ఆర్థిక కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం**

**- తక్షణం కోర్టు ముందుకు రావాలని ఆదేశం**



**హైదరాబాద్,మార్చి23( వెలుతురు):**

రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఏడాదిగా బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో ఆర్థిక కార్యదర్శి పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈరోజు అర్ధరాత్రి వరకైనా కోర్టులోనే ఉంటాము.. . ఆర్థిక కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను దిక్కరించిన ఆర్థిక కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని బాధితులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా సోమవారం వారి పిటిషన్‌కు విచారణకు వచ్చింది. ఈ పిటిషన్ విచారిస్తూ సోమవారం కోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆర్థిక కార్యదర్శికి ఆదేశించినప్పటికీ, కోర్టుకు రాకపోవడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు.అసెంబ్లీ సమావేశాల కారణంగా కోర్టుకు హాజరు కాలేకపోయారని ప్రభుత్వం తరపు న్యాయవాది సమాధానమిచ్చారు. అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని ముందే తెలుసు కదా. రాలేనని ముందే చెప్తే మినహాయింపు ఇచ్చేవాళ్ళం. కానీ ఈరోజు ఎంత రాత్రయినా ఆర్థిక కార్యదర్శి కోర్టులో హాజరు కావాల్సిందేనని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

## కాంగ్రెస్ హామీలకు దిక్కులేదు

**- మండిపడ్డ మాజీమంత్రి లక్ష్మారెడ్డి**

**జడ్చర్ల,మార్చి23( వెలుతురు):**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎక్కడా కూడా అమలు కావడం లేదని బీఆర్ఎస్ నాయకుడు , మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల పట్టణం అంబేద్కర్ కళా భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ పాలనపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడి సగం రోజులు గడిచిపోయాయని, ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, ఇంకెన్ని రోజులు ప్రజలను మభ్య పెడుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ అత్యంత అవినీతిమయమైందని, మంత్రులు మధ్య వాటా పంచాయితీ ఎప్పుడూ చూడలేదని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులకు ప్రజల సంక్షేమం,అభివృద్ధిపై పట్టింపు ఉండదని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడున్నర లక్షల కోట్లు అప్పు చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చెప్పారని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రెండు లక్షల ఎనభై వేల కోట్లు మాత్రమే అప్పు చేసిందని కేంద్రం పార్లమెంట్‌లో చెప్పిందని గుర్తు చేశారు. మూడేండ్లు పూర్తి కాక ముందే మూడున్నర లక్షల కోట్లు అప్పు చేసి ఏం చేశారని ప్రభుత్వాన్ని లక్ష్మారెడ్డి నిలదీశారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు కడుతున్నామని అవాస్తవాలు చెబుతున్నారని విమర్శించారు. మూడున్నర లక్షల కోట్ల అప్పుతో మీరు చేసిన పనులు కనిపించడం లేదు. ప్రాజెక్టులు లేవు. సంక్షేమం లేదు. హామీల అమలు లేదని అన్నారు. రైతు భరోసా నిధులు మూడుసార్లు ఎగ్గొట్టి మోసం చేశారని ఆరోపించారు. బ్జడెట్ లో అంకెల గారడీతో అభివృద్ధి సాధ్యం కాదని, పేపర్ లో మాత్రమే అంకెలను అటు ఇటు మార్చి చెప్పినంత మాత్రాన క్షేత్రస్థాయిలో ఫలితాలు రావని పేర్కొన్నారు

## ఓఆర్ఆర్‌పై డిసిఎంను ఢీకొన్న కారు

**- దివంగత మాగంటి కూతుళ్లకు ప్రమాదం**

**హైదరాబాద్,మార్చి23( వెలుతురు):**

దివంగత బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కూతుళ్లు ప్రయాణిస్తున్నవాహనం ప్రమాదానికి గురైంది. ఆదివారం రాత్రి మాగంటి కూతుళ్లు ప్రయాణిస్తున్న కారు ఓఆర్ఆర్‌పై గచ్చిబౌలి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వైపు వెళ్తుండగా డీసీఎం వాహనాన్నిఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మాగంటి పెద్ద కూతురు అక్షరకు తీవ్రగాయాలు కాగా.. చిన్నకూతురుతోపాటు మరో వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. దీంతో వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. నార్సింగ్ పోలీస్ అకాడమీ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. పెద్ద కూతురు అక్షర చికిత్స అనంతరం కోలుకుంటుందని, చిన్న కూతురు స్వల్ప గాయాలపాలైందని కుటుంబసభ్యులు తెలిపారు. తమ స్నేహితులను ఎయిర్‌పోర్టులో వదిలిపెట్టి తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

## అడవులను కాపాడితేనే దేశం సుస్థిరంగా ఉంటుంది

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్చంద్ర**







**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 23**

అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవం, పిచ్చుకల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ముందుగా కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ కార్యాలయం నుండి డిగ్రీ కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, “మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెంపొందించవచ్చని కళాశాలలో ఉన్న ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్రతి పుట్టినరోజున ఒక మొక్క నాటడం అలవాటు చేసుకోవాలి” అని సూచించారు. “అటవీ సంరక్షణే దేశ సంరక్షణ” అనే నినాదంతో ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. పిచ్చుకల సంరక్షణపై కూడా దృష్టి సారించాలని, ఇంటి వద్ద నీటి గిన్నెలు ఉంచడం, చిన్న గూళ్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, “ప్రాణవాయువు లేకుండా మానవ జీవనం సాధ్యం కాదు. అడవులు, చెట్లు మన జీవనాధారాలు. ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది” అని తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించాలని, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో ముందుండాలని పిలుపునిచ్చారు. అటవీ శాఖ అధికారిణి నిఖిత, ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, ప్రిన్సిపల్ తదితర అధికారులు పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు. పోలీస్, అటవీ శాఖ అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమావేశం లో సారధి కళాకారులు తమ గీతాలతో “చెట్టూ చెట్టమ్మను నేనుడ చెట్టును నేనురాడ మనిషి మనుగడకు జీవం పోసే అమ్మ” వంటి నినాదాలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అటవీ సంరక్షణ, పరిరక్షణ పోస్టర్ ను ఆవిష్కరించారు.

## అక్రమ అరెస్ట్ లకు భయపడేది లేదు...

**- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు**

**ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి.**

**కరీంనగర్ వెలుతురు మార్చి 23:**

ప్రజలకోసం పోరాడే బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేస్తే భయపడేది లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. అమలుగాని 420 హామీలు, 6 గ్యారంటీల ను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావ్ చలో అసెంబ్లీ కి పిలుపునిచ్చిన క్రమంలో సోమవారం ఉదయమే తిమ్మాపూర్ బీజేపీ నాయకులను,కార్యకర్తలను ఎల్ఎండి పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని పోరాటం చేస్తున్న బీజేపీ కార్యకర్తలను అరెస్ట్ చేసినంత మాత్రాన ప్రజల కోసం ఎంతటికైనా సిద్దమేనని పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి,మాజీ ఎంపీటీసి ఎడ్ల జోగిరెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు చింతం శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల.తిరుపతి రెడ్డి,బిజెవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్,కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధికారప్రతినిధి రాజు గౌడ్,జంగ సునీల్ రెడ్డి, వేల్పుల ఓదయ్య, రేగూరి సుగుణాకర్,దూల్గుంటి శేఖర్ రెడ్డి,కిన్నెర ముత్తిలింగం,యాదగిరి తదితరులను ఎల్ఎండి ఇంచార్జి ఎస్ఐ అన్వర్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ తిలక్ ముందస్తుగా అదుపులోకి తీసుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.



### స్వాతంత్ర్య అమరవీరులకు ఘనంగా నివాళులు...

స్వాతంత్ర్య సంగ్రామ పోరాటం బ్రిటీష్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒకేసారి ఉరితీయబడ్డ ముగ్గురు అమరవీరులకు సోమవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించారు. మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ ప్రభుత్వం తో పోరాటం చేస్తూ పట్టుబడిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లను మార్చి 23 న ఒకేసారి ఉరితీసిన రోజని పేర్కొన్నారు.భారత ప్రభుత్వ ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం వారి త్యాగాలను ప్రజలకు తెలిసేలా షహీద్ దివస్ పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని అన్నారు. వారి యొక్క దేశభక్తి అమూల్యమైనదని అన్నారు.వారి త్యాగాలను విస్మరించకుండా, ఆశయాల సాధనలో యువత నడుంబిగించాలని కోరారు.తిమ్మాపూర్ రాజీవ్ రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన ముగ్గురు అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి,మాజీ ఎంపీటీసి ఎడ్ల జోగిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతం శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి,మండల ఉపాధ్యక్షులు పబ్బ తిరుపతి,బిజెవైఎం మండల అధ్యక్షులు గడ్డం అరుణ్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, ఓబీసి జిల్లా అధికార ప్రతినిధి రాజు గౌడ్, మండల కార్యదర్శి జంగ సునీల్ రెడ్డి,రేగూరి సుగుణాకర్, వేల్పుల ఓదయ్య, కిన్నెర ముత్తిలింగం,గొల్లపల్లి యాదగిరి, దూల్గుంటి శేఖర్ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## భార్యపై అనుమానం సెగలు

**- ఆవేశంతో హత్యచేసిన దుండగుడు**

**రంగారెడ్డి,మార్చి23( వెలుతురు):**

అనుమానం పెనుభూతమై ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. తన మాట వినడం లేదని, ఇతరులతో చనువుగా ఉంటోందని భార్యను అత్యంత కిరాతకంగా చంపాడో భర్త. ఈ ఘటన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. హత్య చేసిన అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని బైక్‌పై తరలించి పొలాల్లో పడేసిన నిందితుడిని పోలీసులు గంటల వ్యవధిలోనే అరెస్టు చేశారు. హత్య కు సంబంధించిన పూర్తి వివరాలు సోమవారం షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఏసిపి లక్ష్మీనారాయణ మీడియాకు వివరించారు. పోలీసులు తెలిపిన ప్రకారం ఘటన వివరాల్లోకి వెళ్తే.. ?మహబూబ్‌నగర్ జిల్లా వీరన్నపేటకు చెందిన పానుగంటి నర్సింలు (31), అదే ప్రాంతానికి చెందిన శోభ అలియాస్ శోభారాణి (33)ని నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి మూడేళ్ల కుమార్తె మమత ఉంది. శోభకు అంతకుముందే వివాహమై ఒక కుమారుడు ఉన్నాడు. కొంతకాలం సజావుగా సాగిన వీరి సంసారంలో నర్సింలు మద్యానికి బానిస కావడంతో గొడవలు మొదలయ్యాయి. వేధింపులు భరించలేక శోభ తన కుమార్తెతో కలిసి రంగారెడ్డిగూడెంలోని తన తల్లి వద్ద నివసిస్తోంది. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న నర్సింలు, ఎలాగైనా ఆమెను అంతమొందించాలని పథకం వేశాడు. ?మాయమాటలతో పిలిపించి.. ?ఈ నెల 21న నీ కొడుక్కి సైకిల్ ఇప్పిస్తాను, మహబూబ్‌నగర్‌కు రా అని నర్సింలు శోభను నమ్మించి పిలిపించాడు. ఆమె తన కుమార్తెతో కలిసి రాగా, తన గదికి తీసుకెళ్లి మద్యం సేవించాడు. అక్కడ మళ్లీ గొడవ జరగడంతో, ముందే సిద్ధం చేసుకున్న గ్రానైట్ రాయితో ఆమె తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. ??హత్య చేసిన అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా రక్తపు మరకలను శుభ్రం చేశాడు. అర్ధరాత్రి సమయంలో శోభ మృతదేహాన్ని మూటకట్టి, బైక్ పెట్రోల్ ట్యాంక్‌పై పెట్టుకున్నాడు. దానిపైనే తన మూడేళ్ల కుమార్తెను కూర్చోబెట్టుకుని, రంగారెడ్డిగూడెం శివారులోని ఓ పొలం గట్టున పడేసి పరారయ్యాడు. మరుసటి రోజు ఉదయం స్థానికుల సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగి సాంకేతిక ఆధారాలతో నిందితుడి కదలికలను గమనించి, సోమవారం ఉదయం లింగంపల్లిలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. అతని వద్ద నుంచి ఒక సెల్ ఫోన్, హత్యకు వాడిన రాయి, రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మీడియా కు వివరించారు.నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ కె. సీతారాం, ఎస్ఐలు సుశీల, శ్రీకాంత్, రాజేశ్వర్, శివరెడ్డిలను ఫ్యూచర్ సిటీ కమిషనర్, షాద్‌నగర్ డీసీపీ అభినందించారు.



## వేములకు కెటిఆర్ తదితరుల పరామర్శ

**హైదరాబాద్,మార్చి23( వెలుతురు):**

మాజీ మంత్రి, బాల్కొండ బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , మాజీ మంత్రులు హరీష్‌రావు , జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పరామర్శించారు. ఇటీవల స్వల్ప అనారోగ్యానికి గురైన వేములను సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య యోగ క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, అనిల్ జాదవ్ తదితరులున్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

**హైదరాబాద్,మార్చి23( వెలుతురు):**

హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ పోలీసు స్టేషన్ పరిధి విజయనగర్ కాలనీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శృతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి మూడో అంతస్తులో ఏసీ పేలడంతో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో భయాందోళనకు గురైన సిబ్బంది, రోగులు బయటికి పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకొని మంటలను ఆర్పుతున్నారు.

## నేటు ప్రపంచ టిబి దినోత్సవం

**- వాకథాన్‌లో ప్రజలో చైతన్యానికి కృషి**

**- నాపా ఆధ్వర్యంలో నేడు కెబిఆర్ పార్క్‌లో కార్యక్రమం**

**- వ్యాధిపట్ల ప్రజలు చైతన్యవంతం కావాలని పిలుపు**



**హైదరాబాద్,మార్చి23( వెలుతురు):**

మాయమైందనుకున్న క్షయ వ్యాధి మళ్లీ విజృంభిస్తోంది. చాపకింద నీరులా వ్యాప్తి చెందుతోంది. కేంద్రప్రభుత్వం కట్టడి చర్యలు తీసుకుంటున్నా, ప్రజల నిర్లక్ష్యం కారణంగా మళ్లీ వ్యాప్తిం చెందుతోంది. వ్యాధి బారిన పడ్డవారు సరిగా గుర్తించకపోవడం, వైద్యుల సలహాలు పాటించక పోవడం, సరైన చికిత్స తీసుకోక పోవడం వంటి కారణాలతో మళ్లీ వ్యాప్తి చెందుతోంది. ఈ క్రమంలో సామాజిక బాధ్యతయగా గుర్తించిన యువ వైద్యులు ఓ బృందంగా ఏర్పడి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, చైతన్యం చేయడానికి పూనుకున్నారు. హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తు ప్రచార కార్యక్రమాలకు దిగారు. 24న మంగళవారం ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో చైతన్యం కోసం వాకథాన్ నిర్వహించారు. ఆదివారం సంజీవయ్యపార్క్‌లో నిర్వహించిన వాకథాన్‌తో పాటు మంగళవారం కెబిఆర్ పార్క్‌లో కూడా దీనిని నిర్వహించబోతున్నారు. న్యూ ఏజ్ పల్మనాలజిస్ట్స్ అసోసియేషన్ కోర్ కమిటీ నాపా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. ఇందులో ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. వివేక్ వర్ధన్ వీరపనేని,డా. బి. అనిరుధ్,డా. రోహిత్ రెడ్డి,డా. గోవర్ధన్ రెడ్డి, డా. కె. ప్రశాంతి,డా. ఉపేంద్ర, డా. ఓబుల్ రెడ్డిలు ఉన్నారు. వీరంతా కలసి ఈకార్యక్రమం ద్వారా ప్రజాచైతన్యం కోసం వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. విష్ణున్ రావు వీరపనేని,డా. సుధాకర్ కంది,డా. టిఎల్ఎన్ స్వామి,డా. దయానంద్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి మూడు నిముషాలకు ఇద్దరు వ్యక్తులు టిబి కారణంగా చనిపోతున్నారని, ఇది అత్యంత బాధాకరమైన విషయమని, ప్రజలు చైతన్యం కావాలని నాపా ప్రతినిదులు సూచించారు. టిబికి ఆధునిక వైద్య చికిత్స అందుబాటులో ఉందని, ఇది క్యూరబుల్ అని అన్నారు. ప్రపంచ జనాభాలో నాలుగింట ఒక వంతు మంది క్షయవ్యాధి బారినపడుతున్నారని అన్నారు.ఏళ్ళ తరబడి క్షయవ్యాధి అనేది వైద్యపరమైన చిక్కులు, సామాజిక మరియు ఆర్థిక ఇబందులు చూపుతుందని అన్నారు. ఈ క్షయవ్యాధి ప్రపంచ మరణానికి ప్రధాన కారణం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మరణాలతో 1.04 కోట్ల కొత్త కేసులు నమోదైనవి అని నివేదించిందని అన్నారు. అవగాహనను పెంచడానికి, ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని 1982 నుండి ప్రతి సంవత్సరం మార్చి 24న జరుపుకుంటున్నామని అన్నారు. తమ బాధ్యతగా నాపా ప్రతినిధులంతా కలసి ప్రజలను చైతన్యం చేఏందుకు ముందుకు వచ్చామని నాపా ప్రతినిధి డాక్టర్ వివేక వర్ధన్ వీరపనేని అన్నారు. వాడుక భాషలో టిబిగా పిలిచే క్షయ వ్యాధి వల్ల ప్రతి సంవత్సరం అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వ్యాధి మైకోబ్యాక్టీరియం ట్యుబర్‌కులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. కానీ మెదడు, మూత్రపిండాలు మరియు వెన్నెముక వంటి శరీరంలోని ఇతర భాగాలపై కూడా ఇది ప్రభావం చూపిస్తుందని అన్నారు. అందువల్ల ప్రజలు అప్రమత్తం కావలని, సకాలంలో వైద్యుల సలహాలు తీసుకుని, చికిత్సకు సిద్ధం కావాలన్నారు. తాము నిర్వహించే వాకథాన్ ప్రజల్లో చైతన్యం కలిగిస్తే అంతకు మించిన లక్ష్యం మరోటి లేదన్నారు.

# కాంగ్రెస్ కు వరుస షాక్

గౌహతి, మార్చి23( వెలుతురు):



శంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది. పొత్తులు, సీట్ల సర్దుబాట్లు కూడా కొలిక్కి వచ్చాయి. నామినేషన్లు వేసిన అభ్యర్థులు, పార్టీలు ప్రచారం జోరు కూడా పెంచుతున్నాయి. అయితే కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు కీలకంగా మారాయి. అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడులో కాంగ్రెస్ బలంగా కనిపిస్తోంది. అయితే ఈ సమయంలో ఆ పార్టీ నేతలు షాక్ ఇస్తున్నారు. పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు భూపేంద్ర బోరా తర్వాత మార్గరీటా ఎంపీ ప్రద్యుత్ బోర్గలై రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆయన కుమారుడు ప్రతీక్ కూడా పార్టీ టిక్కెట్ తిరస్కరించి పోటీకి సిద్ధం కాదని ప్రకటించడంతో పార్టీకి మరింత షాక్.ప్రద్యుత్ బోర్గలై, నాగావ్ లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు గెలిచిన కాంగ్రెస్ ఎంపీ, అంతర్గత విభేదాల కారణంగా పార్టీకి రాజానామా చేశారు. భూపేంద్ర బోరా రాజీనామా తర్వాత ఇది మరో దెబ్బ. మార్గరీటా అసెంబ్లీ స్థానానికి ప్రతీక్ బోర్గలై ప్రకటించింది కాంగ్రెస్. అయితే తాను పోటీ చేయనని తెలిపారు. ఈ సంఘటనలు పార్టీ స్థిరత్వాన్ని దెబ్బతీశాయి.ప్రద్యుత్ రాజీనామాతో పాటు 80 మంది కీలక కార్యకర్తలు కాంగ్రెస్ వదిలేశారు. ఎన్నికల ముందే ఈ సంఖ్యలో వలసలు పార్టీ ఓటు బ్యాంకును బలహీనపరుస్తున్నాయి. బీజేపీ ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మీడియా ద్వారా మాజీ కాంగ్రెస్ నేతలను ఆకర్షిస్తూ పార్టీ బలం పెంచుకుంటోంది.కాంగ్రెస్‌లో అభ్యర్థి ఎంపిక, నాయకత్వ విభేదాలు ప్రధాన కారణాలు. ఒకప్పుడు అస్సాంలో బలమైన పార్టీగా ఉన్న కాంగ్రెస్, బీజేపీ ఆధిపత్యం ముందు బలహీనపడుతోంది. రాహుల్, ప్రియాంక గాంధీ ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. ఈ వలసలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతాయి.బీజేపీ ఈ సందర్భాన్ని ఉపయోగించుకుని కాంగ్రెస్ బలహీనతను హైలైట్ చేస్తోంది. మార్గరీటా స్థానంలో తండ్రి?కొడుకుల విభజన రాజకీయ ఆసక్తిని రేపుతోంది. కాంగ్రెస్ ఈ సంక్షోభాన్ని అధిగమించకపోతే అస్సాంలో మరింత బలహీనపడుతుంది.

## భవిష్యత్తును నిర్ణయించే 13 జిల్లాలు...

**- సిలిగురి కారిడార్ కీలకం..**




కోల్ కత్తా, మార్చి23( వెలుతురు):

రత దేశం యొక్క రాబోయే 20 నుంచి 30 ఏళ్ల భవిష్యత్తును దేశంలోని కేవలం 13 జిల్లాల జనాభా స్వరూప స్వభావాలు నిర్ణయించబోతున్నాయి. ఈ 13 జిల్లాల జనాభా 2.80 లక్షల చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని, అది భారత్‌లో ఉంటుందా.. వెళ్లిపోతుందా వేరే దేశం అవుతుందా అన్నది నిర్ధారిస్తుంది. ఈ 2.80 లక్షల చదరపు కిలోమీటర్లు 7 రాష్ట్రాలతో కలిసి ఉన్నాయి. ఈ 13 జిల్లాలు అత్యంత కీలకమైన సిలిగురి కారిడార్ 100 కి.మీ పొడవు. 22 కి.మీ వెడలప్పు ఉన్న ఈ కారిడార్‌కు సమీపంలో అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మేఘాలయ, మిజోరాం, త్రిపుర రాష్ట్రాలకు చెందిన 13 జిల్లాలు రాబోయే పది ఇరవై ఏళ్లలో భారత దేశంపు భాగ్యాన్ని నిర్ధారించడంతోపాటు ఇండియా మ్యాప్ ఎలా ఉంటుందో డిసైడ్ చేస్తుంది. సిలిగురి 100 కి.మీ. పొడవు, 22 కి.మీ. వెడల్పు కలిగిన చిమటాగా ఈశాన్య భారతంలోని 7 రాష్ట్రాలను దేశ మిగిలిన భాగంతో కలుపుతుంది. ఈ కారిడార్ సమీపంలో బిహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లోని 13 జిల్లాలు ఉన్నాయి, ఇవి 2.8 లక్ష చ.కి.మీ. విస్తీర్ణాన్ని కలిగి ఉన్నాయి. ఈ ప్రాంతాల జనాభా మార్పులు ఈశాన్య రాష్ట్రాల భవిష్యత్తును, దేశ మ్యాప్ స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తాయి.బిహార్‌లోని అరరియా, పూర్ణియా, కటిహార్, కిషన్‌గంజ్ జిల్లాలు 38?68% ముస్లిం జనాభా కలిగి ఉన్నాయి. బంగ్లాదేశ్‌కు సమీపంలో ఉన్నాయి. మొత్తం జనాభాలో బంగ్లాదేశ్ నుంచి వచ్చినవారే ఎక్కువ. ఇక పశ్చిమ బెంగాల్‌లోని మాల్డా, ముర్షిదాబాద్, ఉత్తర దినాజ్‌పూర్ కూడా ముస్లిం జనాభా కలిగిన దేశాలే. ఉత్తర బెంగాల్‌కు కీలకం, హిందూ?ముస్లిం సమతుల్యం జార్ఖండ్‌కు చెందిన పాకూరు, గోడ్డా, సాహిబ్‌గంజ్, దుమ్కా, జమతారా, దేవఘర్ గిరిజన జిల్లాలు 44 శాతం ఉన్న వీరి జనాభా ఇప్పుడు 22 శాతానికి పడిపోయింది. ఇక ముస్లిం జనాభా 7 శాతం నుంచి 24 శాతానికిపెరిగింది. ఈ జిల్లాల్లో ముస్లిం జనాభా పెరుగుదల బంగ్లాదేశ్ చొరబాటు, సంఘటనా ప్రభావాలతో ముడిపడి ఉంది.1946 ముస్లిం లీగ్ తీర్మానం ఈ జిల్లాలను బెంగాల్‌లో కలపాలని డిమాండ్ చేసింది. శ్యామాప్రసాద్ ముఖర్జీ ప్రయత్నాలతో హిందూ బలమైన ప్రాంతాలు బెంగాల్‌లో ఉంచబడ్డాయి. 1956 వరకు ఈ ప్రాంతాల్లో విభజన ఉద్రిక్తతలు కొనసాగాయి. పాకిస్తాన్ 1940 నుంచి ఈ జిల్లాలపై కన్ను పెట్టింది.13 జిల్లాల జనాభా మార్పులు ఈశాన్య రాష్ట్రాల భద్రతను, రాజకీయ శక్తిని ప్రభావితం చేస్తాయి. బీజేపీ బలం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రతిపక్ష ఆధిపత్యం పెరిగే అవకాశం. ఇటీవల బిహార్ నేత ప్రకటనలు సిలిగుడి 'నెక్'ను లక్ష్యంగా చేసుకున్నాయి. 2050 నాటికి భారత్ 170 కోట్ల జనాభాకు చేరుకుంటుంది, ఈ ప్రాంతాలు దానిలో కీలక పాత్ర పోషిస్తాయి.జనాభా అసమతుల్యత భారత్‌లో ఉత్తర?దక్షిణ విభేదాలను పెంచుతోంది. ఈశాన్య భద్రతా ప్రణాళికలు, జనాభా నిర్వహణ విధానాలు తప్పనిసరి. రాబోయే జనాభా లెక్కలు ఈ ట్రెండ్‌ను స్పష్టం చేస్తాయి, దేశ ఐక్యత కాపాడటానికి చర్యలు తీసుకోవాలి.

## కొత్తూరు మండల కేంద్రంలో ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

**- వాహనచోదకులకు అవగాహన కల్పించిన ఎస్ఐ కె. వెంకటేష్**

శ్రీకాకుళం మార్చి23( వెలుతురు):

కొత్తూరు మండలం : మండల కేంద్రం కొత్తూరులో స్థానిక ఎస్ఐ కె వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక శ్రీకాకుళం రోడ్డులో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించి విజిబుల్ పోలిసింగ్ పై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, బైక్ లు నడిపేవారికి తప్పకుండా హెల్మెట్ ఉండాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలు అక్రమంగా రవాణా చేయటం నేరమని వాహనాలకు సరియైన పత్రాలు లేనివారి దగ్గర, డ్రైవింగ్ లైసెన్స్ లు లేని వారి నుండి అపరాధ రుసుము వసూలు చేశారు. సరైన పత్రాలు లేనివారిపై కేసులు నమోదు చేశారు.అలాగే రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షిత ప్రయాణాలు చేసుకోవాలని ఎస్సై కె.వెంకటేష్ వారికి అవగాహన కల్పించారు.ఈ ముమ్మర తనిఖీల్లో కొత్తూరు ఏఎస్సై గోవిందరావు, హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరావుతో పాటు మిగతా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అసెంబ్లీలో వార్ వన్ సైడ్...

హైదరాబాద్, మార్చి23( వెలుతురు):



తెలంగాణ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం అసెంబ్లీ వేదికగా శరవేగంగా మారుతోంది. గత పదేళ్లుగా సభను శాసించిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రతిపక్ష హోదాలో అధికార పక్షం సంధిస్తున్న విమర్శలకు ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న అగ్రెసివ్ స్ట్రాటజీ, ప్రతిపక్షనేత కేసీఆర్ సభకు గైర్హాజరు కావడం.. ఈ రెండు అంశాలు సభలో చర్చను వార్ వన్ సైడ్ మారుస్తున్నాయిప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుడి పాత్ర అత్యంత కీలకం. కానీ, కీలకమైన బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్ష నేత కేసీఆర్ దూరంగా ఉండటం అటు పార్టీ శ్రేణుల్లో, ఇటు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీస్తోంది. కేటీఆర్, హరీష్ రావు వంటి హేమాహేమీలు ఉన్నప్పటికీ, సభను తన వాక్చాతుర్యంతో, చారిత్రక ఆధారాలతో అదుపులోకి తెచ్చుకునే కేసీఆర్ మార్క్ వ్యూహం ఇక్కడ కొరవడింది. ప్రజలు ఎన్నుకున్నా సభకు రావడం లేదనే అంశాన్ని రేవంత్ రెడ్డి ఒక అస్త్రంగా మార్చుకున్నారు. ప్రజాధనం జీతంగా తీసుకుంటూ సభకు రాకపోవడం బాధ్యతారాహిత్యం అనే విమర్శను కాంగ్రెస్ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పెట్టడంలో సఫలీకృతం అవుతున్నారు. గతంలో బీఆర్ఎస్ నేతలు ఉపయోగించిన సాక్ష్యాధారాల వ్యూహాన్నే ఇప్పుడు రేవంత్ తిరిగి వారిపైనే ప్రయోగిస్తున్నారు. బీఆర్ఎస్ ఏదైనా ప్రజా సమస్యను లేవనెత్తినప్పుడు, రేవంత్ రెడ్డి వెంటనే గత పదేళ్లలో జరిగిన వైఫల్యాలను, శ్వేతపత్రాలను బయటపెడుతున్నారు. దీంతో చర్చ ప్రస్తుత సమస్యల నుంచి మళ్ళీ పాత ప్రభుత్వ తప్పుల వైపు మళ్లుతోంది. కేటీఆర్ వేసే ప్రశ్నలకు రేవంత్ రెడ్డి అంతే దీటుగా, తనదైన శైలిలో తెలంగాణ యాసతో విరుచుకుపడుతున్నారు. ఇది సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఉత్సాహాన్ని నింపుతుండగా, బీఆర్ఎస్ డిఫెన్స్‌లో పడిపోతోంది.సభలో బీఆర్ఎస్ గళాన్ని కేటీఆర్, హరీష్ రావు వినిపిస్తున్నప్పటికీ, వారి మధ్య సమన్వయం కంటే డిఫెన్స్ కే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. ఆరు గ్యారెంటీలపై కేటీఆర్ చేసే కొన్ని సవాళ్లు, ప్రభుత్వం వద్ద ఉన్న పాత ఫైళ్ల వల్ల తిరిగి పార్టీకే ఇబ్బందిగా మారుతున్నాయి. హరీష్ రావు గణాంకాలతో ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నా, మంత్రులందరూ ఏకతాటిపైకి వచ్చి ఆయనను అడ్డుకుంటున్నారు.బీఆర్ఎస్ మళ్ళీ సభలో పట్టు సాధించాలంటే కేసీఆర్ రాక తప్పనిసరి అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అధినేత సభలో ఉంటే ఎమ్మెల్యేల్లో ఉండే ధైర్యం వేరు. ప్రస్తుతం సభలో అజెండాను ప్రభుత్వం సెట్ చేస్తోంది. దాన్ని ప్రతిపక్షం వైపు తిప్పుకోవాలంటే కేసీఆర్ అనుభవం, విషయ పరిజ్ఞానం అత్యవసరం. ప్రస్తుతానికి తెలంగాణ అసెంబ్లీలో రేవంత్ రెడ్డి హవా స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయ యుద్ధంలో గెలవాలంటే సైన్యం మాత్రమే సరిపోదు, సేనాని కూడా రంగంలో ఉండాలి. కేసీఆర్ సభకు వస్తే తప్ప ఈ వన్ సైడ్ వార్ రసవత్తరమైన ద్వైపాక్షిక పోరుగా మారే అవకాశం లేదు.

### రేవంత్ పంచ్ లు

కేసీఆర్ కు అసెంబ్లీకి రాకున్నా ఇస్తున్న జీతం కోటి.. రాక మాత్రం అంటిముట్టనట్టు" అంటూ రేవంత్ రెడ్డి సంధిస్తున్న బాణాలు గులాబీ క్యాడర్‌కు గుచ్చుకుంటున్నాయి. "ప్రజాధనం తీసుకుంటూ.. ప్రజల గొంతుక వినిపించరా?" అంటూ రేవంత్ వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక గులాబీ తమ్ముళ్లు నీళ్లు నములుతున్నారు. కేసీఆర్ ఉండి ఉంటే తనదైన శైలిలో 'ఏం తమ్మి.. ఏం మాట్లాడుతున్నావ్?' అని కౌంటర్ ఇచ్చేవారేమో కానీ, ఇప్పుడు ఆ లోటు స్పష్టంగా కనిపిస్తోంది.కేటీఆర్ అస్త్రంగా ఆరు గ్యారెంటీలు ఏవి? నిరుద్యోగ భృతి ఏమైంది? అంటుంటే.. రేవంత్ మీ హయాంలో జరిగిన పేపర్ లీకేజీలు ఏవి? ఆ ప్రాజెక్టుల అంచనాలు ఏమయ్యాయి? అంటూ నిలదీస్తున్నారు. చర్చ ప్రజా సమస్యల మీద జరగాల్సింది పోయి, "నువ్వు ఎక్కువ తిన్నావా.. నేను ఎక్కువ తిన్నానా?" అన్న చందంగా పాత రికార్డుల దుమ్ము దులిపే కార్యక్రమంగా మారిపోయింది. కేసీఆర్ మార్క్ వ్యూహచతురత లేకపోవడంతో రేవంత్ దూకుడు ముందు కేటీఆర్ వ్యూహాలు "తేలిపోయిన అప్పడాల్లా" మారుతున్నాయని విశ్లేషకులు చెవులు కొరుక్కుంటున్నారు. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ఏకపక్షంగా సాగిస్తున్న ఈ 'వన్ సైడ్ వార్' ఆపాలంటే, గజ్వేల్ సింహం గర్జించాల్సిందే అని పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. "సార్.. మీరు రండి సార్.. లేకపోతే రేవంత్ అన్న మాకు చుక్కలు చూపిస్తున్నాడు" అని లోలోపల మదనపడుతున్నారు.మొత్తానికి కేసీఆర్ రాకపోయేసరికి అసెంబ్లీలో బీఆర్ఎస్ పరిస్థితి "కెప్టెన్ లేని టీమ్ ఇండియా"లా తయారైంది. మరి కేసీఆర్ ఎప్పుడు ఎంట్రీ ఇస్తారు? రేవంత్ స్పీడ్‌కు ఎప్పుడు బ్రేక్ వేస్తారు? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న!

## జీవన్ రెడ్డి పార్టీ మారుడే

కరీంనగర్, మార్చి23( వెలుతురు):



తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి జగిత్యాల పులిగా పేరుగాంచిన సీనియర్ నేత, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిపైనే ఉంది. నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం, కాంగ్రెస్ పార్టీ పట్ల అచంచలమైన విధేయత కలిగిన ఒక ధీశాలి.. ఇప్పుడు అదే పార్టీకి 'గుడ్ బై' చెప్పే దిశగా అడుగులు వేయడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. అయితే జీవన్ రెడ్డిని పార్టీ వీడకుండా చేసేందుకు కాంగ్రెస్ హైకమాండ్ రంగంలోకి దిగింది. మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్.. జీవన్ రెడ్డి ఇంటికెళ్లి బుజ్జగింపులు చేశారు. అయితే అవి ఫలించలేదు.జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత చేజారితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పార్టీకి భారీ నష్టం జరుగుతుందని గ్రహించిన కాంగ్రెస్ హైకమాండ్.. మంత్రులను పంపించింది. జీవన్ రెడ్డి నివాసంలో వీళ్లు గంటల తరబడి చర్చలు జరిపారు. "మీరు పార్టీకి మూలస్తంభం, మీ గౌరవానికి భంగం కలగకుండా చూస్తాం" అని హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే, జీవన్ రెడ్డి మాత్రం మెత్తబడలేదు. తన అనుచరులపై కేసులు పెట్టడం, అభివృద్ధి పనుల్లో తనను పక్కన పెట్టడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ, "ఇక గౌరవం లేని చోట ఉండలేను" అని కుండబద్దలు కొట్టినట్లు తెలుస్తోంది. అంతకుముందు ఆయన బీఆర్ఎస్ నేతలతో కలిసి రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు.పార్టీ వీడేందుకు జీవన్ రెడ్డి సిద్ధమయ్యారన్న సమాచారం వినగానే ప్రత్యర్థి పార్టీలు అలర్ట్ అయ్యాయి. ఆయన్ను తమ పార్టీలోకి లాగేందుకు బీఆర్ఎస్ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. జీవన్ రెడ్డి కూడా బీఆర్ఎస్ లో చేరేందుకు సుముఖంగా ఉన్నట్టు సమాచారం. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లతో ఆయన చర్చలు కూడా జరిపినట్లు తెలుస్తోంది. జీవన్ రెడ్డికి ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో సముచిత స్థానంతో పాటు, పార్టీలో కీలక బాధ్యతలు ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చినట్లు టాక్. 25న ఆయన కాంగ్రెస్ పార్టీకి అధికారికంగా గుడ్ బై చెప్పే అవకాశం కనిపిస్తోంది. ఆ తర్వాత భారీ బహిరంగ సభ ద్వారా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందిమరోవైపు బీజేపీ కూడా జీవన్ రెడ్డి లాంటి క్లీన్ ఇమేజ్ ఉన్న నేత కోసం గట్టి ప్రయత్నాలు చేస్తోంది. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఇప్పటికే రంగంలోకి దిగి జీవన్ రెడ్డిని సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. హిందుత్వ ఓటు బ్యాంక్‌కు జీవన్ రెడ్డి వ్యక్తిగత చరిష్మా తోడైతే, ఉత్తర తెలంగాణలో తిరుగుండదని బీజేపీ వ్యూహం. అయితే బీజేపీలో చేరికపై ఆయన ఆసక్తిగా లేనట్టు తెలుస్తోంది.జీవన్ రెడ్డి గనుక కాంగ్రెస్‌ను వీడితే, అది కేవలం ఒక నియోజకవర్గానికే పరిమితం కాదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో కూడా కాంగ్రెస్‌పై ప్రభావం పడుతుంది. ఆయనతో పాటు వందలాది మంది ముఖ్య అనుచరులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పార్టీ వీడే అవకాశం ఉంది.

### గులాబీ గూటికే

జీవన్ రెడ్డి అసహనానికి ప్రధాన కారణం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడమే. తన రాజకీయ ప్రత్యర్థిని తన అనుమతి లేకుండా, కనీసం సంప్రదించకుండా పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తారని జీవన్ రెడ్డి మొదటి నుంచీ ప్రశ్నిస్తున్నారు. "దశాబ్దాలుగా పార్టీ జెండా మోసిన తనకంటే, నిన్నగాక మొన్న వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తారా?" అని ఆయన పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే నిరసనగా తన నివాసం వద్ద ఉన్న కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించడం, పార్టీ కార్యక్రమాలకు మొహం చాటేయడం వంటి చర్యల ద్వారా తాను 'అసంతృప్తి'తో ఉన్నాననే సంకేతాలను ఇప్పటికే అధిష్టానానికి పంపారు. రంజాన్ వేడుకల్లో భాగంగా జగిత్యాలలో బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కలిసి జీవన్ రెడ్డి ప్రార్థనల్లో పాల్గొనడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ప్రార్థనల అనంతరం బీఆర్ఎస్ అగ్రనేతలతో ఆయన చాలా సేపు ఏకాంతంగా ముచ్చటించడం గమనార్హం. సాధారణంగా బద్ధశత్రువులుగా ఉండే నేతలు ఇంత ఆత్మీయంగా కలవడం వెనుక బలమైన రాజకీయ వ్యూహం దాగి ఉందనే చర్చ ఊపందుకుంది. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నాయకుడు ఇలా బాహాటంగా ప్రత్యర్థి పార్టీ నేతలతో కలవడం అంటే, ఆయన కాంగ్రెస్‌తో బంధాన్ని తెంచుకోవడానికి మానసికంగా సిద్ధమయ్యారని అర్థం. జీవన్ రెడ్డి ఇప్పటికే తన ముఖ్య అనుచరులు, నియోజకవర్గ కేడర్‌తో పలు దఫాలుగా సమావేశమయ్యారు. మెజారిటీ అనుచరులు కూడా ఆయనను గౌరవించని చోట ఉండటం కంటే, సముచిత స్థానం దక్కే బీఆర్ఎస్‌లోకి వెళ్లడమే ఉత్తమమని సూచించినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా జీవన్ రెడ్డి లాంటి మేధావి, సీనియర్ నేత పార్టీలోకి వస్తే ఉత్తర తెలంగాణలో పార్టీకి కొత్త ఊపిరి పోసినట్లవుతుందని భావిస్తున్నారు.ఒకవేళ జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరితే జగిత్యాల రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోతాయి. దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతంలో 'హస్తం' బలహీనపడటం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే సంజయ్ కుమార్ చేరికతో కాంగ్రెస్‌లో రెండు గ్రూపులు ఏర్పడగా, ఇప్పుడు జీవన్ రెడ్డి నిష్క్రమణ పార్టీకి దెబ్బ అవుతుంది.తన భవిష్యత్తు కార్యాచరణపై జీవన్ రెడ్డి ఇప్పటికే స్పందించారు. సముచిత గౌరవం లేని చోట ఉండలేనని, త్వరలోనే నా నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తానని చెప్పారు. తాజా పరిణామాలు ఆయన తదుపరి అడుగు గులాబీ గూటి వైపేనని స్పష్టం చేస్తున్నాయి.

# గచ్చిబౌలి, రాయదుర్గంలలో భారీగా పెరిగిన ఇళ్ల రిజిస్ట్రేషన్లు

హైదరాబాద్, మార్చి23( వెలుతురు):

హైదరాబాద్ నగరంలో ఇళ్లకు మంచి డిమాండ్ ఉంది. గత ఫిబ్రవరి నెలలో ఇళ్ల రిజిస్ట్రేషన్లు 32 శాతం మేర పెరిగాయి. అధిక విలువ కలిగిన ఇళ్లకు అధికంగా డిమాండ్ ఉన్నట్లు నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక తెలిపింది. గౌచ్చిబౌలి, రాయదుర్ఘం, నార్సింగి ప్రాంతాల్లో అధిక విలువ ఇళ్ల రిజిస్ట్రేషన్లు నమోదైనట్లు పేర్కొంది. అత్యధికంగా ఒక్క ఫ్లాట్ రూ.8.90 కోట్లు పలికినట్లు తెలిపింది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం.హైదరాబాద్ మహానగరం వేగంగా విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో సొంతిల్లు కొనుగోలు చేయాలనుకుంటున్న వారి సంఖ్యా పెరుగుతోంది. దీంతో ప్రస్తుతం ఇళ్లకు మంచి డిమాండ్ ఉంది. హైదరాబాద్ ప్రాంతంలో ఇళ్ల రిజిస్ట్రేషన్లు పెరిగాయి. గత ఏడాది ఫిబ్రవరి నెలలో 5988 ట్రాన్సాభన్లు జరిగితే ఈ ఏడాది 2026 6179కి పెరిగాయి. ఇయర్ ఆన్ ఇయర్ ప్రాతిపాదికన చూసుకుంటే రెండు శాతం వృద్ధి నమోదైంది. ఈ ఏడాది 2026, జనవరి నెలలో 4686 యూనిట్లతో పోలిస్తే ఫిబ్రవరి నెల రిజిస్ట్రేషన్లు 32 శాతం పెరిగినట్లు ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా శుక్రవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో ఇళ్ల ట్రాన్సాభన్లు ప్రైమరీ, సెకండరీ మార్కెట్లో జరుగుతుంటాయి. కొత్తగా నిర్మించిన ప్రాజెక్టుల్లో నేరుగా బిల్డర్ నుంచి కొనే మార్కెట్‌ను ప్రైమరీగా పరిగణిస్తారు. ఈ నివాసాలను తిరిగి అమ్మితే ఒక యజమాని నుంచి మరొక వ్యక్తి కొనుగోలు చేస్తారు. దీన్ని సెకండరీ మార్కెట్ గా గుర్తిస్తారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలతో పాటుగా సంగారెడ్డి జిల్లాలోని కొంత భాగం కూడా హైదరాబాద్ రియల్ ఎస్టేటే పరిధిలోకి వస్తుంది. ఫిబ్రవరి నెలలో మొత్తం 28 రోజులో అయినప్పటికీ రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరిగినట్లు నివేదిక పేర్కొంది.రిజిస్ట్రేషన్ ట్రాన్సాక్షన్లలో కోటి రూపాయలు అంత కంటే ఎక్కువ విలువైన ఇళ్ల వాటా 18 శాతంగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే 6 శాతం పెరిగాయి. సగటు చదరపు అడుగు విలువ ఏడాది కాలంలో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో 3 శాతం, రంగారెడ్డి జిల్లాలో 6 శాతం, సంగారెడ్డి జిల్లాలో 7 శాతం మేర ధరలు పెరిగాయి. హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల సగటు చదరపు అడుగు రూ.4457 గా ఉంది. ఫిబ్రవరి నెలలో రూ.4139 కోట్ల విలువైన ట్రాన్సాక్షన్లు జరిగితే వాటిలో కోటి రూపాయలపై విలువ కలిగిన ఇళ్ల విలువే 48 శాతంగా ఉందిఅధిక విలువ ఉన్న నివాస లావాదేవీలు ఐటీ కేంద్రంగానే అధికంగా జరిగాయి. అత్యధికంగా 3 వేల చదరపు అడుగుల కంటే అధిక వైశాల్యం కలిగినవి ఉన్నాయి. విలువ పరంగా మొదటి నాలుగు ట్రాన్సాన్లు గమనిస్తే నార్సింగిలో ఒక్కో ఫ్లాట్ రిజిస్ట్రేషన్ విలువ రూ.8.90 కోట్లు నమోదైంది.

ఆ తర్వాత గచ్చిబౌలిలో రూ.7.93 కోట్లు, రాయదుర్గంలో రూ.6.54 కోట్లు, షేక్ పేట్‌లో రూ.6.34 కోట్లతో ఒక్కో ఫ్లాట్ రిజిస్ట్రేషన్ జరిగింది. నెలల వారీగా చూసుకుంటే హైదరాబాద్ నగరంలో జనవరిలో 2025లో 5464 రిజిస్ట్రేషన్లు జరగగా 2026లో 4686 ఇళ్లు అమ్ముడయ్యాయి. ఇక ఫిబ్రవరి నెలలో 2025లో 5988 యూనిట్లు రిజిస్టర్ కాగా అది ఫిబ్రవరి నెలలో 6179గా నమోదైందివిస్తీర్ణం పరంగా చూసుకుంటే 500 చదరపు అడుగు లోపు ఫ్లాట్లు రిజిస్ట్రేషన్లు 3 శాతం పెరిగాయి, 501-1000 చ.అ.లోపు ఇళ్లు 15 శాతం, 1001-2000లోపు ఇళ్లు 66 శాతం, 2001-3000 చ.అ.లోపు ఇళ్లు 13 శాతం, 3000 పైన ఇళ్లకు 3 శాతం రిజిస్ట్రేషన్లు పెరిగాయి. జిల్లాల వారీగా చూస్తే హైదరాబాద్ నెలలో 14 శాతం, మేడ్చల్-మల్కాజిగిరిలో 45 శాతం, రంగారెడ్డిలో 41 శాతం ఇళ్ల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి.

## సూర్య కిరణాల తేజస్సులో విరాజిల్లిన శ్రీ కోదండరాముడు

తిరుపతి మార్చి23( వెలుతురు):


తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8 గంటలకు స్వామివారు సూర్యప్రభ వాహనంపై దేదీప్యమానంగా ప్రకాశించారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. సూర్యుడు తేజోనిధి. సకలరోగ నివారకుడు. ప్రకృతికి చైతన్యప్రదాత. వర్షాలు, వాటివల్ల పెరిగే సస్యాలు, చంద్రుడు, అతని వల్ల పెరిగే ఔషధాలు మొదలైనవన్నీ సూర్యతేజం వల్లనే వెలుగొందుతున్నాయి.

తరువాత ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిచారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మార్చి 24న రథోత్సవం : శ్రీ కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం వైభవంగా జరుగనుంది. ఉదయం 7.30 గంటలకు స్వామివారు రథారోహణం చేస్తారు. ఉదయం 8.30 గంటలకు రథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

# జనసేనలో అరవ రచ్చ


**కడప, మార్చి23( వెలుతురు):**

జనసేన పార్టీలో అంతర్గత పరిణామాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం జనసేన అధిష్టానానికి, స్థానిక నాయకత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. పరిపాలనలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనదైన ముద్ర వేయాలని చూస్తుంటే, పార్టీలోని అంతర్గత విభేదాలు మాత్రం తీవ్రమవుతున్నాయి. తాజాగా అరవ శ్రీధర్ వ్యవహారం పార్టీలో సెగలు రేపుతోంది పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అధిష్టానం ఆదేశాలు ఇచ్చింది. త్రిసభ్య కమిటీని కూడా వేసి విచారణ జరిపింది. ఈ క్రమంలో ఆయనపై కేసులు కూడా నమోదు అయ్యాయి. ఇక చర్యలు తీసుకున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ, ఆయన మళ్ళీ పార్టీ జెండాతో కార్యక్రమాలు నిర్వహించడం వివాదానికి కేంద్రబిందువైంది. పార్టీ పరంగా ఆయన దూరంగా ఉండాలని అధిష్టానం చెప్పినా, శ్రీధర్ మాత్రం క్షేత్రస్థాయిలో జనసేన జెండాతో పర్యటనలు చేయడం స్థానిక నేతలను అయోమయంలో పడేస్తోంది.అరవ శ్రీధర్ తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకుని కార్యక్రమాలు నిర్వహిస్తుండటం సమాంతర వ్యవస్థగా మారిందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఇది కేడర్ మధ్య చీలికకు దారితీస్తోందని అధిష్టానానికి ఫిర్యాదులు అందుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పార్టీ విధానాలకు విరుద్ధంగా వ్యక్తిగత నిర్ణయాలు తీసుకోవడం, ఇటీవల జరిగిన కొన్ని పార్టీ అంతర్గత సమావేశాల్లో అరవ శ్రీధర్ అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఇప్పటికే కొంతమంది నేతలు ఆయనను హెచ్చరించినట్లు తెలుస్తోంది.పార్టీ నుండి ఎలాంటి పిలుపు లేకపోయినా, కీలక నాయకులు పాల్గొనే సభల్లో, కార్యక్రమాల్లో ఆయన ప్రత్యక్షం కావడం స్థానిక నేతలకు ఇబ్బందిగా మారింది. జనసేనను ఇరుకున పెట్టడానికి వైసిపి వంటి ప్రత్యర్థి పార్టీలకు అరవ శ్రీధర్ వ్యవహారం ఒక ఆయుధంగా మారింది. ఒకవైపు క్లీన్ ఇమేజ్ కోసం ప్రయత్నిస్తున్న జనసేనకు, అరవ శ్రీధర్ లాంటి వ్యక్తుల వల్ల కలిగే డ్యామేజ్ తక్కువేమీ కాదు.

# తిరుమలలో క్రెడిట్ వార్

**తిరుమల, మార్చి23( వెలుతురు):**



తిరుమలలో తాజాగా ప్రారంభమైన 'ఫుడ్ సేఫ్టీ ల్యాబ్' క్రెడిట్ విషయంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఈ ల్యాబ్ ఏర్పాటు తన చొరవతోనే జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. 'క్రెడిట్ చోరీ' చేయడంలో చంద్రబాబు కొత్త రికార్డులు సృష్టిస్తున్నారంటూ ఎద్దేవా చేసింది.జగన్ హయాంలోనే పునాది: గత జగన్ ప్రభుత్వ హయాంలోనే తిరుమల నాణ్యతా ప్రమాణాల కోసం ల్యాబ్ ఏర్పాటు చేయాలని ఈయూంఎకి ప్రతిపాదనలు పంపినట్లు వైఎస్సార్‌సీపీ తెలిపింది.ఆగస్టు 2023లోనే ప్రకటన: దీనికి సంబంధించి ఆగస్టు 2023లో ఈయూంఎ సీఈఓ కమలవర్ధన్ రావు టీటీడీ అధికారులతో సమావేశమయ్యారని, ఆ రోజే ల్యాబ్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని గుర్తు చేస్తూ ఒక వీడియోను విడుదల చేసింది.ట్విట్టర్ వేదికగా విమర్శలు: గత ప్రభుత్వం చేసిన కృషిని ఇప్పుడు తన ఖాతాలో వేసుకోవడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని, ఇది ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని వైసీపీ ట్వీట్ చేసింది.తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భక్తుల నమ్మకాన్ని కాపాడేందుకు సుమారు రూ. 20 కోట్ల వ్యయంతో, అత్యాధునిక పరికరాలతో టీటీడీ ఈ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిని సీఎం చంద్రబాబు ప్రారంభించగా, ఇది తమ హయాంలోనే మంజూరైన ప్రాజెక్టు అని వైసీపీ ఆధారాలతో సహా వాదిస్తోంది.

# ముద్రగడకు నో చెప్పిన జగన్

**కాకినాడ, మార్చి23( వెలుతురు):**



రాజకీయాల్లో ముద్రగడ పద్మనాభానిది ప్రత్యేక స్థానం. 1978లోనే చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి తో పాటు అసెంబ్లీలో అడుగు పెట్టారు. కానీ రాజకీయంగా స్థిరత్వం ఉండదన్న విమర్శ ఆయనపై ఉంది. కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి తెలుగుదేశం పార్టీలో చేరారు. అక్కడ టిడిపి నాయకత్వంతో విభేదించి కాంగ్రెస్ లోకి వచ్చారు. కాంగ్రెస్ నుంచి బిజెపి.. అక్కడి నుంచి వైసీపీలో చేరారు. మొన్నటి ఎన్నికలకు ముందు జనసేనలో చేరాలని భావించారు. వీలుకాకపోయేసరికి వైసీపీలో చేరారు. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ముందు కొత్త డిమాండ్ పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. కానీ జగన్ మాత్రం ఆలోచనలో పడినట్లు సమాచార ముద్రగడ పద్మనాభం తన కుమారుడితో కలిసి ఎన్నికలకు ముందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కోసం గట్టిగానే పనిచేశారు. ఏకంగా పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు. అలా చేయకపోతే తన పేరును పద్మనాభరెడ్డిగా మార్చుకుంటానని సవాల్ చేశారు. కానీ ఫలితం లేకపోయింది. పేరు మార్చుకోవాల్సి వచ్చింది. అయితే ముద్రగడ పద్మనాభం పెద్దరికాన్ని గౌరవించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పబ్లిక్ అడ్వైజరీ కమిటీలో ఆయనకు స్థానం ఇచ్చారు. అయితే ఈ కమిటీ టిడిపి పొలిట్ బ్యూరో మాదిరిగా కాదు. పెద్దగా అధికారాలు కూడా ఉండవు. అందుకే తనకు పార్టీలో పెద్ద పదవి ఇవ్వాలని ముద్రగడ జగన్మోహన్ రెడ్డిని కోరుతున్నట్లు తెలుస్తోంది.ముద్రగడ పద్మనాభం ఉభయ గోదావరి జిల్లాల బాధ్యతలను తనకు ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే ఆయనతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చాలామంది విభేదిస్తున్నట్లు సమాచారం. ఎప్పుడో పాతకాలపు రాజకీయాలు అనుసరిస్తుంటారు ముద్రగడ పద్మనాభం. అందుకే పెద్దగా ఎవరికీ నచ్చరు. ఏ కాపు రిజర్వేషన్ ఉద్యమంతో ముందుకు వెళ్లారు అదే కాపులు ఇప్పుడు ఆయనను నమ్మేస్థితిలో లేరు. మరోవైపు గోదావరి జిల్లాలో జనసేన ప్రభావం అధికంగా ఉంది. ఇటువంటి సమయంలో ముద్రగడ పద్మనాభం కు ఉపయోగ గోదావరి జిల్లాల బాధ్యతలు ఇస్తే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని జగన్మోహన్ రెడ్డికి తెలుసు. అందుకే జగన్ ఆ పదవి ఇచ్చేందుకు అంగీకరించరు. మరోవైపు చూస్తే ముద్రగడ తరచూ అనారోగ్యంతో బాధపడుతున్నారు. వయోభారంతో ఇబ్బందులు ఉన్నాయి. అయితే జగన్ ఇప్పుడు పదవి ఇవ్వకపోతే ముద్రగడ నిర్ణయం ఎలా ఉంటుంది అనేది చూడాలి.

# కన్నబాబుకు వ్యతిరేకంగా కాంట్రాక్టర్లు...

**విజయవాడ, మార్చి23( వెలుతురు):**



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పనులు ఊపందుకున్నాయి. ఈ పనులు ఇదే వేగంతో కొనసాగాలని, 2029 ఎన్నికల నాటికి అమరావతి పూర్తి చేయాలని చాలా మంది కోరుకుంటున్నారు. అయితే ఇలాంటి సమయంలో ఏపీసీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు బదిలీ కావడం రాజకీయ, పరిపాలనా వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. 2025 జనవరిలో బాధ్యతలు చేపట్టిన ఆయన, కేవలం 14 నెలల కాలంలోనే బదిలీ కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అంతకుముందు ఉన్న కాటమనేని భాస్కర్ కూడా కేవలం 7-8 నెలలు మాత్రమే పనిచేశారు. అమరావతి వంటి భారీ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఇలా తరచుగా కమిషనర్లను మార్చడం వల్ల పనుల వేగంపై ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.కన్నబాబు బదిలీ వెనుక అధికారికంగా ఎలాంటి సమాచారమూ లేదు. అయితే ఆయన బదిలీకి అనేక కారణాలున్నాయని అమరావతి వర్గాలు చెప్తున్నాయి. ముఖ్యంగాకన్నబాబు అమరావతి పనులను పర్యవేక్షించడానికి ఒక 'డాష్ బోర్డు'ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఏ కాంట్రాక్టర్ ఎంత శాతం పని పూర్తి చేశారో స్పష్టంగా తెలిసేది. కొంతమంది కాంట్రాక్టర్లు కేవలం 5 నుంచి 20శాతం మాత్రమే పనులు పూర్తి చేసినట్లు ఇందులో తేలింది. ఈ పారదర్శకత వల్ల ఇబ్బంది పడ్డ కొందరు కాంట్రాక్టర్లు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారని సమాచారం.కన్నబాబు ప్రవేశపెట్టిన కొత్త సాఫ్ట్‌వేర్ విధానం వల్ల కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరుగుతోందని, దీనిపై వారు సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. మాజీ సీఎస్ ఒకరు కొందరు ఐఏఎస్ అధికారులతో నిర్వహించిన రహస్య సమావేశానికి కన్నబాబు హాజరయ్యారనే రూమర్ కూడా ఉంది, అయితే ఇందులో ఎంతవరకు నిజం ఉందనేది తెలీదు. ప్రారంభంలో ఆయనపై రైతుల సమస్యల పట్ల అవగాహన లేదనే విమర్శలు వచ్చాయి. అయితే తర్వాత ఆయన చాలా సమస్యలను పరిష్కరించారు. అయినా ఆయన బదిలీ కావడం పలువురిని ఆశ్చర్యపరిచింది.అమరావతి నిర్మాణం అంటే కేవలం రోడ్లు, బిల్డింగ్‌లే కాదు.. ఇందులో భూ సమీకరణ, పర్యావరణ అంశాలు, టెక్నికల్ ఇష్యూస్ వంటి ఎన్నో సంక్లిష్టతలు ఉన్నాయి. కన్నబాబు స్థానంలో విజయరామరాజు నియమితులయ్యారు. ఆయన ఎంత సమర్థుడైనప్పటికీ, ఇంతటి సంక్లిష్టమైన ప్రాజెక్టుపై పూర్తి అవగాహన పెంచుకోవడానికి కనీసం ఏడాది సమయం పట్టవచ్చు. ఇది పనుల పురోగతిని మందగించేలా చేసే అవకాశం ఉంది. ఒక కీలకమైన ప్రాజెక్టు పూర్తి కావాలంటే కనీసం 3-4 ఏళ్ల పాటు ఒకే కమిషనర్‌ను కొనసాగిస్తే బాగుంటుంది. ఇలా తరచూ మార్పులు చేయడం వల్ల ప్రాజెక్టు లక్ష్యాలు దెబ్బతినే ప్రమాదం ఉంది.అయితే కన్నబాబు ఆకస్మిక బదిలీ వెనుక అనేక రకాల ప్రచారాలు ఉన్నాయి. అధికార వర్గాల్లో సైతం విస్మయం వ్యక్తం అవుతోంది. రాజకీయ కారణాలతోనే కన్నబాబు బదిలీ జరిగిందన్నది ప్రధాన అనుమానం. ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో సిఎస్ గా పనిచేసిన వ్యక్తి ఒక ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు అవసరమైన సలహాలు సూచనల కోసమే ఈ సమావేశం పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. ఈ సమావేశానికి కన్నబాబు హాజరయ్యారని ఒక టాక్ అయితే ఉంది. ఇది తెలిసి ప్రభుత్వం వేటు వేసిందని ప్రచారంలో ఉంది. కానీ ఒక ఐఏఎస్ అధికారిగా సిఆర్డిఏ కమిషనర్ లాంటి పెద్ద పోస్టులో ఉండడం గొప్ప విషయం. అంతకంటే ఇంకా ఏం కావాలని ఆయన జగన్మోహన్ రెడ్డి ప్రాపకం కోసం ప్రయత్నిస్తారు అనేది ఒక అనుమానమే. అది అంత మాత్రం వాస్తవం కాదన్న వారు ఎక్కువ మంది ఉన్నారుమరోవైపు అమరావతి రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతోనే కన్నబాబును మార్చారన్న ప్రచారం ఉంది. అయితే ఈ విషయంలో మాత్రం వాస్తవం ఉంది. కన్నబాబు ప్రారంభంలో బాధ్యతలు తీసుకున్న సమయంలో ఇటువంటి ఫిర్యాదులు వచ్చాయి. కానీ వాటన్నింటినీ అధిగమించి కన్నబాబు బాగానే సెట్ అయ్యారు సి ఆర్ డి ఏ కమిషనర్ గా. మరోవైపు కాంట్రాక్టర్ల ఫిర్యాదు నేపథ్యంలోనే బదిలీ చేశారన్న వాదన ఉంది. ఇటీవల కన్నబాబు ఒక సాఫ్ట్వేర్ తయారు చేశారు. అమరావతి పనులకు సంబంధించిన ప్రగతి ఎప్పటికప్పుడు గుర్తించే సాఫ్ట్వేర్ అన్నమాట. ఒక డాష్ బోర్డు మాదిరిగా ఆ సాఫ్ట్వేర్ తయారు చేశారు. అయితే దీనిపై కాంట్రాక్టర్లు ఆవేదనతో ఉన్నారు. ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతోనే కన్నబాబును తొలగించారు అన్నది ఒక వాదన.అమరావతి రాజధాని అనేది ఒక వ్రతంలా చేయాలి. ఒక ఉద్యమంలా నిర్మాణం చేపట్టాలి. దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టు అది. అటువంటి ప్రాజెక్టుకు సిఆర్డిఏ కమిషనర్ కీలకం. కానీ ఇలా ఎప్పటికప్పుడు కమిషనర్లు మార్చడం ద్వారా ఆ ప్రభావం పనులపై పడుతుంది. ప్రభుత్వం ఈ విషయంలో మాత్రం సరైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికీ అమరావతి రాజధాని పనుల్లో జాప్యం జరుగుతోందన్న విమర్శలు వస్తున్నాయి. ఇటువంటి సమయంలో రకరకాల కారణాలు చెప్పి కమిషనర్లను మార్చడం మాత్రం సహేతుకం కాదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అయితే ఇప్పుడు వస్తున్న కమిషనర్ విజయరామరాజు శాశ్వతమా? తాత్కాలికమా? అన్నది తెలియాల్సి ఉంది.

# మంత్రి పదవి కోసం స్పీడ్ తగ్గించారా

**నెల్లూరు, మార్చి23( వెలుతురు):**



కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ఏపీ పాలిటిక్స్‌లో పరిచయం అక్కరలేని పేరు. 2014, 2019లో రెండుసార్లు వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి..గత ఎన్నికలకు ముందు ఫ్యాన్ స్విచ్చాఫ్ చేసి సైకిల్ ఎక్కారు. నెల్లూరు రూరల్‌లో మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. అలాంటి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఫైర్ బ్రాండ్ లీడర్‌గా..ఓవైపు వైసీపీని టార్గెట్ చేస్తూనే..మరోవైపు నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెడుతూ వచ్చారు. వందల కోట్ల నిధులతో నెల్లూరు రూరల్‌లో ఓ రేంజ్‌లో డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టి సీఎం చంద్రబాబుతో ప్రశంసలు పొందారు. పనితీరులో రాష్ట్రవ్యాప్తంగా 32వ స్థానం, నెల్లూరులో ఫస్ట్ ప్లేస్ సొంతం చేసుకున్న ఎమ్మెల్యే కోటంరెడ్డికి..విస్తరణలో మంత్రి పదవి పక్కా అంటూ ప్రచారం జరుగుతోంది. అందుకు తగ్గట్లే ఆయన కూడా దూకుడు పెంచుతూ వచ్చారు. కానీ కొన్ని రోజులుగా ఆయన తన రూట్‌ను మార్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.అయితే ఎమ్మెల్యే కోటంరెడ్డికి నెంబర్ వన్ ప్లేస్ దక్కడం..సీఎం చంద్రబాబు దగ్గర ప్రశంసలు పొందడం వెనుక ఎమ్మెల్యే కోటంరెడ్డి సోదరుడు గిరిధర్ రెడ్డి కృషి ఎంతో ఉందన్నది పబ్లిక్ టాక్. ఎమ్మెల్యే కోటంరెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేనప్పుడు ఆ లోటు కనిపించకుండా గిరిధర్ రెడ్డి ప్రజల్లో తిరుగుతూ అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారట. ఒక్క మాటలో చెప్పాలంటే కోటంరెడ్డి గిరిధర్ రెడ్డే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అని ప్రజలు చెప్పుకునేలా వందల కోట్లతో అభివృద్ధి పనులను దగ్గరుండి జరిపిస్తున్నారట. ఇలా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పరుగులు పెట్టించడం వల్లే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి మంచి పేరు, ప్రశంసలు దక్కుతున్నాయని తెలుగు తమ్ముళ్లే చర్చించుకుంటున్నారట.అయితే ఒక పక్క మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నప్పటికీ ఎమ్మెల్యే కోటంరెడ్డి నెక్ట్స్ టార్గెట్ తన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిని ఎమ్మెల్యేను చేసుకోవడమేనట. ఇప్పటికే వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుంచి తాను పోటీ చేయనని తన తమ్ముడే ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని పలు సందర్భాల్లో చెప్పారు కోటంరెడ్డి. సోదరుడిని ఎమ్మెల్యే చేసేందుకు అమాత్య ఆశలను కూడా అలా పక్కన పెట్టి..నియోజకవర్గంపైనే ఫుల్ ఫోకస్ పెట్టారట కోటంరెడ్డి.రెండేళ్లు పూర్తికాక ముందే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రూ.613 కోట్లతో చంద్రన్న రహదారులు, చంద్రన్న పార్కులు, చంద్రన్న వెలుగులు, బ్రిడ్జిల అభివృద్ధి పనుల జాతర చేపట్టారు ఎమ్మెల్యే కోటంరెడ్డి. ఎక్కడా అవినీతికి తావు లేకుండా..ప్రతి పైసా ఖర్చు వివరాలను ప్రజలకు తెలిపేలా ఒక బుక్ లెట్ తయారు చేసి పబ్లిక్ డొమెయిన్‌లో ఉంచారట. అభివృద్ధి పనులకు సంబంధించిన బుక్లెట్‌ను సీఎం చంద్రబాబుకు కూడా చూపించారట ఎమ్మెల్యే కోటంరెడ్డి. వీటిలో కొన్ని పూర్తి కాగా..ఇంకొన్ని చివరి దశలో..మరి కొన్ని టెండర్ల దశలో ఉన్నాయని అంటున్నారు. ఇటీవల 339 పనులను ఒకేసారి స్థానిక ప్రజలతో శంకుస్థాపన చేసి 60 రోజుల్లోనే పూర్తి చేసి రికార్డు సృష్టించారు కోటంరెడ్డి. మరోసారి రూ.27 కోట్లతో ఈ నెల 22న స్థానిక ప్రజల చేత 240 చోట్ల ఒకేసారి ప్రారంభోత్సవాలు చేసేందుకు సిద్ధమవుతున్నారట.పక్కా వ్యూహం ప్రకారమే నియోజకవర్గ డెవలప్‌మెంట్‌కు టాప్ ప్రయారిటీ ఇస్తున్నారట కోటంరెడ్డి. తనకు మంత్రి పదవి వస్తే సంతోషం. కానీ వచ్చే ఎన్నికల్లో తమ్ముడిని ఎమ్మెల్యే చేసి తీరాలని పట్టుదలతో ఉన్నారట. కోటంరెడ్డికి అమాత్య యోగం ఎప్పుడు దక్కుతుందో? సోదరుడిని ఎమ్మెల్యే చేసేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఎంతవరకు సక్సెస్ అవుతాయో చూడాలి.

# భారం... భారం...

**న్యూఢిల్లీ, మార్చి23( వెలుతురు):**



ఇరాన్ అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేస్తోంది. హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడం, గల్ఫ్ దేశాల్లోయిని ఆయిల్ రిఫైనరీలు, ఎల్‌పీజీ కంపెనీలపై ఇరాన్ చేస్తున్న దాడులతో క్రూడ్ ఆయిల్ సరఫరా, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 105 డాలర్లకు చేరింది. దీంతో ప్రపంచంలో అన్ని దేశాలు ఆయిల్ ధరలు పెంచుతున్నాయి. మన దేశంలో గ్యాస్ ధర పెరిగింది. మరోవైపు వంటనూనెతోపాటు చాలా రకాల వస్తువులపై యుద్ధం ప్రభావం పడింది. దేశవ్యాప్తంగా అన్ని రంగాల్లో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, ఇది ప్రజల జీవన ఖర్చులను మరింత భారపడేస్తోందని కాంగ్రెస్ విమర్శించింది.రెండు వారాల్లోనే అనేక కీలక ఉత్పత్తులు, సేవల ధరలు గణనీయంగా పెరిగాయి. ఇది ఆర్థిక విధానాలు, అంతర్జాతీయ మార్కెట్ ప్రభావాల వల్లేనా, లేక ఇతర కారణాలా అనే చర్చకు దారితీసింది.కాంగ్రెస్ పార్టీ తెలిపిన వివరాల ప్రకారం వాణిజ్య సిలిండర్ ధర రూ.100కుపైగా పెరిగింది. గృహ సిలిండర్ ధర రూ.60 పెరిగింది. వంట నూనెల ధర రూ.10 నుంచి రూ.30 వరకు పెరిగింది. పారిశ్రామిక డీజిల్ లీటర్‌కు రూ.20కిపైగా పెరిగింది. అధిక గ్రేడ్ పెట్రోల్ లీటర్‌కు రూ.2కుపైగా పెరిగింది. ఫుడ్ డెలివరీ సర్వీస్‌లు ఆర్డర్‌కు రూ.2 పెంచాయి. విమాన చార్జీలు రూ.400 నుంచి రూ.2,000 వరకు పెరిగాయి. ప్లాస్టిక్ ప్యాకేజింగ్ సెట్‌కు రూ.30 – 50 వరకు పెరిగింది. కుకింగ్ అప్లయన్స్‌లు (ఇండక్షన్) ధరలు 35?45% పెరిగాయి. ఇవి రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి,

### ఎందుకు పెరిగాయంటే..

అంతర్జాతీయ ఆయిల్ ధరలు, డాలర్ విలువ పెరగడం, రూపాయి విలువ పతనం. ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు. ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీలు, సబ్సిడీలు తగ్గించడం వల్ల కూడా ప్రజలపై భారం పడుతోందని కాంగ్రెస్ ఆరోపణ. మరోవైపు, గ్లోబల్ సప్లై చైన్ సమస్యలు, ఇన్‌ఫ్లేషన్ ఒత్తిడి కూడా పాత్ర వహిస్తున్నాయి. రెండేళ్లలో ఇలాంటి ట్రెండ్ కొనసాగుతోంది.ధరల పెరుగుదలపై ప్రభుత్వం ఇంకా అధికారికంగా స్పందించలేదు, కానీ మునుపటి సందర్భాల్లో ట్యాక్స్ కట్స్, సబ్సిడీలు ప్రకటించింది. అయితే, ఇది తాత్కాలిక పరిష్కారాలేనని విమర్శకులు అంటున్నారు. ప్రజలు ఇప్పటికే కిచెన్ బడ్జెట్‌లు దెబ్బతింటున్నాయి. ధరలు నియంత్రించడానికి ప్రభుత్వం లాంగ్?టర్మ్ విధానాలు అవసరం. లేదంటే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై దీని ప్రభావం పడే అవకావం ఉంటుంది.

# సమ్మర్ మూవీస్ పై ఆశలు

**హైదరాబాద్, మార్చి 23, ( వెలుతురు)**

సంవత్సరం తెలుగు సినిమా ఇండస్ట్రీల హవా కొనసాగుతుందనే చెప్పాలి. సంక్రాంతికి 'మన శంకర్ వరప్రసాద్' సినిమాతో చిరంజీవి భారీ సక్సెస్ ని సాధించాడు. 400 కోట్ల వరకు కలెక్షన్స్ ని కొల్లగొట్టాడు. సంక్రాంతి సీజన్ బాగా కలిసి రావడంతో ఆ తర్వాత కూడా సినిమా ఇండస్ట్రీకి భారీ లాభాలు వస్తాయని అంచనాలో సినిమా మేధావులైతే ఉన్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే రీసెంట్ గా రిలీజ్ అయిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా సైతం పాజిటివ్ టాక్ ను సంపాదించుకొని ముందుకు సాగుతుంది. ఇక అడివి శేష హీరోగా చేస్తున్న 'డకాయిట్' సినిమా సైతం ఏప్రిల్ నెలలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అలాగే శర్వానంద్ బైకర్ సినిమా వస్తుంది. నిఖిల్ హీరోగా చేస్తున్న స్వయంభూ సినిమా కూడా ఈ సమ్మర్ లోనే వస్తుంది?ఇక ఈ సినిమాలతో పాటు గా ఏప్రిల్ 30 వ తేదీన రామ్ చరణ్ హీరోగా చేస్తున్న 'పెద్ది' సినిమా సైతం భారీ అంచనాలతో బరిలోకి దిగబోతుంది.ఇక మే నెలలో ఏ సినిమాలు రాబోతున్నాయి అనే విషయం మీద ఇంకా సరైన క్లారిటీ రానప్పటికి మొత్తానికైతే ఈ సినిమాలన్ని భారీ విజయాలను సాధిస్తాయనే కాన్ఫిడెన్స్ ను వ్యక్తం చేస్తున్నారు. పెద్ది సినిమా ఈ సమ్మర్ లో బిగ్గెస్ట్ బ్లాక్ బాస్టర్ హిట్ గా నిలువబోతుందనే వార్తలు కూడా వస్తున్నాయి.ఈ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది అంటూ మేకర్స్ చెబుతున్నారు. దానికి తగ్గట్టుగానే




ఈ సినిమా మీద ప్రేక్షకుల్లో విశేషమైన హైప్ కూడా ఉంది. ఇక ఇలాంటి క్రమంలోనే ఇండియన్ సినిమా ఇండస్ట్రీని షేక్ చేసేలా రామ్ చరణ్ పెద్ది సినిమాతో భారీ రికార్డులను కొల్లగొడతాడా? లేదా అనేది కూడా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం తెలుగు సినిమా ఇండస్ట్రీ కొంతవరకు డౌన్ లో ఉంది.దీనిని టాప్ లెవెల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత రామ్ చరణ్ మీదే ఉంది అంటూ పలువురు సినిమా మేధావులు సైతం వాళ్ళ అభిప్రాయాల్ని తెలియజేస్తుండటం విశేషం?చూడాలి మరి ఈ సినిమా ఎలాంటి సక్సెస్ ను సాధిస్తుంది. తద్వారా మరోసారి తెలుగు సినిమా స్థాయి పెరుగుతుందా లేదా అనేది?

# దురంధర్2 కలెక్షన్ల దూకుడు

## ప్రపంచవ్యాప్తంగా రూ.750 కోట్ల కలెక్షన్లు

## తన నటజీవితాన్ని గుర్తు చేసుకున్న గౌరవ

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ఈ చిత్రం చారిత్రక వసూళ్లను సాధించి, హిందీ సినీ చరిత్రలో సరికొత్త మైలురాళ్లను నెలకొల్పింది.నాలుగు రోజుల్లోనే 'ధురంధర్ 2' ప్రపంచవ్యాప్తంగా రూ.750 కోట్ల కలెక్షన్లతో దూసుకుపోతోంది. బుధవారం జరిగిన పెయిడ్ ప్రివ్యూల ద్వారానే రూ.43 కోట్లు సాధించిన ఈ సినిమా, ఆదివారం ఒక్కరోజే దేశీయంగా అత్యధికంగా రూ.115 కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టించింది. హిందీ చిత్రసీమలో షారుఖ్ ఖాన్ 'పఠాన్' నెలకొల్పిన రూ. 287 కోట్ల ఓపెనింగ్ వీకెండ్ రికార్డును 'ధురంధర్ 2' సునాయాసంగా అధిగమించింది. ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా రూ.180 కోట్లు వసూళ్లతో ఈ చిత్రం ప్రభంజనం సృష్టిస్తోంది. ఇకపోతే 'ధురంధర్ 2' సంచలనం సృష్టిస్తోన్న వేళ.. ఇందులో కీలకపాత్రలో నటించిన సీనియర్ నటుడు గౌరవ్ తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ చిత్రంలో మహమ్మద్ ఆలం పాత్రతో మెప్పించిన ఆయన తాజాగా ఓ లేఖను పంచుకున్నారు. 1998లో తాను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో తన తల్లిదండ్రులకు రాసిన లేఖను షేర్ చేశారు. ఢిల్లీ నుంచి ముంబయి వచ్చిన రోజుల్లో తన ఆర్థిక ఇబ్బందులను అందులో ప్రస్తావించారు. 'ఇది 1998లో మా అమ్మానాన్నలకు రాసిన లేఖ. నేను ముంబయికి వచ్చి అప్పటికి నెల రోజులు కూడా కాలేదు. అప్పట్లో ఈమెయిల్‌లు లేవు, కేవలం ఉత్తరాలే. ఆ తర్వాత టీవీ, సినిమాలు, యాడ్స్, రేడియో, రీల్స్.. ఇలా ఎన్నో ఒడుదొడుకులతో నా ప్రయాణం సాగింది. అప్పట్లో నా భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియదు కానీ, నేనెప్పుడూ ఆశను కోల్పోలేదు. నాకు అండగా నిలిచిన మా అమ్మానాన్నలకు ధన్యవాదాలు' అంటూ లేఖను పంచుకున్నారు. అందులో తన తల్లిదండ్రులకు అప్పటి పరిస్థితిని వివరించారు గౌరవ్. 'ప్రస్తుతానికి డబ్బు పరంగా ఏమీ కలిసిరావడం లేదు. కానీ, త్వరలోనే మంచి జరుగుతుందని ఆశిస్తున్నాను. ఢిల్లీతో పోలిస్తే ఇక్కడ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఖర్చు తగ్గించుకోవడానికి నేను స్నేహితుడితో కలిసి ఓ చిన్న గదిలో ఉంటున్నాను. టెలిఫోన్, విద్యుత్, గ్యాస్, నీటి బిల్లులతో పాటు భోజనం ఖర్చులు కూడా ఇద్దరం కలిసే పంచుకుంటున్నాం. భవిష్యత్తుపై ఆశతో జీవిస్తున్నాను. కానీ నేను నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉంది' అని రాసి ఉన్న లేఖ ప్రస్తుతం వైరల్ అవుతోంది. దీనిపై బాలీవుడ్ ప్రముఖులు స్పందిస్తున్నారు. పట్టుదలతో శ్రమిస్తే ఏదో ఒకరోజు గుర్తింపు లభిస్తుందంటూ ప్రశంసిస్తున్నారు.




# రౌడీ జనార్ధన్ మూవీ కోసం విజయ్ కసరత్తు

టాలీవుడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడు. వీటిలో ఒకటి రాహుల్ సంకీర్త్యన్‌తో చేస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా. విజయ్ మరోవైపు దిల్ రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ రూరల్ మాస్ డ్రామాకు కమిటవగా.. ఈ చిత్రానికి రౌడీ జనార్ధన అనే టైటిల్ కూడా ఖరారు చేశారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో గ్రాండ్ స్కేల్‌లో ఉండబోయే యాక్షన్ సీక్వెన్స్‌ను విజయ్ టీం డిజైన్ చేస్తుందట. ముంబై స్లమ్స్ ఏరియాలో రాబోయే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్ సినిమాకే హైలెట్‌గా నిలువబోతుందట. ఇంటెన్స్, రియలిస్టిక్ యాక్షన్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఈ ఎపిసోడ్ ఉండనుందిని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విజయ్ దేవరకొండ ట్రాన్స్‌ఫార్మేషన్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తుంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో విజయ్ పాత్ర పేరు జనార్ధన్ కాగా, ఆయన నాన్న పేరు కూడా జనార్ధనేనని ఇన్‌సైడ్ టాక్. విజయ్ దేవరకొండకు 'రౌడీ' అనే ట్యాగ్ ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు రౌడీ టైటిల్‌తో సినిమా వస్తుండడంతో ఫ్యాన్స్ అంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ సినిమాతో విజయ్ తన విశ్వరూపం చూపించనున్నాడని కామెంట్ చేస్తున్నారు.




# బైకర్ ట్రైలర్‌కు ప్రభాస్ ప్రంశసలు


టాలీవుడ్ ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం బైకర్ ఇప్పటికే సినీ వర్గాల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. ఇండియాలోనే తొలి మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా తన కాన్సెప్ట్‌తో ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. తాజాగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తోంది.ఈ ట్రైలర్‌పై పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్పందించడం మరింత ఆసక్తిని రేకెత్తించింది. తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రభాస్ 'బైకర్ ట్రైలర్ వైబ్ అదిరిపోయింది' అంటూ ప్రశంసలు కురిపించాడు. ట్రైలర్ చాలా ఎంగేజింగ్‌గా ఉందని, సినిమా టీమ్‌కు తన శుభాకాంక్షలు తెలియజేశాడు. ముఖ్యంగా శర్వానంద్‌తో పాటు నిర్మాణ సంస్థకు కూడా విజయాన్ని కోరుకున్నాడు. ఈ ట్రైలర్‌లో హై-ఆక్టేన్ రేసింగ్ సీన్స్, ఎమోషనల్ ఎలిమెంట్స్, ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్ అన్నీ బ్యాలెన్స్‌డ్ చూపించడం విశేషం. శర్వానంద్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిస్తూ, రేసర్ పాత్రలో తన ట్రాన్స్‌ఫర్మేషన్‌తో ఆకట్టుకుంటున్నాడు. మరోవైపు సీనియర్ నటుడు రాజశేఖర్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండటం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తుండగా, భారీ తారాగణం ఈ ప్రాజెక్ట్‌లో భాగమైంది. దర్శకుడు అభిలాష్ రెడ్డి ఈ చిత్రాన్ని స్టైలిష్ రేసింగ్ డ్రామాగా రూపొందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ మూవీ టెక్నికల్‌గా కూడా హై స్టాండర్డ్స్‌తో తెరకెక్కుతున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. మోటోక్రాస్ రేసింగ్ వంటి కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వనుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే ట్రైలర్‌కు వస్తున్న స్పందనను బట్టి, ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 3న గ్రాండ్‌గా విడుదల కానున్న 'బైకర్' మూవీ, శర్వానంద్ కెరీర్‌లో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.




# నాపేరుతో ఎలాంటి వ్యాపారాలు లేవు

## ఎవరైనా మోసం చేయాలని చూసే ఫిర్యాదు చేయండి

## గాయని మంగ్లీ ప్రకటన విడుదల



ప్రఖ్యాత ఫోక్ సింగర్ మంగ్లీ పేరుతో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం జరుగుతోందని వస్తున్న వార్తలపై ఆమె ఘాటుగా స్పందించారు. తనకు అలాంటి వ్యాపారాలతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు మంగ్లీ పేరును ఉపయోగిస్తూ మైక్రో ఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, 'నా పేరుతో డబ్బులు సేకరిస్తున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యం. నాకు ఆ వ్యక్తులతో గానీ, వారి ్ర÷నాన్స్ వ్యాపారాలతో గానీ ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. మంగ్లీ తన ప్రకటనలో , తనను మరియు తన కుటుంబ సభ్యులను చాలా మంది ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం సంప్రదిస్తుంటారని చెప్పారు. అయితే, ఆ ఈవెంట్స్‌కు సంబంధించిన ఆహ్వానాల వరకే తమకి పరిచయం ఉంటుందని, వారి వ్యక్తిగత వ్యాపారాల గురించి తాము ఎలాంటి బాధ్యత వహించబోమని స్పష్టం చేశారు. అలాగే, తన పేరును ఉపయోగించి మోసాలకు పాల్పడటం అన్యాయమని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కరెన్సీ వీడియోలు, ్ర÷నాన్స్ వ్యవహారాలకు తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఆమె మరోసారి క్లియర్ చేశారు.ఎవ్వరైనా నా పేరు చెప్పి డబ్బులు అడిగితే దయచేసి నమ్మకండి. అలాంటి మోసాలకు గురైన వారికి న్యాయం చేయాలని పోలీస్ శాఖను కోరుతున్నాను అని మంగ్లీ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రకటనతో, మంగ్లీ పేరును వాడుకొని జరుగుతున్న మోసాలపై ప్రజల్లో అవగాహన పెరిగే అవకాశం ఉంది.ఇదిలా ఉంటే ఇటీవల మంగ్లీ పాన్-ఇండియా చిత్రం ఐఆ: ది డెవిల్ సినిమా కోసం ఒక పాట పాడింది. 'సర్కే చునర్ తేరి సర్కే' పాటలో డబుల్ మీనింగ్ లిరిక్స్ ఉన్నాయనే ఆరోపణలతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.ఈ క్రమంలో మంగ్లీ సోషల్ మీడియాలో స్పందిస్తూ? 'ప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ఈ పాటను తొలగించాం. అనుకోకుండా జరిగిన పొరపాటుకు హృదయపూర్వక క్షమాపణలు' అని తెలిపారు.

# రీ ఎంట్రీ ఇస్తున్న నటి రోజా

## 12 ఏళ్ల తరవాత తమిళ మూవీతో స్టార్ట్

తమిళ సినీ పరిశ్రమలో సీనియర్ నటీమణుల రీఎంట్రీ ట్రెండ్ కొనసాగుతోంది. ఇటీవల శోభన తిరిగి కోలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఇప్పుడు మరో ఫైర్‌బ్రాండ్ నటి, రాజకీయ నాయకురాలు ఆర్కే రోజా కూడా మళ్లీ తమిళ సినిమాల్లో బిజీ అవుతున్నారు. గత కొంతకాలంగా రాజకీయాల్లో చురుకుగా ఉన్న రోజా, ప్రస్తుతం సినిమాలపై మళ్లీ ఫోకస్ పెట్టారు. 12 ఏళ్ల విరామం తర్వాత ఆమె తమిళ ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఇప్పటికే ఆమె నటించిన లెనిన్ పాండ్యన్ షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది.ఇదే సమయంలో రోజా నటిస్తున్న మరో చిత్రం అన్బే డయానా కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. పారి ఎలవళగన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రమ్య రంగనాథన్ హీరోయిన్‌గా కనిపించనున్నారు. చెన్నైలోని పెరంబూర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ రొమాంటిక్ లవ్ స్టోరీలో రోజా కీలక పాత్రలో, ముఖ్యంగా హీరో తల్లి పాత్రలో కనిపించబోతున్నారు. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన 'పెరంబూర్ గానా' సాంగ్ మంచి స్పందన అందుకుంటోంది. ముఖ్యంగా ఈ పాటలో రోజా చేసిన మాస్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా గ్యాప్ తర్వాత కూడా తన ఎనర్జీ తగ్గలేదని మరోసారి నిరూపించారు. ఈ పాట వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.మిలియన్ డాలర్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా లిరికల్ వీడియోలు విడుదల చేస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. ఇటీవల సీనియర్ నటి రాధిక నటించిన 'తాయి కిళవి' భారీ విజయాన్ని సాధించడంతో, ఇప్పుడు రోజా రీఎంట్రీ మూవీపై కూడా కోలీవుడ్‌లో మంచి బజ్ నెలకొంది. సుదీర్ఘ విరామం తర్వాత రోజా మళ్లీ తెరపై కనిపించబోతుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రీఎంట్రీతో కోలీవుడ్‌లో రోజా మరోసారి తన సత్తా చాటుతారా అన్నది చూడాలి.




# మే 1న రిలీజ్ కానున్న గాయపడ్డ సింహం

టాలీవుడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'గాయపడ్డ సింహం మూవీ కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డైరెక్టర్ పవన్ సాధినేని సమర్పకుడిగా వ్యవహరిస్తున్నాడు. రీసెంట్‌గా ఈ సినిమాకు సంబంధించి టీజర్, ట్రైలర్ కలయికతో 'ట్రైజర్'ను తాజాగా విడుదల చేయగా.. మంచి స్పందన వస్తోంది. ట్రైజర్ సైటైరికల్ కామెడీ బ్యాక్ డ్రాప్‌లో యాక్షన్ ఎలిమెంట్స్ తో కలయికతో ఫన్‌గా సాగుతూ మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. అమెరికా వెళ్లాలని కలలు కనే ఓ యువకుడి జీవితంలో చోటుచేసుకునే సంఘటనల చుట్టూ సినిమా తిరుగుతుందని ట్రైజర్‌తో హింట్ ఇచ్చాడు. ఆ యువకుడు వీసా రిజెక్ట్ కావడంతో అతడు ఎదుర్కొనే నిరాశ, ఫ్రస్ట్రేషన్, ఆ తర్వాత తీసుకునే నిర్ణయాలు కథకు ప్రధానాంశాలుగా ఉంటాయని ట్రైజర్ హింట్ ఇచ్చేస్తుంది. మధ్య మధ్యలో వచ్చే యాక్షన్ ఎపిసోడ్‌లు, కేజీఎఫ్ స్పూఫ్ సన్నివేశాలు, అమెరికా వెళ్లకపోయినా హీరో ఇచ్చే బిల్డప్ డైలాగులు వినోదాన్ని పంచుతున్నాయి. ప్రత్యేకంగా ట్రైజర్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సూచించే విధంగా చూపించిన సన్నివేశాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అమెరికా వీసా నిబంధనల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువత ఆవేదనను ప్రతిబింబించే ప్రయత్నం చేసినట్లు అనిపిస్తోంది. మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విడుద తేదీపై మేకర్స్ క్లారిటీ ఇచ్చేశారు. ఈ మూవీ మే 1న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. రాంచరణ్ నటిస్తోన్న పెద్ది రిలీజైన మరుసటి రోజే అన్నమాట. దిల్ రాజు ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో పంపిణీ చేస్తున్నారు. ఈ మూవీలో విష్ణు ఓయ్, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్ ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సప్తస్వ మీడియా వర్క్స్, ఖక్షు స్టోరీస్, జీస్టూడియోస్ బ్యానర్లపై కళ్యాణ్ చక్రవర్తి మంథిన, భాను కిరణ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేశ్ బన్సాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



# ఆరు గ్యారెటీలకు చట్టబద్ధత

**- అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లుకు బిఆర్ఎస్ నోటీసు**



**హైదరాబాద్, మార్చి23( వెలుతురు):**
ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రైవేటు బిల్లు ప్రతిపాదించింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శికి నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా బిల్లు ప్రతిని సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అందజేశారు. బిల్లును ఈ సమావేశాల్లోనే అనుమతించాలని కోరారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లుకు సంబంధించిన నోటీసును స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలు అందజేశారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుతో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు. అత్యంత కీలకమైన ఈ బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి అనుమతించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌తో పాటు అసెంబ్లీ సెక్రటరీకి కూడా బిల్లుకు సంబంధించిన నోటీసులు అందజేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, మల్లారెడ్డి, కేపీ వివేకానందా, సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, చింతా ప్రభాకర్, అనిల్ జాదవ్, మానిక్‌రావు, దాసోజ్ శ్రవణ్‌కుమార్ , శంభీపూర్ రాజు, మాదవరం కృష్ణారావు, కల్వకుంట్ల సంజయ్, కౌశిక్ రెడ్డి తదితరులున్నారు.

# పారిశ్రామికాభివృద్ధిలో మరో ముందడుగు

**- మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు చంద్రబాబు శంకుస్థాపన**

**- హాజరైన కేంద్రమంత్రులు కుమారస్వామి**

**- ఏటా 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యం**

**అనకాపల్లి, మార్చి23( వెలుతురు):**
ఏపీ పారిశ్రామికాభివృద్ధిలో మరో ముందడుగు పడింది. ప్రపంచంలోనే అగ్రగామి



స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిత్తల్, నిప్పాన్ స్టీల్ ఇండియా ఉక్కు కర్మాగారానికి కేంద్ర మంత్రులతో కలిసి, ముఖ్యమంత్రి చంద్రబాబు భూమి పూజ చేశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట లో ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో 5,465 ఎకరాల్లో 2 దశల్లో దీనిని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు సంస్థ ప్రతినిధులతో పాటు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక నేతలు హాజరయ్యారు. ఈ స్టీల్‌ప్లాంట్ మొత్తం పెట్టుబడి రూ.1,35,964 కోట్లు కాగా.. మొదటి దశలో 2,600 ఎకరాల్లో రూ.80 వేల కోట్లతో నిర్మాణం చేపట్టనున్నారు. 2029 నాటికి ఉత్పత్తి ప్రారంభించేలా ప్రణాళికలు వేశారు. ఈ కర్మాగారంతో లక్ష మందికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఆర్సెలార్ మిత్తల్ గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ఎ÷-లాంట్ రెండు దశల్లో సాకారం కానుంది. ఈ ఫ్యాక్టరీకి అనుబంధంగా రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్టు నిర్మించనున్నారు. క్యాప్టివ్ పోర్టు ద్వారా మరో 6 వేల ఉద్యోగాలు లభిస్తాయి. ఏఎంఎన్ఎస్ ఇండియా రాకతో విశాఖ రీజియన్ పరిశ్రమల హబ్‌గా మారనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోంది. స్టీల్‌ప్లాంట్‌ను ఎన్‌హెచ్-16తో కలిపేలా 4 లేన్ల విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

# డ్రగ్స్ కేసులో 'నా కుమారుడు నిరపరాధి'


**- మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్**



**కడప, మార్చి23( వెలుతురు):**
డ్రగ్స్ కేసులో 'నా కుమారుడు నిరపరాధి' అని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. తెలంగాణ రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు వివాదంపై కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం కడప జిల్లాలో మీడియాతో ఆయన మాట్లాడారు. తన కుమారుడు, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ డ్రగ్స్ కేసులో చిక్కుకోవడంపై క్లారిటీ ఇచ్చారు. మొయినాబాద్ ఫాంహౌస్ ఘటనపై సుధాకర్ యాదవ్ స్పందించారు. తన కుమారుడిపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మొయినాబాద్ ఫాంహౌస్‌లో జరిగిన పార్టీకి ఎంపీ మహేశ్‌కుమార్ యాదవ్ వెళ్లిన మాట నిజమేనని పుట్టా సుధాకర్ యాదవ్ అంగీకరించారు. అయితే, తన కుమారుడికి ఎలాంటి చెడు అలవాట్లు లేవని, ముఖ్యంగా డ్రగ్స్ తీసుకునే అలవాటు అస్సలు లేదని స్పష్టం చేశారు. మహేశ్ వద్ద నుంచి కనీసం బ్లడ్ శాంపిల్స్ తీసుకోకుండానే రిపోర్టులో పాజిటివ్ అని ఎలా నిర్ధారిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ నిర్ధారణ పక్రియపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన నివేదికను తెలుగుదేశం పార్టీ అధిష్ఠానానికి సమర్పించినట్లు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వెల్లడించారు. పోలీసుల విచారణ ఇంకా కొనసాగుతోందని, ఇన్వెస్టిగేషన్ ముగిశాక అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. పోలీసుల విచారణ పూర్తయిన తర్వాత, మహేశ్ నిరపరాధి అని నిరూపించే అన్ని ఆధారాలతో మీడియా ముందుకు వస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు.

# రికార్డుల రారాజు

**హైదరాబాద్, మార్చి23( వెలుతురు):**
ప్రధాని నరేంద్ర మోదీ అరుదైన మైలురాయిని చేరుకున్నారు. మన దేశంలో సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వాధినేతగా బాధ్యతలు నిర్వహించిన వ్యక్తిగా నరేంద్ర మోదీ సరికొత్త రికార్డును క్రియేట్ చేశారు. నేడు మార్చి 22, ఆదివారం రోజున ఈ అరుదైన రికార్డును ఆయన సొంతం చేసుకున్నారు. తాజాగా మోదీ.. సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డును అధిగమించారు. పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట 8,930 రోజుల పాటు ముఖ్యమంత్రిగా సేవలందించిన రికార్డు ఉండేది. తాజాగా మోదీ దానిని అధిగమించారు.గుజరాత్ సీఎంగా, దేశ ప్రధానిగా ప్రభుత్వాధినేత హోదాలలో నరేంద్ర మోదీ 8,931 పనిదినాలను పూర్తి చేసుకున్నారు. దీంతో పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డు బద్దలైంది. ప్రధాన మంత్రి కాకముందు మోదీ.. దీర్ఘకాలం పాటు గుజరాత్ సీఎంగా వ్యవహరించి రికార్డు క్రియేట్ చేశారు. వరుసగా నాలుగు సార్లు ఆయన ముఖ్యమంత్రిగా సేవలందించారు.2001 అక్టోబరు 7 నుంచి 2002 డిసెంబరు 22 వరకు, 2002 డిసెంబరు 22 నుంచి 2007 డిసెంబరు 22 వరకు, 2007 డిసెంబరు 23 నుంచి 2012 డిసెంబరు 20 వరకు 2012 డిసెంబరు 20 నుంచి 2014 మే 22 వరకు నాలుగు సార్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ బాధ్యతలు నిర్వహించారు.భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జన్మించిన తొలి ప్రధానమంత్రిగానూ మోదీ నిలిచారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఘన విజయాల్లో మోదీ పాత్రే కీలకం. స్వాతంత్ర్యానంతరం జన్మించి, దీర్ఘకాలం ప్రధానిగా ఉన్న కాంగ్రెసేతర తొలి నేతగా మోదీ నయా రికార్డు క్రియేట్ చేశారు. అలాగే కేంద్రంలో రెండు సార్లు పదవీ కాలాన్ని పూర్తి చేసుకుని, మూడోసారి అధికారం చేపట్టిన తొలి కాంగ్రెసేతర నేతగా కూడా రికార్డు నెలకొల్పారు. జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత భారతదేశానికి అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న రెండో నేతగా కూడా మోదీ నిలిచారు. మోదీనాయకత్వంలో మోదీ 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా మూడు సార్లు విజయం సాధించారు. స్వాతంత్ర్యం తర్వాత జన్మించిన తొలి ప్రధాని కూడా ఆయనే కావడం ప్రత్యేకత. ప్రజల విశ్వాసం, బలమైన నాయకత్వం ఆయన విజయాలకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు.తన హయాంలో





దేశవ్యాప్తంగా పలు కీలక పథకాలు అమలు చేశారు. 'నారీశక్తి', 'యువశక్తి', రైతుల సంక్షేమం, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్టార్ట్-అప్ ఇండియా వంటి కార్యక్రమాలు దేశ అభివృద్ధికి బలమైన పునాది వేశాయి. గత దశాబ్దంలో కోట్లాది మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రభుత్వం పేర్కొంటోంది.తన తల్లి ఇచ్చిన విలువలు తన రాజకీయ జీవితానికి మార్గదర్శకమయ్యాయని మోదీ తరచూ పేర్కొంటారు. పేదల కోసం పని చేయడం, అవినీతి దూరంగా ఉంచుకోవడం వంటి సూత్రాలు ఆయన పాలనలో ప్రతిఫలిస్తున్నాయని అంటున్నారు. ప్రజాసేవను అత్యున్నత కర్తవ్యంగా భావిస్తున్నానని ఆయన పలుమార్లు స్పష్టం చేశారు.మోడీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థానాన్ని సంపాదించింది. అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ట పెరిగింది. విదేశీ పెట్టుబడులు, మౌలిక వసతుల అభివృద్ధి, సాంకేతిక రంగాల్లో పురోగతి దేశాన్ని "వికసిత భారత్" లక్ష్యానికి దగ్గర చేస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు.ఇక "వికసిత్ భారత్" లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మోడీ స్పష్టం చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ, సమగ్ర అభివృద్ధి సాధించడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. దేశ ప్రజల ఆశీర్వాదం, మద్దతుతో మరింత సేవ చేయాలని ఆయన ఆకాంక్షించారు.ప్రభుత్వాధినేత హోదాలో 25వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా 2025 అక్టోబరులో దేశ ప్రజలకు ప్రధాని మోదీ ధన్యవాదాలు చెప్పారు. 2001లో గుజరాత్ సీఎంగా ప్రమాణం చేసినప్పటి నుంచి ఇప్పటిదాకా ప్రజల జీవితాలను మెరుగుపర్చేందుకు, దేశ వికాసం కోసమే తాను పనిచేశానని ఆయన తెలిపారు. భీకర భూకంపం నుంచి గుజరాత్ రాష్ట్రం కొద్దికొద్దిగా కోలుకుంటున్న తరుణంలో తాను తొలిసారి గుజరాత్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశానని, అది చాలాపెద్ద పరీక్షా కాలమని మోదీ గుర్తుచేసుకున్నారు.

ఆ సమయానికి గుజరాత్‌ను రాజకీయ అస్థిరత, సూపర్ సైక్లోన్ విపత్తు, దారుణమైన కరువులు కుదిపేశాయని చెప్పారు. ఈ సవాళ్లను చూసి, ఎలాగైనా గుజరాత్ రాష్ట్రాన్ని పునర్ నిర్మించాలని తాను లక్ష్యంగా పెట్టుకున్నానని ఆయన తెలిపారు. కొత్త ఆశ, కొత్త శక్తితో సీఎంగా తొలి టర్మ్‌లో పనిచేశానని మోదీ పేర్కొన్నారు.సేదల కోసమే పనిచేయమని, ఎన్నడూ లంచం తీసుకోవద్దని తల్లి ఇచ్చిన సలహాలే తన ప్రజా జీవితానికి మార్గదర్శనాన్ని అందించాయని ప్రధాని మోదీ గతేడాది అక్టోబరులో తెలిపారు. తన పాలన వల్ల కరువు ప్రభావిత, ఆర్థిక బలహీన గుజరాత్ రాష్ట్రం సుపరిపాలనకు పవర్ హౌజ్‌గా మారిపోయిందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల రంగాల్లో రాష్ట్రం ఎంతో పురోగతిని సాధించిందని ఆయన పేర్కొన్నారు. భారతదేశం పాలనాపరమైన, విశ్వాసపరమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న వేళ 2013లో తనను ప్రధానమంత్రి అభ్యర్థిగా బీజేపీ ప్రకటించిందని మోదీ తెలిపారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో భారత ప్రజలంతా కలిసి తమ పార్టీకి పట్టం కట్టారన్నారు. గత 11 ఏళ్ల పాలనలో 25 కోట్ల మందికిపైగా దేశ ప్రజలను పేదరికం నుంచి బయటికి తీసుకొచ్చానని ఆయన చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో అత్యంత ప్రధానమైన ఆర్థిక శక్తిగా భారత్ అవతరించిందన్నారు. నారీ శక్తి, యువ శక్తి, రైతుల సాధికారత కోసం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మోదీ పేర్కొన్నారు. దేశ రాజ్యాంగ విలువలకు బలమిచ్చే వికసిత భారత్ సాధన కోసం అహర్నిశలు శ్రమిస్తానని ఆయన స్పష్టం చేశారు.

# చంద్రబాబును బుక్ చేసిన చిరంజీవి

**విజయవాడ, మార్చి23( వెలుతురు):**
తెలంగాణలో గద్దర్ అవార్డుల ప్రదానోత్సవంలో మెగాస్టార్ చిరంజీవిచేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన నోటి నుంచి వచ్చిన కొన్ని మాటలు అభ్యంతరకరంగా ఉన్నాయి. అనవసరంగా ఆయన ఆ వ్యాఖ్యలు చేశారా? అని అనిపించేలా ఉన్నాయి. ఆయనకు ఎన్టీఆర్ జాతీయ అవార్డు ఇచ్చారు. అయితే చిరంజీవి నందమూరి తారక రామారావు గురించి ఒక్క ప్రస్తావన కూడా చేయలేదు. ఆయన పేరుతో అవార్డు తీసుకున్నందుకు ఒకటి రెండు మాటలు అయినా చెప్పి ఉండాల్సింది. కానీ ఎందుకో చిరంజీవి ఎన్టీఆర్ ప్రస్తావన తీసుకురాలేదు. సహజంగానే ఏదైనా అవార్డులు ఎవరి పేరు మీద అయినా తీసుకుంటే వారి గురించి ప్రస్తావించడం అనేది ముఖ్యం. కానీ ఎందుకో చిరంజీవి ఆ విషయంలో పొరపాటు చేసినట్టు కనిపించారు. అయితే వెంటనే దానిని సరిదిద్దుకున్నారు. ఎన్టీఆర్ అవార్డు తీసుకోవడం పై ట్వీట్ చేశారు. ఆయన పేరుతో అవార్డు తీసుకోవడం పై ఆనందం వ్యక్తం చేశారు.అయితే అదే వేదికపై పక్క రాష్ట్రం అని ఏపీని ఉద్దేశించి చిరంజీవి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆంధ్రప్రదేశ్ను పక్క రాష్ట్రం తో పోల్చడం ఏమిటని విమర్శలు వచ్చాయి. తెలంగాణ వేదికగా ఏపీ పక్క రాష్ట్రం కావచ్చు కానీ.. సాటి తెలుగు రాష్ట్రం. అందున సినిమా రంగానికి చెందిన వ్యక్తిగా ఆ మాట అనకూడదు. మరోవైపు కళారంగాన్ని ఆదరించడం, సినీ పరిశ్రమను ప్రోత్సహించడంలో పక్క రాష్ట్రం వెనుకంజలో ఉందని చిరంజీవి వ్యాఖ్యానించారు. అంటే నంది అవార్డులను ఇవ్వాలన్నది చిరంజీవి అభిమతం గా తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి..తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పక్కన ఉండగానే ఏపీ సీఎం చంద్రబాబు ప్రస్తావన తీసుకొచ్చారు చిరంజీవి. నంది అవార్డులను పునరుద్ధరించే విషయంలో చంద్రబాబు ఒక ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా చంద్రబాబు నంది అవార్డులను నిలిపివేశారన్న అభిప్రాయం వచ్చేలా చిరంజీవి వ్యాఖ్యలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఆయన సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తి. ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకున్న పవన్ కళ్యాణ్ అభిప్రాయం తీసుకుంటూ వస్తుందనలో సందేహం లేదు. అందులోనూ సినీ పరిశ్రమకు సంబంధించిన పూర్తి





వ్యవహారాలన్నీ పవన్ కళ్యాణ్ చూస్తారు. సినిమాటోగ్రఫీ మంత్రిగా జనసేనకు చెందిన కందుల దుర్గేష్ ఉన్నారు. ఆ ఇద్దరికీ చెబితే ఇట్టే పని జరిగిపోతుంది. కానీ చిరంజీవి మాత్రం చంద్రబాబు ప్రస్తావన తీసుకురావడం విమర్శలకు తావిస్తోంది. అనవసరంగా చంద్రబాబును ఇందులో ఇన్వాల్వ్ చేయడం ఏమిటనేది ఒక ప్రశ్న. ఏపీలో నంది అవార్డులను నిలిపివేసింది జగన్మోహన్ రెడ్డి. వాస్తవానికి తెలుగుదేశం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత నంది అవార్డులను ఇచ్చింది. అయితే 2017లో మొత్తం నాలుగు సంవత్సరాలకు సంబంధించి అవార్డులను ప్రదానం చేశారు. కానీ ఆ సమయంలో సొంతవారికి అవార్డులు ఇచ్చుకున్నారు అన్న విమర్శలు వచ్చాయి. ఇదే సినీ పరిశ్రమకు చెందిన చాలామంది వ్యక్తులు విమర్శలు చేశారు..

అటు తరువాత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నంది అవార్డులను పూర్తిగా ఇవ్వలేదు. కానీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు కనీసం నోరు తెరవలేదు. పోనీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు ఎవరు సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలవలేదు. అటువంటప్పుడు నంది అవార్డుల విషయంలో చిరంజీవి ప్రత్యేకంగా ఇప్పుడు ఏపీ ప్రభుత్వాన్ని చిన్నచూపు చూసి మాట్లాడడం ఏమిటనేది ప్రశ్న.రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం విషయంలో సినీ పరిశ్రమ ఒకలా ఉంటుంది. ఏపీ ప్రభుత్వం విషయంలో మరోలా వ్యవహరిస్తోంది. ఎందుకంటే తెలంగాణలో సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తుల ఆస్తులు, పెట్టుబడులు ఎక్కువగా ఉన్నాయి. అందుకే వారి ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం విషయంలో భయము ఉంటుంది. కానీ ఏపీ మాత్రం కేవలం ప్రేక్షక వర్గానితోపాటు వీక్షక వర్గానికి మాత్రమే పరిమితం అయింది. కేవలం ఆదాయం ఇస్తుందే తప్ప సినీ పరిశ్రమ పెద్దలకు ఇక్కడ ఆస్తులు లేవు. అందుకే ఏపీ ప్రభుత్వం పై నోరు మెదిపే సినీ పరిశ్రమ వ్యక్తులు.. తెలంగాణ ప్రభుత్వం పై మాత్రం చాలా జాగ్రత్తగా మాట్లాడుతారు. అయితే చిరంజీవి చివరిగా ఒక మాట చెప్పారు. సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తేనే జీడీపీ పెరుగుతుందనేది చిరంజీవి వాదన. కానీ ఒక చిన్న పరిశ్రమ ఏడాది లావాదేవీలకు కూడా చిత్ర పరిశ్రమ సాటి రాదు అన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలి. వేలాదిమందికి ఉపాధినిస్తుంది ఓకే. సంప్రదాయ సాంస్కృతిక రంగం సినిమా. అంతవరకు ఓకే కానీ.. రాష్ట్ర అభివృద్ధిలో కీలకం అన్న విషయం మాత్రం ఉత్తమాటే. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో చిత్ర పరిశ్రమ ఒక్కటే. నంది అవార్డుల పేరిట ఉన్న దానిని మార్చి గద్దర్ పేరిట ఇస్తున్నారు. ఇప్పుడు మళ్లీ ఏపీ ప్రభుత్వం ఇస్తే ఆ అవార్డులకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు. బహుశా ఏపీ ప్రభుత్వం ఆ ఆలోచనతోనే నంది అవార్డులను పునరుద్ధరించలేదు. కానీ చిరంజీవి వేదికపై యధాలపంగా మాట్లాడిన వ్యాఖ్యలు ఇంతటి దుమారానికి దారి తీయడం మాత్రం ఆందోళన కలిగిస్తోం

# మిట్టల్ స్టీల్‌తో పారిశ్రామిక హబ్‌గా విశాఖ

**- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్**

**అమరావతి, మార్చి23( వెలుతురు):**
ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాకతో విశాఖ ప్రాంతం పరిశ్రమల హబ్‌గా మారుతోందని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, యువ నేత, మంత్రి నారా లోకేశ్ కష్టానికి ప్రతిఫలం ఈ ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ఎ÷-లాంట్ ఏర్పాటు అని ఆయన పేర్కొన్నారు. సోమవారం రాజధాని అమరావతిలో మంత్రి అనగాని సత్య ప్రసాద్ విలేకర్లతో



మాట్లాడుతూ.. ఈ స్టీల్ ఎ÷-లాంట్ ఏర్పాటుతో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి చరిత్రలో నేడు ఓ గొప్ప మైలురాయి అని ఆయన అభివర్ణించారు. ఉక్కు రంగంలో రాష్ట్రానికి రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగిందని మంత్రి అనగాని వివరించారు. అనకాపల్లి జిల్లా రాజయ్యపేటలో సోమవారం మధ్యాహ్నం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమార స్వామితో కలిసి సీఎం చంద్రబాబు ఈ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులతోపాటు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొనున్నారు. ఈ స్టీల్ ప్లాంట్ ద్వారా లక్ష మందికిపైగా ఉపాధి కలగనుంది. ఈ స్టీల్ ఎ÷-లాంట్‌కు అనుబంధంగా రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్ట్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో మరో 6 వేల ఉద్యోగాలు క్యాప్టివ్ పోర్ట్ ద్వారా రానున్నాయి. ఇక ఈ స్టీల్ ఎ÷-లాంట్ ద్వారా లక్ష మందికిపైగా ఉపాధి కలగనుంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com